
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 212

సోమవారం 17-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ముంబై ఫటాఫట్...

మెరిసిన ఇషాన్, సూర్యకుమార్.. కోల్‌కతాకు మూడో ఓటమి - 12లో



ఆరోగ్య బీమా.. పోర్టింగ్‌తో ధీమా

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం -13లో



కర్ణాటకలో రూ.170 కోట్లు సీజ్

కర్ణాటకలో ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.170 కోట్ల సొత్తు పట్టుబడిందని ఎన్నికల సంఘం తెలిపింది.

వివరాలు 6లో ▸



బీజేపీకి జగదీశ్ షెట్టర్ గుడ్‌బై

కర్ణాటకలో అధికార బీజేపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



సూడాన్‌లో ఘర్షణలు..

సూడాన్‌లో సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య ఘర్షణల్లో 61 మందికి పైగా మరణించారు. ఇందులో ఓ భారతీయుడు ఉన్నాడు.

వివరాలు 6లో ▸



జుట్టుపైనా వివక్ష!

అమెరికాలో జుట్టుపైనా వివక్ష చూపిస్తున్నారు. దీంతో నల్ల జుట్టుపై వివక్షను నిషేధిస్తూ టెక్సాస్ హౌస్ బిల్లును ఆమోదించింది.

వివరాలు 6లో ▸



విద్యాకానుకపై 'ఈనాడు' తప్పుడు ప్రచారం

జగనన్న విద్యా కానుకపై 'ఈనాడు' పత్రిక అసత్యాలతో దుష్ప్రచారం చేస్తోందని విద్యా శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులకు బూట్ల సైజు సరిపోవడం లేదంటూ తప్పుడు రాతలు రాస్తోందని మండిపడింది. వాస్తవాలను వివరిస్తూ ప్రకటన విడుదల చేసింది.

- వివరాలు 14లో

హెట్‌మైర్ తడాఖా..

గుజరాత్‌కు రాజస్తాన్ రాయల్స్ షాక్ 12 లో

నిజాలు దాచి దర్యాప్తా?

పర్సన్ కాదు.. ఫ్యాక్ట్ టార్గెట్ ఇన్వెస్టిగేషన్ కావాలి • మీడియాతో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

- వివేకాది మర్డర్ అని తెలిసీ డెత్ నోట్ దాచిపెట్టిన వ్యక్తి రాజశేఖరరెడ్డి
- డాక్యుమెంట్లు చోరీ చేశామని స్వయంగా ఏ–4 దస్తగిరే చెప్పాడు
- ఆ దిశగా విచారణ చేయాలని అభ్యర్థించినా పట్టించుకోలేదు
- మునుపటి అధికారి రోల్‌నే కంటిన్యూ చేస్తున్నారు
- అప్రూవర్ అనే అబద్ధాల మీద కట్టిన కట్టడం నిలబడదు
- న్యాయస్థానాలపై గౌరవం ఉంది.. నిజాయితీ నిరూపించుకుంటాం
- విలేకరులతో మాట్లాడిన కొద్ది సేపటికే అవినాశ్‌రెడ్డికి నోటీసులు
- నేటి మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ విచారణకు సీబీఐ పిలుపు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి



వైద్య పరీక్షల నిమిత్తం భాస్కర్‌రెడ్డిని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

సాక్షి, పులివెందుల: 'అత్యున్నత స్థాయి విచారణ సంస్థ దిగజారి ప్రవర్తిస్తోంది. కీలక అంశాలను మరుగు పరుస్తూ, సిల్లీ అంశాల ఆధారంగా విచారణ చేస్తోంది. పర్సన్ టార్గెట్ ఇన్వెస్టిగేషన్ కాదు.. ఫ్యాక్ట్ టార్గెట్ ఇన్వెస్టిగేషన్ చేయాలని సీబీఐ డైరెక్టర్, డీఐజీ, కొత్తగా నియమితులైన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను కలిసి అభ్యర్థించినా ఆ దిశగా కనీస విచారణ చేపట్టలేదు' అని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు ఆదివారం పులివెందులలో ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఎంపీ మీడియాతో మాట్లాడారు. తన తండ్రిని ఊహించని విధంగా అరెస్టు చేశారని, మాటలు రానంత బాధగా ఉందన్నారు. వ్యతిరేక శక్తులు, వ్యతిరేక మీడియాతో పోరాటం చేయడంలో నిజాయితీ నిరూపించుకోవడం సవాల్‌గా నిలుస్తోందని చెప్పారు. సీబీఐ కీలక అంశాలను డౌన్‌ప్లే చేసి, సిల్లీ అంశాల ఆధారంగా ఎందుకు విచారణ కొనసాగిస్తోందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మునుపటి అధికారి చేసిన రోల్

మిగతా 2వ పేజీలో ▶

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్

- పులివెందులలో అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు
- హైదరాబాద్‌లో సీబీఐ న్యాయమూర్తి ఎదుట హాజరు.. 14 రోజుల రిమాండ్

2లో

ఇదేం దర్యాప్తు?

- భాస్కర్‌రెడ్డి అరెస్ట్‌పై భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా హోరెత్తిన నిరసన

2 లో

కళ్లకు గంతలతోనే దర్యాప్తు

- సత్యదూరంగా సీబీఐ రిమాండ్ రిపోర్ట్.. వాస్తవాలు, కుట్రకోణాలను విస్మరించిన సీబీఐ
- వివేకా రెండో వివాహంతో తలెత్తిన విభేదాలను పట్టించుకోని తీరు
- సునీత మాట మార్చడం వెనుక కారణాలనూ వెదికి తీయని వైనం
- హంతకుడిని అప్రూవర్‌గా మార్చి... కల్పితాలకు పెద్దపీట

- వివరాలు 10లో



లిక్కర్ స్కామ్‌లో మీ పాత్ర ఏంటి?

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ప్రశ్నించిన సీబీఐ

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు ఆదివారం ప్రశ్నించారు. ఉదయం 11 గంటలకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఢిల్లీ మంత్రులతో కలిసి సీబీఐ కార్యాలయానికి చేరుకున్న కేజ్రీవాల్‌పై దాదాపు 9 గంటలపాటు ప్రశ్నల వర్షం కురిపించారు. కాగా, సీబీఐ అధికారులు 56 ప్రశ్నలు అడిగారని కేజ్రీవాల్ చెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని.. ప్రాణాలు వదులుకుంటా తప్ప నిజాయితీని కాదన్నారు. బీజేపీ నేతలు శక్తివంతమైన వ్యక్తులని.. నేరం చేసినా, చేయకున్నా జైలుకు పంపించగలరని ఆరోపించారు.

6 లో



'భావనపాడు'కు మూలపేట పోర్టుగా నామకరణం

శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్టుకు మూలపేట పోర్టుగా నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. స్థానిక ప్రజల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. భావనపాడు పోర్టుగా నోటిఫై అయిన ప్రాంతాన్ని.. ఇకపై మూలపేట పోర్టుగా పరిగణించాలని స్పష్టం చేసింది.

- వివరాలు 10లో



సింహగిరిపై చందనం అరగదీత ప్రారంభం

సింహగిరిపై కొలువైన వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి తొలి విడత చందనం అరగదీతను దేవస్థానం అర్చకులు ప్రారంభించారు. 23న వైశాఖ శుద్ధ తదియ నాడు చందనోత్సవం నిర్వహించనున్నారు.

- వివరాలు 5లో

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

వైద్య విద్యార్థులకు జాతీయ మెడికల్ కమిషన్ హెచ్చరిక

- విద్యార్థులు మానసిక స్థైర్యం కలిగి ఉండాలి
- రోగుల సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టొద్దు
- వారితో సహనంతో వ్యవహరించాలని స్పష్టీకరణ
- మెడికోల వృత్తిపర బాధ్యతలపై మార్గదర్శకాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడరాదని.. అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) హెచ్చరించింది. విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలని.. రోగులతో మర్యాదగా, సున్నితంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. మారుతున్న వైద్య విధానాలు, సాంకేతికత, చికిత్సలపై అవగాహన పెంచుకోవాలని సూచించింది. రోగులు, వారికి సంబంధించిన సమాచారాన్ని

మిగతా 10వ పేజీలో ▶

ఎన్‌ఎంసీ మార్గదర్శకాల్లోని ఇతర ముఖ్యాంశాలివీ..

సమాజం నుంచి నేర్చుకోవడం వైద్యవిద్యలో ముఖ్యమైన భాగం. జీవన ప్రమాణాలు, సామాజిక పరిస్థితులు, ప్రాథమిక సౌకర్యాలు, వైద్య ఆరోగ్య వసతులు, పర్యావరణ పరిస్థితులు తెలుసుకోవాలి. రోగులు ఆస్పత్రికి వచ్చినప్పుడు వారిని, వారి సమస్యను అర్థం చేసుకోవాలంటే ఇలాంటి జ్ఞానం, అనుభవం అవసరం. వీలైనప్పుడల్లా విద్యార్థులు వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలి.

వైద్యవిద్య కోర్సు కొన్ని ఒత్తిళ్లు, సవాళ్లతో కూడి ఉంటుంది. అవసరమైతే వృత్తిపరమైన సాయాన్ని పొందాలి. కాలేజీలు నిర్వహించే యోగా, ధ్యానం శిక్షణలో పాల్గొనాలి. తద్వారా మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలి. విద్యార్థులు ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించడానికి రెఫరల్ సిస్టమ్ ఉండాలి. కాలేజీలు స్టూడెంట్ల ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి.



మెడికల్ కాలేజీలు పరీక్షల విషయంలో నిజాయతీగా వ్యవహరించాలి. అంతర్గత మూల్యాంకన మార్కులను పెంచకూడదు.

విద్యార్థులు పేరున్న ఆస్పత్రులు నిర్వహించే వైద్యారోగ్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన ప్రచార కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనడం అవసరం.

రాష్ట్రంలో ఎలిస్టా టీవీ తయారీ యూనిట్

కడపలో రూ.250 కోట్లతో ఎల్‌ఈడీ టీవీ, మానిటర్స్ తయారీ..

2024 తొలి త్రైమాసికానికి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభం

సాక్షి, అమరావతి: ప్రముఖ హోమ్ అప్లియన్సస్ సంస్థ ఎలిస్టా రూ.250 కోట్లతో రాష్ట్రంలో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. కడపలో 1,32,300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎలిస్టా సీఎండీ సాకేత్ గౌరవ్ ప్రకటించారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఈ పెట్టుబడులకు సంబంధించి ఒప్పందం చేసుకున్నామని, త్వరలోనే నిర్మాణ పనులు మొదలు పెడతామని మీడియాకు తెలిపారు. తొలుత ఏడాదికి పదిలక్షల టీవీలు, పదిలక్షల ఎల్‌ఈడీ మానిటర్స్ తయారీ సామర్థ్యంతో ఈ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా 500 మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. దేశీయ హోమ్ అప్లియన్సస్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. 2021లో రూ.5,36,370 కోట్లు ఉన్న హోమ్ అప్లియన్సస్ మార్కెట్ పరిమాణం 2027 నాటికి రూ.12,89,889 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈ యూనిట్ వచ్చే ఏడాది ప్రారంభానికి వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా అంతర్జాతీయ అవసరాలనూ తీర్చనున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి మృతి

భర్త వర్ధంతికి వస్తుండగా ప్రమాదం

జోగులాంబ గద్వాల జిల్లా కొండేరు వద్ద బోల్తాపడిన కారు





ప్రమాదంలో దెబ్బతిన్న కారు (ఇన్‌సెట్‌లో) నీరజారెడ్డి ఫైల్ ఫొటో

కర్నూలు(హాస్పిటల్)/ఆలూరు రూరల్/ఎర్రవల్లి చౌరస్తా: కర్నూలు జిల్లా ఆలూరు మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజా రెడ్డి (50) రోడ్డు ప్రమాదంలో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈ నెల 18వ తేదీన భర్త శేషిరెడ్డి వర్ధంతి ఉండడంతో హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన దేవనకొండ మండలంలోని తెర్నెకల్ గ్రామానికి ఆమె ఆదివారం మధ్యాహ్నం కారులో బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న కారు జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కొండేరు సమీపంలోని కొట్టం కళాశాల వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు టైర్ పేలడంతో అదుపుతప్పి ఒక్కసారిగా పల్టీలు కొట్టింది. నీరజా రెడ్డి సీటు బెల్టు ధరించకపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5 గంటల సమయంలో మృతి చెందారు. డ్రైవర్ బాబ్జీకి గాయాలయ్యాయి. నీరజారెడ్డి ప్రమాదవార్త తెలిసి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్థానిక పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కాటసానితో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ ఆస్పత్రికి చేరుకున్నారు. నీరజారెడ్డి మృతికి సంతాపం ప్రకటించారు.

నీరజారెడ్డి రాజకీయ ప్రస్థానం

వైఎస్సార్ జిల్లా వేంపల్లి గ్రామానికి చెందిన రాంచిన్నారెడ్డి (హైకోర్టు రిటైర్డ్ జడ్జి) కుమార్తె నీరజారెడ్డిని 1988లో కర్నూలు జిల్లా తెర్నెకల్ గ్రామానికి చెందిన సోమిరెడ్డి చిన్న కుమారుడు శేషిరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. శేషిరెడ్డి 1989లో పత్తికొండ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1996లో శేషిరెడ్డి హత్యకు గురయ్యారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నీరజా రెడ్డి రాజకీయాల్లోకి

మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ సంగతి



గ్యాంగ్‌స్టర్ల హత్య కేసులోని నిందితులు



పెద్ద క్రిమినల్స్ అవుదామని..

నేర ప్రపంచంలో పెద్ద గుర్తింపు కోసమే ఉత్తరప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్లు అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్‌ను హత్య చేసినట్లు నిందితులు వెల్లడించారు. ఈ కేసులో లవ్లేష్ తివారీ, మోహిత్ అలియాస్ సన్నీ, అరుణ్ మౌర్యను పోలీసులు అరెస్టు చేయగా.. వారికి కోర్టు 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. చట్టప్రకారమే నేరగాళ్లకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేసింది. లేకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు అని స్పష్టం చేసింది.

- వివరాలు 6లో

జగన్ సంక్షేమ పథకాలతో బాబు, రామోజీలకు భయం

- ప్రభుత్వ పథకాలపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు
- అయినా ప్రజలు సీఎం వైఎస్ జగన్‌తోనే ఉంటారు
- చంద్రబాబు సహకారంతో రామోజీరావు శంషాబాద్‌లో 450 ఎకరాలు కొన్నారు
- అమరావతిలోనూ తన బినామీల ద్వారా భూములు కొనిపించారు
- మా అబ్బాయిని రామోజీ వేధించారు
- దీంతో డాల్ఫిన్ హోటల్ ఎండీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు
- నా కుమార్తెను కూడా కళాంజలి నుంచి తరిమేశారు

3 లో

'సాక్షి' ఇంటర్వ్యూలో రామోజీ తోడల్లుడు అప్పారావు



అప్పట్లో లిక్కర్ కాంట్రాక్టర్ల నుంచి చంద్రబాబుకు భారీగా నిధులు ముట్టిన విషయం తెలిసి.. ఈనాడులో దీనిపై కార్టూన్ వేశారు. ఆ మరుసటి రోజే చంద్రబాబు రామోజీ కాళ్లు పట్టుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరూ ఒక్కటైపోయారు. చంద్రబాబు సహకారంతో రామోజీ వందలాది ఎకరాల భూములు కొన్నారు. అమరావతిలోనూ బినామీలతో భూములు కొనుగోలు చేయించారు. ఈనాడు ద్వారా బయటవాళ్లకు నీతులు చెబుతూ.. తాను మాత్రం పాటించననే అహం రామోజీకే సొంతం.

– రామోజీ తోడల్లుడు అప్పారావు

భారత మధ్యవర్తిత్వ దినోత్సవంలో జస్టిస్ రవీంద్రన్, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ ఎన్వీ రమణ, సింగపూర్ ఐఏఎంసీ చైర్మన్ జార్జ్ లిమ్, జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు



మధ్యవర్తిత్వంపై త్వరలో చట్టం

- పార్లమెంటులో కేంద్రం బిల్లు ప్రవేశపెట్టనుంది
- అమల్లోకి వస్తే కేసుల పరిష్కారం వేగవంతమవుతుంది
- 'భారత మధ్యవర్తిత్వ దినోత్సవం'లో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ
- పూర్వీకుల కాలం నుంచే 'మధ్యవర్తిత్వం' ఉంది: జస్టిస్ హిమాకోహ్లి
- పాల్గొన్న జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జస్టిస్ రవీంద్రన్

10 లో

కళ్లకు గంతలతోనే దర్యాప్తు

సత్యదూరంగా సీబీఐ రిమాండ్ రిపోర్ట్

- హంతకుడిని అప్రూవర్‌గా మార్చి... కల్పితాలకు పెద్దపీట
- జైల్లో ఉండాల్సిన హంతకుడికి... బయట విలాసాల జీవితం
- సీబీఐకి కావాల్సినట్లుగా చెప్పటంతో మారిపోయిన దస్తగిరి లైఫ్
- కుట్రదారులు ఎవరనే కీలక అంశాలను అస్సలు పట్టించుకోని సీబీఐ
- ఆద్యంతం కట్టుకథ... అతుకుల బొంతగా భాస్కర్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్
- కొత్త బృందం ...కానీ ఒక్క కొత్త ఆధారం కూడా లేదు
- పాత బృందం కక్షపూరిత చర్యలే కొనసాగుతున్నాయన్న సందేహాలు!!

సాక్షి, అమరావతి: ఏనుగు కాళ్లు, తొండం, తోక పట్టుకుని నలుగురు అంధులు గనక ఆ ఏనుగెలా ఉందో ఊహిస్తూ చెబితే ఏమవుతుంది? వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ కూడా ఇలాగే చేస్తోంది. వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసిన సీబీఐ... కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టు దీన్నే తలపిస్తోంది. కుట్రదారులెవరో నిగ్గుతేల్చే నిప్పు కణికల్లాంటి అంశాలను పూర్తిగా వదిలేసి దర్యాప్తు సాగిస్తుండటమే విస్మయం కలిగిస్తోంది. అవేంటంటే..

- వైఎస్ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఆస్తి కోసం..రాజకీయ వారసత్వం కోసం ఘర్షణలు చోటుచేసుకున్నాయి.
- మెజార్టీ ఓట్లు ఉన్నప్పటికీ స్థానిక కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన వైఎస్ వివేకానంద రెడ్డి ఓడిపోయారు. టీడీపీ గెలిచింది.
- వివేకా గుండెపోటుతో మరణించారని తొలిసారిగా చెప్పింది ఆయన పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డి. ఆయన తొలుత చెప్పింది టీడీపీ మంత్రి ఆది నారాయణరెడ్డికే.
- వైఎస్ అవినాశ్‌ను ఎంపీగా గెలిపించేందుకు తన తండ్రి కృషి చేస్తున్నారన్న సునీత... మళ్లీ మాట మార్చి అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎందుకని?
- స్వయంగా హత్య చేశాడంటున్న దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడం సరైనదేనా?.. రూ.40 కోట్ల సుపారీ కట్టుకథలో అడుగడుగునా అవాస్తవాలే.
- నార్కో పరీక్షల్లో ఏమీ చెప్పని రంగయ్య తరువాత ఏదో చెప్పారట..!
- ఆధారాల ధ్వంసం అంటున్న సీబీఐ... ఆ మూడు వేలిముద్రలపై ఎందుకు మౌనంగా ఉంటోంది?
- వివేకా హత్య కుట్రదారులు ఆయన అల్లుడు, పెద్ద బావమరిదే అంటున్న తులసమ్మ మాటల నెందుకు పట్టించుకోరు?

ఇవీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక అంశాలు.. కానీ కళ్లకు గంతలు కట్టుకున్న రీతిలో సీబీఐ వాటినేమాత్రం పట్టించుకోవడం లేదు. ముందుగా నిర్ణయించుకున్నట్టుగా... ఎవరో ప్రభావితం చేస్తున్నారన్నట్టుగా ముందుకెళుతోంది. కుట్రదారులు ఎవరన్న కోణంలో కాకుండా...ముందే ఓ నిర్ణయానికి వచ్చేసి ఆ దిశగా వెళుతోందనటానికి భాస్కర్‌రెడ్డి అరెస్టే తాజా తార్కాణం. తన చర్యను సమర్థించుకుంటూ సీబీఐ సమర్పించిన రిమాండ్ రిపోర్ట్ నిండా కల్పితాలు...ఊహాజనితాలు... అవాస్తవాలే!. ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థ కేవలం గాలి మాటలు పోగేసి రిమాండ్ నివేదికను రూపొందించడం ఆశ్చర్యమే మరి. రిమాండ్ రిపోర్ట్‌లో సీబీఐ ప్రస్తావించిన అంశాలు ఒకసారి పరిశీలిస్తే...

వివేకాను కుట్రపూరితంగా ఓడించిందెవరు?

వైఎస్ వివేకానందరెడ్డి 2017 కడప జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేశారు. తగినంత బలం ఉంది కనక గెలుస్తారన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు టికెట్టిచ్చారు. కానీ ఓడిపోయారు. అందుకు వైఎస్ భాస్కర్ రెడ్డే కారణమని వివేకా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సీబీఐ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. అందుకే వివేకాపై భాస్కర్‌రెడ్డి కక్ష పెంచుకున్నారన్నట్టుగా చెప్పింది. కానీ వాస్తవం ఏమిటంటే... ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఓడించింది స్వయానా చంద్రబాబు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వివేకానంద రెడ్డి గెలుపు నల్లేరుపై నడకే. కానీ చంద్రబాబు పన్నాగంలో భాగంగా అప్పటి టీడీపీ మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి, టీడీపీ నేత బీటెక్ రవి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురిచేశారు. కుట్ర పూరితంగా వివేకాను ఓడించారు. ఇది వైఎస్సార్ జిల్లాలో బహిరంగ రహస్యం. అంటే వైఎస్ వివేకానందరెడ్డి ఎవరిపై ఆగ్రహించాలి? వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచినా.. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీలో చేరి మంత్రి అయి తనను ఓడించిన ఆదినారాయణ రెడ్డిపై కదా? సీబీఐ మాత్రం భాస్కర్‌రెడ్డిపై ఆగ్రహించినట్టుగా కట్టు కథను అల్లడం విస్మయ పరిచేదే.

ఇక వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఇప్పటికీ ఆదినారాయణ రెడ్డితో సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. తన తండ్రిని ఓడించిన ఆయనతో వారికి సన్నిహిత సంబంధాలు ఎందుకున్నాయి? వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కూడా తన భార్య, కుమార్తె, అల్లుడి ఒత్తిడితోనే వివేకానందరెడ్డి మంత్రి అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. వారి ఒత్తిడితోనే ఏకంగా వైఎస్ విజయమ్మపై పులివెందుల ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం తన చిన్నాన్నపై పూర్తి గౌరవంతో పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వైఎస్ వివేకానంద రెడ్డికి రాజకీయ శత్రువులు టీడీపీ నేతలైన ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవిలేనని.. ఆయన రాజకీయ జీవితాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నించింది కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డేనని స్పష్టమవుతోంది. మరి ఈ దిశగా సీబీఐ ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నదే సందేహాలకు తావిస్తోంది.

ఎంపీ టికెట్ అవినాశ్ రెడ్డిదేనని అప్పటికే స్పష్టత

కడప సిట్టింగ్ ఎంపీగా ఉన్న అవినాశ్‌రెడ్డికే 2019 ఎన్నికల్లో కూడా టికెట్ ఇస్తున్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మౌఖికంగా ప్రకటించేశారు. దాంతో అవినాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కూడా మొదలుపెట్టారు. ఆయన ఎన్నికల ప్రచారానికి వైఎస్ వివేకానందరెడ్డే ఇన్‌చార్జి. ఆ విషయాన్ని వివేకా హత్యకు గురైన తరువాత కూడా ఆయన కుమార్తె సునీత మీడియా ముఖంగా చెప్పారు. మరి కడప ఎంపీ టికెట్ కోసమే వైఎస్ వివేకాపై భాస్కర్‌రెడ్డి కుటుంబం కక్ష పెంచు

వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు

సీబీఐ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్న మరో అంశం ... వివేకానందరెడ్డి రెండో వివాహం...దాంతో ఆ కుటుంబంలో తలెత్తిన తీవ్ర విభేదాలు, ఆస్తి తగాదాలు. వీటిని సీబీఐ నామమాత్రంగానైనా దర్యాప్తు చేయకపోవడం వెనుక ఎవరి ఒత్తిడి ఉందన్నది ప్రశ్నగా మారుతోంది. షమీమ్ అనే ముస్లిం మహిళను వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకున్నారని.. వాళ్లిద్దరికీ ఒక కుమారుడు కూడా పుట్టాడని... ఆ కుమారుడికి ఆస్తిలో భాగంతో పాటు తన రాజకీయ వారసుడిగా చేస్తానని ప్రకటించారన్నది ఆ జిల్లాలో అందరికీ తెలిసిందే. దాంతో వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి ఆయనతో తీవ్రంగా గొడవపడ్డారు. ఆయన్ని వదిలి కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వివేకా ఒక్కరే పులివెందులలో ఉంటున్నారు. బెంగళూరులో ఓ భూమి సెటిల్‌మెంట్ ద్వారా వచ్చే రూ.2 కోట్లను


రెండో భార్య షమీమ్, కుమారుడితో వివేకా

తన రెండో భార్యకు ఇవ్వాలని వివేకా నిర్ణయించారు. దాంతో సునీత ఆయనతో గొడవపెట్టుకున్నారు. అంతేకాక సునీత, ఆమె భర్త నర్రెడ్డి, బావగారు శివ ప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగారు. వివేకాను విడిచిపెట్టకపోతే ఆమె కుమారుడిని చంపేస్తామని బెదిరించారు. వివేకానంద రెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, వైఎస్ సునీత మధ్య వాట్సాప్‌లో వాదోపవాదాలు సాగాయి. ఒకర్ని ఒకరు దూషించుకున్న వాట్సాప్ మెస్సేజులను కూడా గతంలో సిట్ అధికారులు గుర్తించారు. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని... ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా... అవ్వడం లేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఈ వారసత్వ, ఆస్తి గొడవలే వివేకా హత్యకు ప్రధాన కారణమయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. ఎందుకంటే వివేకానందరెడ్డి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదికే ఎక్కువ ప్రయోజనం. కానీ సీబీఐ మాత్రం ఈ కీలకాంశాలన్నిటినీ విస్మరిస్తూ ఏకపక్షంగా కక్షపూరితంగా దర్యాప్తు చేస్తోందనే విమర్శలున్నాయి.

రూ.40కోట్ల సుపారీ కట్టుకథే..

దస్తగిరి అప్రూవర్ వాంగ్మూలం పేరిట సీబీఐ అల్లిన మరో కట్టుకథ రూ.40 కోట్ల సుపారీ స్టోరీ. వైఎస్ వివేకాను హత్య చేయడానికి రూ.40 కోట్లకు సుపారీ కుదిరిందని, అందులో రూ.5కోట్లు అడ్వాన్స్ వచ్చిందని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పి తనకు రూ.కోటి ఇచ్చారని దస్తగిరి వాంగ్మూలంలో చెప్పినట్టు సీబీఐ పేర్కొంది. మరి అదే సీబీఐ వెలికి తీసిన దస్తగిరి, సునీల్ యాదవ్ మధ్య వాట్సాప్ సందేశాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. వివేకా హత్యకు రెండు రోజుల ముందు వరకు... ఆ తరువాత కూడా దస్తగిరి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానంటూ సునీల్ యాదవ్‌కు మెస్సేజులు చేశారు. కనీసం రూ.2 వేలు అయినా అప్పు ఇవ్వాలని... రూ.500 ఇచ్చినా ఆ పూట ఖర్చుకు సరిపోతాయని ప్రాధేయపడ్డారు. ఆ వివరాలన్నీ కూడా సీబీఐనే వెల్లడించింది. మరి దస్తగిరి రూ.కోటి అడ్వాన్స్‌గా తీసుకుని ఉంటే రూ.500 అప్పు ఎందుకడుగుతాడు? అంటే రూ.40కోట్ల సుపారీ కట్టు కథే కదా?

అప్రూవర్‌గా మారగానే దస్తగిరికి డబ్బేదస్కం

ఇక అప్పటివరకు కటిక పేదరికంలో కొట్టుమిట్టాడిన దస్తగిరి అప్రూవర్‌గా మారిపోగానే ఒక్కసారిగా ధనవంతుడైపోయాడు. ఒక్కసారిగా కార్లలో తిరుగుతూ... ట్రాక్టర్లు కొనుగోలు చేసి... సెటిల్‌మెంట్లు మొదలు పెట్టాడు. అంటే అప్రూవర్‌గా మారి వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలకు వ్యతిరేకంగా వాంగ్మూలమిచ్చినందుకు అతనికి భారీగానే ముట్టిందన్నది తేటతెల్లమవుతోంది. మరి తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని దస్తగిరిని ప్రలోభపెట్టింది ఎవరు?

...కుందని టీడీపీ ఆరోపిస్తుండటం ఎంత నీచం!!.

గుండెపోటు కథ వివేకా పెద్ద బావమరిదిదే...

వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో నెత్తురు కక్కుకుని చనిపోయినట్టు భాస్కర్‌రెడ్డి ఇతర నిందితులతో కలసి ప్రచారం చేశారని సీబీఐ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. వాస్తవానికి వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని వైఎస్ అవినాశ్‌రెడ్డిగానీ వైఎస్ భాస్కర్‌రెడ్డిగానీ ఎవరికీ చెప్పలేదు. ఆ విషయాన్ని చెప్పింది వివేకానందరెడ్డి పెద్ద బావమరిది, అల్లుడికి సోదరుడు అయిన నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి. అది కూడా వైఎస్ వివేకా రాజకీయ శత్రువు, అప్పటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డితోనే ఆయన తొలుత చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న శివ ప్రకాశ్ రెడ్డి స్వయంగా మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వైఎస్ వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పారు. సిగరెట్లు ఎక్కువగా తాగుతారు కనక ఇలా జరిగి ఉండొచ్చని తాను చెప్పినట్లు ఆది నారాయణ రెడ్డి స్వయంగా మీడియాకు చెప్పారు. అంతేకాదు నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డే ఎంపీ అవినాశ్ రెడ్డికి ఫోన్ చేసి.. వివేకా చనిపోయిన విషయాన్ని చెప్పారు. అప్పటికే ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగు వెళుతున్న ఎంపీ అవినాశ్... వెనక్కి తిరిగి వైఎస్ వివేకా ఇంటికి వెళ్లారు. ఆ ఫోన్ రాకపోయి ఉంటే అవినాశ్‌రెడ్డి జమ్మలమడుగు వెళ్లేవారు. ఎన్నికల ప్రచారం చేసుకునేవారు. వైఎస్ వివేకా మృతిచెందారని అందరికీ చెప్పింది శివ ప్రకాశ్‌రెడ్డి. గుండెపోటుతో మరణించారని చెప్పింది కూడా ఆయనే. కానీ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి చెప్పారంటూ సీబీఐ ఓ కల్పిత కథను రిమాండ్ రిపోర్ట్‌లో ప్రస్తావించటం విస్మయం కలిగిస్తోంది.

వివేకా రాసిన లేఖను ఎందుకు దాచిపెట్టారు?

వైఎస్ వివేకా మరణించే సమయంలో లేఖ రాశారు. రక్తపు మరకలతో కూడిన లేఖ అది. డ్రైవర్ ప్రసాద్ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్టు ఆ లేఖలో వివేకా రాశారు. ఆ లేఖను ఆ రోజు ఉదయం 6.10 గంటలలోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి... వెంటనే ఆ విషయాన్ని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖను, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. సునీత, ఆమె భర్త మధ్యాహ్నం 1గంట సమయంలో పులివెందుల చేరుకున్నారు. వారికి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి అందించారు. చివరకు సాయంత్రం 5గంటలకు వారంతా కలిసి లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు.

ఇక్కడే అత్యంత కీలకమైన అంశం దాగి ఉంది. ఆ లేఖను దాచి ఉంచమని సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పకపోయి ఉంటే కృష్ణారెడ్డి వాటిని వెంటనే బయటపెట్టేవారు. శివప్రకాశ్‌రెడ్డి చెప్పిన సమాచారంతో అక్కడికి వచ్చిన అవినాశ్‌కు గనక దాన్ని చూపించి ఉంటే... వివేకాది హత్యేనని అందరికీ వెంటనే స్పష్టత వచ్చేది. గుండెపోటో మరొకటో కాదని వెంటనే తెలిసిపోయేది. అసలు ఎవ్వరూ మృతదేహాన్ని ముట్టుకునేవారే కాదు. కానీ ఆ లేఖను దాచి ఉంచమని చెప్పడమే కాకుండా... వివేకా గుండెపోటుతో చనిపోయారని టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డికి చెప్పింది వివేకానంద రెడ్డి కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదే. వాస్తవం ఇలా ఉంటే... గుండెపోటు కథను భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ప్రచారంలోకి తీసుకువచ్చారని సీబీఐ రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొనడమే దర్యాప్తు తీరుపై సందేహాలకు తావిస్తోంది.

హంతకుడే అప్రూవరా...!?

రిమాండ్ రిపోర్ట్‌లో సీబీఐ పేర్కొన్న మరో అంశం కూడా ఆ సంస్థ విశ్వసనీయతను శంకించేలా చేస్తోంది. వైఎస్ వివేకాను గొడ్డలితో స్వయంగా నరికినట్లు చెప్పిన నిందితుడు దస్తగిరిని సీబీఐ అప్రూవర్‌గా మార్చడం న్యాయ నిపుణులను విస్మయపరుస్తోంది. హత్య చేసిన వ్యక్తి జైల్లో కాక దర్జాగా బయట తిరుగుతున్నారు. అతని బెయిల్ పిటీషన్‌ను సీబీఐ వ్యతిరేకించలేదు. హంతకుడైన దస్తగిరి తో కల్పితాలు, అభూతకల్పనలు చెప్పించి... వాటి ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుండటం వెనుక మర్మమేమిటి?

కొత్త బృందం... పాత కక్షే...!

వివేకా హత్య కేసులో రామ్‌సింగ్ నేతృత్వంలోని సీబీఐ అధికారుల బృందం గతంలో ఎంత అసంబద్ధంగా వ్యవహరించిందో అందరికీ తెలుసు. తాము చెప్పని విషయాలను కూడా చెప్పినట్టుగా వాంగ్మూలం రాసుకున్నారని పలువురు సాక్షులు వాపోయారు. తాము కోరుకున్నట్లు వాంగ్మూలమివ్వాలని చిత్రహింసలకు గురి చేస్తోందని మరికొందరు బాధితులు పోలీసులను కూడా ఆశ్రయించారు. దాంతో ఈ కేసులో నిష్పాక్షిక దర్యాప్తు చేయాలని బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ అధికారి రామ్‌సింగ్‌ను న్యాయస్థానం తొలగించి కొత్త బృందాన్ని నియమించాలని సీబీఐని ఆదేశించింది. కొత్త అధికారుల బృందం వస్తే కొత్త కోణంలో దర్యాప్తు చేసి కొత్త అంశాలను వెలికి తీస్తారని అంతా ఆశించారు. కానీ కొత్త బృందం వచ్చింది కానీ ఒక్క కొత్త ఆధారాన్ని కూడా కనుగొనలేదు. పైగా పాత బృందం అసంబద్ధంగా చేసిన దర్యాప్తునే ఆధారంగా చేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఏప్రిల్ 30లోగా కేసు దర్యాప్తును ముగించాలన్న ఉద్దేశంతో కక్షపూరితంగా కొందర్ని లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తోందన్నది తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఉదయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల అరెస్టుకు గతంలో సీబీఐ బృందం చెప్పిన అహేతుక కారణాలనే కొత్త బృందం కూడా వల్లేవేయడం విస్మయపరుస్తోంది.

తులసమ్మ పిటీషన్‌లోని అంశాలపై దర్యాప్తే లేదు

వివేకా హత్యకు కారణాలపై డి.శివ శంకర్ రెడ్డి భార్య తులసమ్మ పలు సందేహాలను లేవనెత్తుతూ పులివెందుల న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు, రాజకీయ వారసత్వం, ఆస్తి పై హక్కుల కోసం కుమార్తె, అల్లుడితో విభేదాలు, నియోజకవర్గంపై ఆధిపత్యం కోసం టీడీపీ నేత బీటెక్ రవి కక్షగట్టడం, ఆర్థిక విభేదాలతో కక్ష పెంచుకున్న అనుచరుడు కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డి టీడీపీ నేత బీటెక్‌తో కలసి కుట్ర పన్నటం, రాజకీయ విభేదాలు ఉన్న తాడిపత్రి నేత రాజేశ్వరరెడ్డి, అతనికి సహకరించిన నీరుగట్టు ప్రసాద్‌ల ప్రమేయం... ఇలా తులసమ్మ లేవనెత్తిన కీలకమైన అంశాలను న్యాయస్థానం నమోదు చేసింది. కానీ సీబీఐ వీటిని దర్యాప్తులో కనీసం పరిగణలోకే తీసుకోవటం లేదు.

ఆ 3 వేలి ముద్రలపై మౌనం ఎందుకో...!

వివేకా హత్య స్థలంలో ఆధారాలను ధ్వంసం చేశారనేది భాస్కర్‌రెడ్డి మీద సీబీఐ చేసిన ప్రధాన అభియోగం. ఆ ఆరోపణ పూర్తిగా అహేతుకం. మరి అదే సమయంలో వివేకా హత్య ప్రదేశంలో లభించిన కీలకమైన ఆధారాలను సీబీఐ ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదు? మృతదేహం పడి ఉన్న బాత్‌రూమ్‌లో లభించిన వేలి ముద్రలను నిపుణులు పరిశీలించి పలువురి వేలిముద్రలతో సరిపోల్చారు. కానీ వాటిలో అయిదు వేలి ముద్రలు ఎవరితోనూ సరిపోల లేదు. వాటిలో మూడు వేలిముద్రలు పూర్తిగా ఉండగా... మరో రెండు పాక్షికంగా ఉన్నాయి. బాత్‌రూమ్ గోడలు, తలుపు వెనుక భాగంలో ఆ వేలి ముద్రలను గుర్తించారు. పూర్తిగా ఉన్న ఆ 3 వేలి ముద్రలు ఎవరివన్నది ఇప్పటివరకు తేలలేదు. సీబీఐ ఆ విషయాన్నే పట్టించుకోలేదు. ఆ వేలి ముద్రలెవరివో గుర్తిస్తే అసలు దోషులెవరో తెలుస్తుంది కదా?

సీబీఐ వేధింపులపై ఫిర్యాదులు బుట్టదాఖలు

వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సీబీఐ తనను చిత్రహింసలకు గురి చేసిందని... ఇంకా వేధిస్తోందని కల్లూరు గంగాధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా సీబీఐ స్పందించ లేదు. ఎంపీ అవినాశ్, భాస్కర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సీబీఐ తనను వేధిస్తోందని ఉదయ్ కుమార్‌రెడ్డి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా సీబీఐ తీరు మారలేదు.

భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వండి

- సీబీఐ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్
- వివేకా హత్య కేసులో ఆయనే కీలకం
- అంతా ఆయనే చూసుకుంటారని ఎర్రగంగిరెడ్డి చెప్పారు
- సాధారణ మరణం అని నమ్మించాలని చూశారు
- హత్య గురించి ఉదయ్‌కుమార్‌కు ముందే తెలుసు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ సీబీఐ కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో పాటు ఉదయ్‌కుమార్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సోమవారం సీబీఐ కోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. కాగా, 2019 మార్చి 15న వివేకానందరెడ్డి మృతదేహం రక్తపు మడుగులో బాత్రూమ్‌లో లభ్యమైందని, ఈ హత్య వెనుక భారీ కుట్ర ఉందని సీబీఐ రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ కేసును ఏపీ హైకోర్టు 2020లో సీబీఐకి బదిలీ చేసిందని, 2021 అక్టోబర్ 26న సీబీఐ తొలి చార్జిషీట్ నమోదు చేసిందని తెలిపింది. అందులో ఏ-1గా ఎర్ర గంగిరెడ్డి, ఏ-2 సునీల్ యాదవ్, ఏ-3 ఉమాశంకర్‌రెడ్డి, ఏ-4 దస్తగిరి(అప్రూవర్)గా.. 2022 ఫిబ్రవరి 3న ఫైల్ చేసిన అనుబంధ చార్జిషీట్‌లో ఏ-5గా శివశంకర్‌రెడ్డిని చేర్చామని చెప్పింది. రిమాండ్ రిపోర్ట్‌లో ఇంకా ఏం చెప్పిందంటే..

వివేకాతో వారికి పలు విభేదాలు

'వివేకానందరెడ్డితో భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి పలు విభేదాలు ఉన్నాయి. 2017లో ఎమ్మెల్సీగా పోటీ చేసిన వివేకా ఓడిపోయారు. ఈ ఓటమికి పై ఇద్దరే కారణమని వివేకా తీవ్ర ఆగ్రహంతో ఉండేవారు. హత్య చేసిన వారు కూడా భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. ఈ కేసులో భాస్కర్‌రెడ్డి సహా పలువురు కీలక వ్యక్తులు ఉన్నారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. హంతకులకు రూ.40 కోట్లు ఇస్తానని శివశంకర్‌రెడ్డి హామీ ఇచ్చాడని దస్తగిరి చెప్పాడు. ఇందులో సునీల్ యాదవ్ ద్వారా తనకు కోటి రూపాయలు అడ్వాన్స్ ఇచ్చారని అతను తెలిపారు. హత్య చేసే ప్రక్రియలో ఏ-1, ఏ-2, ఏ-3, ఏ-4 లను వివేకా ఇంటి వాచ్‌మెన్ రంగన్న చూశాడు. ఆ రోజు రాత్రి సుమారు 1.58 గంటల సమయంలో సునీల్‌యాదవ్ భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్నట్లు అతని మొబైల్ లొకేషన్ చూపించింది. ఇది విచారణలో తేలింది. భాస్కర్‌రెడ్డి ఇతరులతో మాట్లాడినట్లు.. వారు అంతా చూసుకుంటారని హత్య తర్వాత ఎర్ర గంగిరెడ్డి.. ఇతర నిందితులకు చెప్పాడు. అ తర్వాత వివేకా గుండెపోటుతో చనిపోయారని.. భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ కథ అల్లారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. హత్య గురించి ఉదయ్‌కుమార్‌కు ముందే తెలుసు. వివేకా చనిపోయినట్లు అవినాశ్ రెడ్డికి ఉదయం 6.26 గంటలకుకు ఎస్.శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేసి సమాచారమివ్వగా, వివేకా ఇంటి వద్దకు వెళ్లారు. ఉదయ్.. ఉదయం 6.25కు భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద, 6.27కు వివేకా ఇంటి వద్ద ఉన్నట్లు అతని మొబైల్ గూగుల్ టేక్ ఔట్ చూపించింది. అవినాశ్‌రెడ్డి.. అతని పీఏ రాఘవరెడ్డి ఫోన్ నుంచి సీఐ శంకరయ్యకు కాల్ చేశారు. వివేకా మృతి చెందారని చూసిన తర్వాతే అవినాశ్ ఫోన్ చేసినట్లు ఇదే ఆధారం. సాధారణ మరణం అని చెప్పడం కోసమే ఇదంతా చేశారు. ఆ తర్వాత రక్తపు మరకలను తుడిచి వేశాక మృతదేహాన్ని బెడ్‌రూంలోకి మార్చారు. బ్యాండేజీతో కట్లు కట్టారు. ఈ హత్యలో వైఎస్ భాస్కర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. మా విచారణలోనూ భాస్కర్‌రెడ్డి సహకరించలేదు. అందువల్ల భాస్కర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నాం' అని సీబీఐ కోరింది.

వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్

- పులివెందులలో అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు
- అరెస్ట్ చేస్తున్నట్లు భార్యకు మెమో పత్రాలు అందజేత
- ఆ తర్వాత కడప మీదుగా హైదరాబాద్ తరలింపు
- ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- సీబీఐ న్యాయమూర్తి ఎదుట హాజరు.. 14 రోజుల రిమాండ్


వైఎస్ భాస్కర్‌రెడ్డిని వాహనంలో తీసుకెళుతున్న సీబీఐ అధికారులు

పులివెందుల/సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్ సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి భాస్కర్ రెడ్డిని సీబీఐ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. తెల్లవారుజామున 5.30 గంటలకు సీబీఐ అధికారులు పులివెందులలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరినీ సీబీఐ అధికారులు లోనికి అనుమతించలేదు. మీడియా ప్రతినిధులను కూడా ఆ పరిసర ప్రాంతాల్లోకి రానివ్వలేదు. సుమారు 2 గంటలపాటు భాస్కర్‌రెడ్డిని విచారించిన వారు.. ఆయన సతీమణి లక్ష్మమ్మకు 120బి, 201, 302 సెక్షన్ల కింద ఆయన్ను అరెస్టు చేస్తున్నట్లు మెమో పత్రాలు ఇచ్చారు. అనంతరం ఆయన్ను వారి వాహనంలో ఎక్కించుకుని కడప మీదుగా హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మధ్యాహ్నం భాస్కర్‌రెడ్డిని వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అవుట్ పేషంట్ బ్లాకులోని అత్యవసర విభాగంలో ఆయనకు ఈసీజీ, బీపీ, సుగర్, 2డి ఎకో, కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనకు బీపీ ఎక్కువగా ఉండటంతో కొద్ది సేపు వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అక్కడ సుమారు రెండు గంటలపాటు వైద్య పరీక్షల అనంతరం సీబీఐ అధికారులు.. ఆయన్ను సీబీఐ న్యాయమూర్తి నివాసానికి తీసుకువెళ్లి హాజరు పరిచారు. జడ్జి ఆయనకు 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో భాస్కర్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

నిజాలు దాచి దర్యాప్తా?

▶ మొదటి పేజీ తరువాయి

కంటిన్యూ చేయడం మినహా విచారణలో ప్రధాన కోణం వెలుగు చూడడం లేదన్నారు. ఇలా అవినాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన కొద్ది గంటలకే సోమవారం మరోమారు విచారణకు హాజరు కావాలంటూ సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం. అవినాశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడిన అంశాలు ఇంకా ఇలా ఉన్నాయి.

డెత్ నోట్ దాచి పెట్టింది అల్లుడే..

- వైఎస్ వివేకానందరెడ్డిది హత్య అని తెలిసీ, డెత్ నోట్ చదివి వినిపించిన పీఏ కృష్ణారెడ్డితో దానిని ఎవరికీ చూపించకుండా దాచి పెట్టమని అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆదేశించారు. ఆ మేరకు కృష్ణారెడ్డి ఆయన చెప్పినట్లే చేశారు. వాస్తవాలు చెప్పకుండా ఘటనా స్థలం వద్దకు నన్ను వెళ్లమని నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఫోన్‌లో కోరారు.
- నేను అక్కడికి వెళ్లి చూశాక ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చాను. హత్య విషయం నా కంటే గంట ముందుగా వివేకా అల్లుడికి తెలుసు. పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన ఆయన విషయాన్ని దాచారు. వివేకా హత్య విషయాన్ని ముందుగా పోలీసులకు తెలిపింది నేనే. సీఐ శంకరయ్యకు స్వయంగా మూడు సార్లు ఫోన్ చేశాను. 35 నిమిషాల తర్వాత సీఐ వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన నన్నే దోషిగా చూపిస్తున్నారు.
- ఆ రోజు జమ్మలమడుగుకు వెళ్తున్న నాకు ఫోన్ రావడంతో కృష్ణాలయం సమీపం నుంచి వెనుతిరిగి వచ్చాను. నేనొక్కడినే కాకుండా, నాతో పాటు నాలుగు వాహనాలు ఉన్నాయి. మీరు చెబుతున్న గూగుల్ టేకౌట్ ద్వారా పరిశీలించుకోండి. వాస్తవమో కాదో తెలుస్తుంది.

డాక్యుమెంట్లు చోరీకి గురయ్యాయి..

- ఏ-4 దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వివేకా హత్య అనంతరం స్టాంప్డ్ డాక్యుమెంట్లు తీసుకున్న తర్వాతే ఇంట్లో నుంచి బయటికి వచ్చినట్లు చెప్పాడు. దీనిని బట్టి డాక్యుమెంట్లు దొంగిలించారని స్పష్టం అవుతోంది. అలాంటప్పుడు దొంగతనానికి చెందిన సెక్షన్లు సీబీఐ ఎందుకు పెట్టలేదు?
- తన ఐడియా ప్రకారమే డెత్‌నోట్‌లో డ్రైవర్ ప్రసాద్ పేరు రాయించానని దస్తగిరి చెబుతున్నాడు. దస్తగిరి చంపి, సంబంధం లేని వారిపై ఆరోపణలు చేస్తున్నాడు. ఆ మేరకు ఉన్న ఐపీసీ సెక్షన్లు ఎందుకు పెట్టలేదు? మరోవైపు వాచ్‌మెన్ రంగన్న స్టేట్‌మెంట్‌లో హత్యలో పాల్గొన్న నలుగురి పేర్లతో సహా చెబుతారు. అయినా నిందితుల్లో ఒకరిని సాక్షిగా పరిగణనలోకి తీసుకుంటారు. ఇవన్నీ చూస్తే కలిసికట్టుగా పద్ధతి ప్రకారం విచారణ సాగుతోందని అర్థమవుతోంది.
- ఏప్రిల్ 3న రిజిస్టర్ పోస్టు ద్వారా సీబీఐ డైరెక్టర్, డీఐజీ, ప్రస్తుత ఐఓకు పలు వివరాలు ఆధారాలతో పంపించాను. 5వ తేదీ మనిషి ద్వారా కూడా వారికి చేర్చాను. ఏమాత్రం మార్పు లేదు. బెంగళూరు సెటిల్‌మెంట్‌లో రూ.8 కోట్లు రావాల్సి ఉండగా, ఆ డబ్బులో సగం ఇవ్వాలని డిమాండ్ చేసిన తర్వాత జరిగిన ఘర్షణలో చంపినట్లు దస్తగిరి చెబుతాడు.
- వాస్తవంలో అవి ఫేక్ డాక్యుమెంట్లు అని తేలిపోయింది. అసలే రాని, లేని డబ్బు కోసం గొడవ జరుగుతుందా? ఇలాంటి ప్రశ్నలను ఎందుకు సీబీఐ ఛేదించడం లేదు? డాక్యుమెంట్లు తీసుకెళ్లామని దస్తగిరి చెబుతున్నాడు.. ఆ డాక్యుమెంట్లను ఎందుకు రికవరీ చేయలేదు? అందులో ఏముంది? అన్న విషయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరం.

సునీతక్క వర్షన్ సడన్‌గా మారింది

- 2019 మార్చి 15న హత్య జరిగితే, టీడీపీ నేతల ఆరోపణల నేపథ్యంలో వైఎస్ కుటుంబం ఔన్నత్యాన్ని సునీతక్క స్పష్టంగా వివరించింది. సీఎంగా వైఎస్ జగనన్నను, ఎంపీగా నన్ను చేసుకోవాలని కొద్ది నెలలుగా వైఎస్ వివేకానందరెడ్డి తపన పడ్డారని ఆమె స్పష్టంగా తెలిపింది. ఒక సంవత్సరం వరకూ బాగా మాట్లాడేది. ఎర్రగంగిరెడ్డి వైఖరిపై నా అభిప్రాయం కూడా కోరింది. చెప్పాను. సడన్‌గా వైఖరి మార్చుకొని ఢిల్లీకి వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేసింది. కారణమేంటో సునీతక్కే చెప్పాలి.
- హత్యలో స్వయంగా పాల్గొన్నానని చెప్పిన దస్తగిరి ముందస్తు బెయిల్ కోసం సీబీఐ నో అబ్జక్షన్ చెబుతోంది. రెండేళ్లుగా కోర్టులో ఎవరు బెయిల్ పిటిషన్ వేసినా ఇంప్లీడ్ అయ్యే సునీతమ్మ, దస్తగిరి ముందస్తు బెయిల్‌కు మాత్రం అభ్యంతరం చెప్పరు. ఆ తర్వాత అప్రూవర్ అనే అబద్ధాల కట్టడం వెలుగులోకి వచ్చింది.
- అప్రూవర్‌గా మారితే కేసు విచారణ పూర్తయ్యే వరకు లోపల ఉండాల్సి వస్తుంది కాబట్టి ముందస్తు బెయిల్‌కు అభ్యంతరం చెప్పడం లేదు. అటు సీబీఐ, ఇటు సునీతమ్మ కలిసికట్టుగా ప్రణాళిక బద్ధంగా కేసును పక్కదారి పట్టిస్తున్నారని స్పష్టంగా అర్థం అవుతోంది.

మేము ఏ తప్పూ చేయలేదు

- మా నాన్న 40 ఏళ్లుగా మీ అందరికీ తెలుసు. మా మనస్తత్వాలు తెలుసు. నా నిజాయితే నన్ను గెలిపిస్తోంది. వివేకం సార్ హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మేము ఇసుమంతైనా తప్పు చేయలేదు. ఎల్లో మీడియా విష ప్రచారాలను నమ్మొద్దు.
- 2009 నుంచి నేను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నాను. తొలుత లింగాల మండలం ఇన్‌ఛార్జిగా పని చేశా. పదేళ్లుగా నేనేంటో అందరికీ తెలుసు. ఈ 3650 రోజుల్లో 1500 రోజులు ఉదయ్‌కుమార్‌రెడ్డి నాతో కలిసి ఉంటాడు. కానీ ఆ రోజు ఉదయమే వచ్చినట్లు చెబుతున్నారు. ఇంకో విషయం.. థర్డ్ పర్సన్ ఫోన్ కోసం నేను వెయిట్ చేసినట్లు మరో విషయాన్ని చెబుతున్నారు. అదే వాస్తవమైతే నేనే అక్కడికి ఎవర్నో పంపించి ఫోన్ చేయించుకునే వాడిని కదా.. చాలా సిల్లీ థింగ్స్ ఆధారంగా విచారణ చేస్తున్నారు.
- విచారణలో సీబీఐ కీలక విషయాలను వదిలేసింది. అప్రూవర్ అనే అబద్ధాల కట్టడం కోర్టులో నిలిచే అవకాశమేలేదు. మాకు పదవులపై వ్యామోహం లేదు. న్యాయస్థానాలపై నమ్మకం ఉంది. వ్యవస్థలపై గౌరవం ఉంది. న్యాయం కోసం పోరాటం చేస్తాం. వ్యక్తి టార్గెట్‌గా చేస్తున్న విచారణలో తుదకు న్యాయమే గెలుస్తుంది.

కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు

సాక్షి ప్రతినిధి కడప: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా ఆదివారం ఉదయం వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఇప్పటికే సీబీఐ అధికారులు పలుమార్లు ఆయన్ను విచారించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాదులోని సీబీఐ కార్యాలయంలో మరోసారి విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.



'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా బొబ్బిలిలో లబ్ధిదారుని ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు



బాపట్ల జిల్లా ఐలవరం గ్రామంలో సర్వే వివరాలు నమోదు చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



ప్రకాశం జిల్లా చీమకుర్తిలో సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

క్లుప్తంగా...

చంద్రబాబు, లోకేశ్‌ను తరిమికొడతాం

931వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు




రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: దళితులంటే చిన్నచూపుతో మాట్లాడుతున్న చంద్రబాబు, లోకేశ్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 931వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ.. పాదయాత్ర చేస్తున్న లోకేశ్ ప్రజా సమస్యలపై మాట్లాడకుండా దళితులను కించపరిచేలా మాట్లాడడం సిగ్గుచేటని, దళిత బహుజనులు తమకు ఓట్లేయడం లేదనే అక్కసుతో చంద్రబాబు, లోకేశ్ అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో చంద్రబాబు దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా... అంటే, ఇప్పుడు లోకేశ్ దళితుల గురించి అసభ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాదయాత్రలో లోకేశ్‌కు ప్రతి గ్రామంలో ముందు ఎదురయ్యేది జగనన్న కాలనీలేనని, వాటిని చూసిన ప్రతిసారి వెన్నులో వణుకు మొదలై దళితులు, బహుజనులు తమను ఎక్కడ విస్మరిస్తారో అనే భయం పట్టుకుని అసహనంతో మాట్లాడుతున్నాడన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, న్యాయవాది పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

దారిమళ్లుతున్న పంచాయతీ నిధులు

- సీఎం జగన్ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల నిధులు, విధులు లాక్కుని వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవం లేదని, చేసిన పనులకు బిల్లులు లేవని చెప్పారు. ప్రకాశం జిల్లాలో ఒక సర్పంచి జగన్‌ని గెలిపించి పెద్ద తప్పుచేశామని మీడియా ముందు చెప్పుతో కొట్టుకున్నాడని తెలిపారు. సర్పంచులు తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సర్పంచులకు పూర్వ వైభవం తీసుకొస్తామని, నిధులు, విధులు ఇచ్చి హక్కులు కాపాడతామని చెప్పారు. టీడీపీ హయాంలో పంచాయతీరాజ్‌కి ఉపాధిహామీ నిధులు అనుసంధానం చేసి గ్రామాల్లో పంటకుంటలు తవ్వి భూగర్భజలాలు పెంచామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను ఎలా దుర్వినియోగం చేసిందో వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. చలో అమరావతి, చలో ఢిల్లీ, కలెక్టరేట్ల ముట్టడి వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు బాబూరాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం

- ఎవరి పాలనలో న్యాయం జరిగిందో చర్చకు సిద్ధం
- నారా లోకేశ్



కర్నూలు(సెంట్రల్)/తుగ్గలి: వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. బీసీలకు టీడీపీ పాలనలో న్యాయం జరిగిందా లేక వైఎస్సార్‌సీపీ పాలనలో న్యాయం జరిగిందా అనే విషయంపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఆదివారం కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్లలో బీసీ ప్రజాప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ హాస్టళ్లలో దుర్భర పరిస్థితులు ఉన్నాయన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లను జగన్ 10 శాతం తగ్గించారని విమర్శించారు. బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఒక్క రూపాయి నిధులు ఇవ్వకుండా ఎన్ని కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తే ఏం లాభమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంతంగా మద్యం అమ్ముకోవడానికి కల్లుగీత కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు ప్రత్యేకంగా షాపులు కేటాయిస్తామన్నారు. తమ పాలనలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.11 వేల కోట్లను ఖర్చు చేశామని చెప్పారు. అయితే జగన్ ప్రభుత్వం 10 శాతం నిధులను కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. చేనేత కార్మికులకు అధికారంలోకి వచ్చిన వెంటనే దత్తత తీసుకుంటామని.. వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు.

మళ్లీ మళ్లీ మరిగించొద్దు

ఎక్కువసార్లు మరిగించిన వంట నూనె వాడితే ఆరోగ్యానికి హాని

శరీరంలో ఫ్రీ రాడికల్స్ పెరిగి వివిధ సమస్యలు తలెత్తే అవకాశం	హోటళ్లు, రెస్టారెంట్‌ల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఫుడ్ సేఫ్టీ విభాగం	వాడిన నూనెను బయోడీజిల్ తయారీ సంస్థలకు విక్రయించేలా చర్యలు

గత ఏడాది లక్ష లీటర్ల నూనె బయోడీజిల్ తయారీకి సరఫరా



సాక్షి, అమరావతి: వంద లీటర్ల నూనెను వినియోగించి వంట చేస్తే 25 లీటర్లు మిగులుతుంది. సాధారణంగా మిగిలిన నూనెను మళ్లీ మళ్లీ మరిగించి వంటకు వాడుతుంటారు. ఇలా చేయడం ఆరోగ్యానికి ఎంతో హానికరం. ఈ అంశంపై హోటళ్లు, రెస్టారెంట్‌ల యజమానులకు అవగాహన కలిపిస్తూ.. వాడిన వంట నూనెను బయోడీజిల్ తయారీ సంస్థలకు విక్రయించేలా రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ విభాగం చర్యలు తీసుకుంటోంది. ఇలా గత ఏడాదిలో 1,00,257 లీటర్ల వాడిన వంట నూనెను బయో డీజిల్ తయారీ ఏజెన్సీలకు సరఫరా అయ్యేలా చేశారు. రోజుకు 50 లీటర్‌లకు మించి వంట నూనెను వినియోగించే హోటళ్లు, రెస్టారెంట్‌లు, తినుబండారాల తయారీ సంస్థలు జాతీయ ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ)లో రిజిస్టరై ఉన్నాయి. ఇలా రిజిస్టరైన సంస్థలన్నీ ఒకసారి వాడిన నూనెను బయోడీజిల్ తయారీ సంస్థలకు విక్రయించాలని గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారు.

టీపీసీ 25 శాతానికి మించితే ఆరోగ్యం హుష్

మార్కెట్‌లో నూనెలు ఎక్కువగా వాడే ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, ఇతర ఆహార పదార్థాలకు అధిక డిమాండ్ ఉంటోంది. సాధారణంగా కంపెనీ నుంచి తయారై వచ్చిన నూనెలో టోటల్ పోలార్ కౌంట్ (టీపీసీ) 5 నుంచి 7 శాతం ఉంటుంది. ఆయిల్‌ను మరిగించే కొద్దీ టీపీసీ పెరుగుతూ ఉంటుంది. టీపీసీ మోతాదు 25 శాతానికి మించితే ఆరోగ్యానికి చాలా హానికరం. టీపీసీ మోతాదు పెరిగేకొద్దీ శరీరంలో ఫ్రీ రాడికల్స్ పెరుగుతాయి. దీనివల్ల రక్తనాళాలు గట్టిపడటం, అల్జీమర్స్, కాలేయ సంబంధ వ్యాధులు, హైపర్‌టెన్షన్ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తోంది. ఇలా వాడటం వల్ల స్థూలకాయం, గుండె జబ్బులు, మధుమేహం వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

ఏజెన్సీలే సేకరిస్తాయి

రీయూజ్డ్ కుకింగ్ ఆయిల్ (రూకో) విభాగంలో బయోడీజిల్‌ను తయారు చేసే అనుమతులు ఉన్న ఏజెన్సీలు గుంటూరు, విశాఖ, కాకినాడ నగరాల్లో ఐదు ఉన్నాయి. ఈ ఏజెన్సీలు రాష్ట్రవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో వాడిన వంట నూనెను సేకరిస్తున్నాయి. ఏజెన్సీల నిర్వాహకులే హోటళ్లు, రెస్టారెంట్‌ల వద్ద ఖాళీ డబ్బాలను అందుబాటులో ఉంచుతారు. ఆ డబ్బాల్లోకి వాడిన నూనెను నింపి సమాచారం ఇస్తే తీసుకునివెళతారు. మార్కెట్‌లో నూనె ధరలకు అనుగుణంగా సేకరించే వాడిన నూనెకు ఏజెన్సీలు డబ్బు చెల్లిస్తాయి. ప్రస్తుతం లీటర్‌కు రూ.40 నుంచి రూ.50 వరకూ చెల్లిస్తున్నారు.

రెండోసారి వాడితే చెడు కొలెస్ట్రాల్ తప్పదు

నూనెను ఒకసారి ఉపయోగిస్తే అందులోని పోషకాలు మొత్తం మనం వాడుకున్నట్టే. తిరిగి ఆ నూనెను వేడి చేస్తే అది చెడు కొలెస్ట్రాల్‌గా మారుతుంది. చెడు కొలెస్ట్రాల్ గుండె ఆరోగ్యానికి హాని చేస్తుంది. నూనెల్ని రెండోసారి వాడితే గుండె జబ్బులే కాకుండా ఉదర కోశ, అన్నవాహిక క్యాన్సర్లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఒకసారి వాడిన నూనెను తిరిగి ఉపయోగిస్తే.. ఆహారం విషతుల్యమవుతుంది. దీనిని భుజిస్తే కడుపులో మంట, కడుపులో నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

జనసేన నాయకుడి మోసానికి కిరాణా వ్యాపారి బలి

- సైనిక్ స్కూల్‌లో సీట్లు ఇప్పిస్తానని రూ.16లక్షలు తీసుకున్న జనసేన నేత
- అప్పు చేసి డబ్బులిచ్చిన కిరాణా వ్యాపారి...
- ఆయన పిల్లలకు సీట్లు రాలేదు... డబ్బులూ తిరిగి ఇవ్వలేదు
- అప్పు తీర్చలేక 16 రోజుల కిందట ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యాపారి
- శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు



మృతిచెందిన బుడ్డెపు రామకృష్ణ (ఫైల్)



జనసేన నాయకుడు అసిరినాయుడు

పొందూరు: శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం బురిడి కంచరాం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గురివిందల అసిరినాయుడు చేసిన మోసానికి ఓ కిరాణా వ్యాపారి బలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విజయనగరం జిల్లా రాజాం మండలం పెనుబాకకు చెందిన బుడ్డెపు రామకృష్ణ (43) తమ గ్రామంలోనే కిరాణా వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఆయన ఇద్దరు పిల్లలకు 2020లో సైనిక్ స్కూల్‌లో సీట్లు ఇప్పిస్తానని జనసేన నాయకుడు గురివిందల అసిరినాయుడు నమ్మించాడు. ఇందుకోసం అసిరినాయుడుకు రామకృష్ణ రూ.16లక్షలు ఇచ్చాడు. అయితే రామకృష్ణ పిల్లలకు సైనిక్ స్కూల్‌లో సీట్లు రాలేదు. తన పిల్లల భవిష్యత్ బాగుంటుందనే ఆశతో అప్పు చేసి రూ.16లక్షలు ఇచ్చానని, ఆ డబ్బులను తిరిగివ్వాలని అనేకసార్లు రామకృష్ణ అడిగినా... అసిరినాయుడు పట్టించుకోలేదు. ఈ ఏడాది మార్చి 31న మరోసారి అసిరినాయుడు ఇంటికి రామకృష్ణ తన భార్యతో కలిసి వచ్చి అప్పులు పెరిగిపోయాయని, డబ్బులు తిరిగి ఇవ్వాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. 'నీకు నచ్చినట్లు చేసుకో...' అని అసిరినాయుడు రెచ్చిపోయాడు. దీంతో రామకృష్ణ తన వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగాడు. ఆయనను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, మూడు రోజులకే రూ.3.50 లక్షలు ఖర్చు అయ్యింది. ఆ తర్వాత డబ్బులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు రామకృష్ణను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై పొందూరు పోలీస్‌స్టేషన్‌లో రామకృష్ణ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉద్యోగాల పేరుతోనూ డబ్బులు వసూలు!

జనసేన నాయకుడు గురివిందల అసిరినాయుడు ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి జల్సాలు చేస్తుంటాడని కంచరాం గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో నరసన్నపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.10 లక్షలు తీసుకున్నాడని, అతనికి ఉద్యోగం రాకపోవడంతో రూ. 5 లక్షలు తిరిగి ఇచ్చాడని తెలిపారు. ఇదే తరహాలో కొత్తూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.3 లక్షలు, శ్రీకాకుళానికి చెందిన వ్యక్తి నుంచి రూ.15 లక్షలు తీసుకుని మోసం చేయడంతో దేహశుద్ధి కూడా చేశారని గ్రామస్తులు చెప్పారు.

జగన్ సంక్షేమ పథకాలతో బాబు, రామోజీలకు భయం

తమకు ఇక భవిష్యత్ ఉండదని భయపడుతున్నారు.. అందుకే బరితెగించి ఈనాడులో తప్పుడు రాతలు రాస్తున్నారు

- ప్రభుత్వ పథకాలపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు
- అయినా ప్రజలు సీఎం వైఎస్ జగన్‌తోనే ఉంటారు
- చంద్రబాబు సహకారంతో రామోజీరావు శంషాబాద్‌లో 450 ఎకరాలు కొన్నారు
- అమరావతిలోనూ తన బినామీల ద్వారా భూములు కొనిపించారు
- మా అబ్బాయిని రామోజీ వేధించారు
- దీంతో డాల్ఫిన్ హోటల్ ఎండీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు
- నా కుమార్తెను కూడా కళాంజలి నుంచి తరిమేశారు

'సాక్షి' ఇంటర్వ్యూలో రామోజీరావు తోడల్లుడు అప్పారావు

జగన్ సంక్షేమ పథకాలతో చంద్రబాబు, రామోజీరావులకు భయం పట్టుకుందని ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు తోడల్లుడు అప్పారావు తెలిపారు. వారికి ఇక భవిష్యత్ ఉండదని భయపడుతున్నారని వెల్లడించారు. అందుకే జర్నలిజం విలువలకు పాతరేసి ఈనాడులో తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు సహకారంతో రామోజీరావు శంషాబాద్ విమానాశ్రయం వద్ద 450 ఎకరాలు కొన్నారన్నారు. అలాగే అమరావతిలోనూ బినామీల ద్వారా భూములు కొనిపించారని చెప్పారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదిక రాకుండానే రాజధానిని ప్రకటించారని తప్పుబట్టారు. అమరావతి ప్రాంతంలో మంచి పంటలు పండే భూములను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విశాఖ రాజధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ప్రతి ఊరు రాజధాని అయిపోయినంత సంతోషంగా ఉందని తెలిపారు. ఈ మేరకు రామోజీరావు తోడల్లుడు అప్పారావు సాక్షికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...



జగన్‌ను చూసి రామోజీ, చంద్రబాబులో భయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు చూసి.. రామోజీ, చంద్రబాబులో భయం ఏర్పడింది. ఇదే తరహాలో జగన్ వెళ్తే.. తమకు భవిష్యత్తు ఉండదని వారిద్దరూ భయపడుతున్నారు. అందుకే పూర్తిగా బరితెగించి.. జర్నలిజం విలువల్ని రామోజీరావు దిగజార్చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంపైనా ఇష్టం వచ్చినట్లుగా రాతలు రాస్తూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. ఈనాడు ద్వారా బయటవాళ్లకు మాత్రం నీతులు చెబుతూ.. తాను మాత్రం పాటించననే అహం రామోజీరావుకే సొంతం.

మా అబ్బాయిని రామోజీరావు వేధించారు..

డాల్ఫిన్ హోటల్‌కు మా అబ్బాయి శ్రీనివాస్ రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. కానీ.. మా అబ్బాయిని రామోజీ వేధించారు. దీంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. తర్వాత.. డాల్ఫిన్ హోటల్‌కు ఎండీగా తన కోడలు విజయేశ్వరిని రామోజీ నియమించుకున్నారు. ఇక కళాంజలిని మా అమ్మాయి ఎంతో అభివృద్ధి చేసింది. ఆమెని కూడా బయటకు తరిమేశారు.

రామోజీరావు, చంద్రబాబు గురుశిష్యులు

చంద్రబాబు సహకారంతో రామోజీ అన్నింటినీ నిలబెట్టుకుంటూ వచ్చారు. శంషాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తున్నప్పుడు 400 నుంచి 450 ఎకరాలు రామోజీరావు కొనుగోలు చేశారు. అదేవిధంగా అమరావతిలో రాజధాని అని ముందుగానే చంద్రబాబు సంకేతాలు ఇవ్వడంతో అక్కడ కూడా రామోజీ తన బినామీలతో భూములు కొనిపించారు. ఆ విషయంలో చంద్రబాబు, రామోజీ ఇద్దరూ గురుశిష్యులు... టూ ఇన్ వన్. చంద్రబాబుది పవర్.. రామోజీది కోరిక.

రామోజీ కాళ్లు పట్టుకున్న చంద్రబాబు..

రాజకీయాలకు ఎన్టీఆర్ కొత్త. ఆ సమయంలో ఎన్టీఆర్ రామోజీని విశ్వసించేవారు. ఎప్పుడైనా ఢిల్లీ వెళ్తుంటే ముందు రామోజీకి చెప్పేవారు. క్రమంగా ఎన్టీఆర్ జాతీయ నేతగా ఎదుగుతున్న సమయంలో కొన్నిసార్లు రామోజీకి చెప్పకుండానే కొన్ని పనులు చేశారు. దీంతో రామోజీకి భయం పట్టుకుంది. ఎన్టీఆర్ తన గుప్పిట నుంచి జారిపోతున్నారని భావించారు. యూఎల్‌సీకి సంబంధించి ఈనాడుకు చెందిన ఫైల్ వెళ్తే ఎన్టీఆర్ దాన్ని పక్కన పెట్టమని అధికారులకు చెప్పారు. అప్పట్లో ఉపేంద్ర అనే వ్యక్తి ఎన్టీఆర్‌కు పీఏగా ఉండేవారు. అయితే.. అతడి వ్యవహారం నచ్చక ఎన్టీఆర్ పక్కన పెట్టేశారు. ఆ సమయంలో చంద్రబాబు వచ్చారు. అప్పటి నుంచి రామోజీరావు, చంద్రబాబు కలిసి ఎన్టీఆర్‌కు ప్రతికూలంగా మారిపోయారు. వైస్రాయ్ హోటల్ సాక్షిగా దుర్మార్గానికి తెరతీసి ఆయనను పదవీచ్యుతుడిని చేశారు. అప్పట్లో లిక్కర్ కాంట్రాక్టర్‌ల నుంచి చంద్రబాబుకు భారీగా నిధులు ముట్టిన విషయం తెలిసి.. ఈనాడులో దీనిపై కార్టూన్ వేశారు. ఆ మరుసటి రోజు చంద్రబాబు రామోజీ కాళ్లు పట్టుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరూ ఒక్కటైపోయారు.

శివరామకృష్ణన్ నివేదిక బయటకు రాకుండానే రాజధాని ప్రకటన

శ్రీకృష్ణ కమిటీ నివేదిక ప్రకారం రాజధాని ఏర్పాటు చేసి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఆ కమిటీ నివేదికను పూర్తిగా మార్చేశారు. నారాయణను బినామీగా పెట్టుకొని.. ఆయనతో పనికిరాని నివేదిక ఇప్పించారు. అలాగే శివరామకృష్ణన్ నివేదిక బయటకు రాకుండానే అమరావతిని ప్రకటించారు. రామోజీరావుతో శంషాబాద్ వద్ద 450 ఎకరాలు కొనిపించినట్లుగానే అమరావతి ప్రకటనకు ముందు అక్కడ వాళ్ల వాళ్లతో భూములు కొనిపించారు. మంచి పంటలు పండే భూములను నాశనం చేశారు. ఈ నేపథ్యంలో విశాఖను రాజధాని చేయడం అవసరం. అలాగే కర్నూలును కూడా న్యాయ రాజధానిగా చేయాలి.

ప్రజలు వైఎస్ జగన్‌తోనే ఉంటారు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో 2019లో విజయం సాధించారు. ప్రస్తుతం అన్ని పథకాలను అమలు చేస్తున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా సామాన్య ప్రజల అన్ని అవసరాలు తీరుస్తున్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కూడా బాగా జరిగింది. ప్రజలు తప్పకుండా జగన్‌తోనే ఉంటారు. ఆయనను మించిన మగాడెవరూ కనిపించడం లేదు.

రామోజీలో మానవత్వం లోపించింది

మనుషుల్లో ఆప్యాయత, అనురాగం ఉండాలి. కానీ రామోజీలో మానవత్వం లోపించింది. ఆనాడు మేము బయటకు రావడానికి, ఈనాడు ప్రజలు ఆయనకు దూరమవ్వడానికి ఇదే కారణం. ఆయన ప్రజలను పూర్తిగా విశ్వసించి ఉంటే ఈనాడులో ఈ తరహా రాతలు ఉండేవి కాదు.

ప్రతి ఊరు రాజధాని అయినంత సంతోషంగా ఉంది

అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతుంటే ఇబ్బంది ఏముంది? ఒక దగ్గరే పాలన చేయాలనేముంది? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ప్రతి ఊరు రాజధాని అయిపోయినంత హ్యాపీగా ఉంది. గ్రామ సచివాలయాలు వచ్చిన తర్వాత ఎవరూ రాజధానికి వెళ్లాల్సిన పనిలేదు. అందరికీ వారున్న గ్రామాల్లోనే అన్నీ అందుతున్నాయి. ఆ రోజుల్లో ఎన్టీఆర్ ఎలా తన ఛరిష్మాతో జనంలో నాటుకుపోయారో.. అదే తరహాలో జగన్ కూడా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.

'యువగళం'కు కర్ణాటక కిక్కు!

మడకశిరలో మద్యం స్వాధీనం.. ఇద్దరు కర్నూలు జిల్లావాసుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులతో సెబ్ పోలీసులు

మడకశిర: నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు తరలిస్తున్నట్లు భావిస్తున్న కర్ణాటక మద్యం బాక్సులను ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో (సెబ్) పోలీసులు పట్టుకున్నారు. ప్రస్తుతం నారా లోకేశ్ యువగళం పాదయాత్ర కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. ఈ పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. మద్యం పంపిణీ చేసైనా సరే పాదయాత్రకు జనసమీకరణ చేయాలని స్థానిక టీడీపీ నాయకులు భావించారని తెలుస్తున్నది. ఈ క్రమంలోనే కర్ణాటకలోని తుమకూరు నుంచి కర్నూలు జిల్లాకు ఓ కారులో మద్యం తరలిస్తుండగా మడకశిరలోని ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సెబ్ పోలీసులు పట్టుకున్నారు. 35 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 35 బాక్సుల్లో 3,360 మద్యం ప్యాకెట్లు ఉన్నాయని సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. ఈ మద్యం విలువ రూ.1.68 లక్షలు ఉంటుందని చెప్పారు. కారును సీజ్ చేసి.. మద్యం తరలిస్తున్న కర్నూలు జిల్లాకు చెందిన సాయి ప్రకాశ్‌రెడ్డి, శేఖర్‌ను అరెస్ట్ చేశారు.

'సాక్షి' విలేకరిపై టీడీపీ నాయకుల దాడి

- మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అనుచరుల దౌర్జన్యం
- తమ కార్యక్రమానికి ఎందుకు వచ్చావంటూ దుర్భాషలు
- తీసిన వీడియోలు చూపించాలంటూ ఫోన్ గుంజుకునేందుకు యత్నం
- సొమ్మసిల్లి పడిపోయిన విలేకరి త్రివేణుకుమార్.. ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న సాక్షి చానల్ విలేకరి త్రివేణు

వినుకొండ(నూజెండ్ల): విధి నిర్వహణలో భాగంగా టీడీపీ కార్యక్రమానికి వెళ్లిన 'సాక్షి' చానల్ రిపోర్టర్‌పై ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అనుచరులు దాడి చేశారు. 'సాక్షి' చానల్ రిపోర్టర్ త్రివేణుకుమార్ విధి నిర్వహణలో భాగంగా ఆదివారం వినుకొండలో టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళ్లారు. త్రివేణుకుమార్‌ను చూసిన వెంటనే జీవీ ఆంజనేయులు అనుచరులు అతని మీదకు దూసుకువచ్చారు. టీడీపీ కార్యక్రమానికి ఎందుకు వచ్చావ్? తీసిన వీడియోలన్నీ చూపించాలంటూ ఫోన్ గుంజుకునే ప్రయత్నం చేశారు. పక్కనే ఉన్న మీడియా ప్రతినిధులు జీవీ ఆంజనేయులు అనుచరులను వారించి పంపించారు. కార్యక్రమం ముగిసిన వెంటనే మళ్లీ పదిమంది యువకులు త్రివేణుకుమార్‌ను చుట్టుముట్టి దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో భయభ్రాంతులకు గురైన త్రివేణుకుమార్ సొమ్మసిల్లి పడిపోయారు. మీడియా ప్రతినిధులు అతన్ని వెంటనే వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని త్రివేణుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. గతంలోనూ టీడీపీ కార్యక్రమాలకు వెళ్లగా తనను దూషించారని త్రివేణుకుమార్ తెలిపాడు. త్రివేణుకుమార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి, దాడిని ఖండించారు.

తెలంగాణ

అవినీతికి పాల్పడితే సీఎంలనూ వదలం

మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తేలేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అవినీతి, కుంభకోణాలు పాల్పడటానికి ప్రత్యేక అధికారాలేవీలేవని ఆయన ఘాటుగా స్పందించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు నోటీసులు ఇవ్వడాన్ని పలువురు తప్పుపడుతున్నారని, అక్రమాలకు పాల్పడినవారికి కొందరు బహిరంగంగా మద్దతు తెలుపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి అయినా, ఆ స్థాయి వ్యక్తి కుటుంబసభ్యులైనా అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం ఇక్కడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అతీక్ అహ్మద్ వందకుపైగా కేసుల్లో నిందితుడని, అనేకమందిని హతమార్చిన చరిత్ర అతనిదని పేర్కొన్నారు. సింగరేణి నష్టాల్లో ఉందని, కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, దీంతో కల్వకుంట్ల కుటుంబం కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు సింగరేణి ప్రైవేటీకరణ నాటకాన్ని సాగిస్తోందని పేర్కొన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అదేపనిగా ప్రచారం చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే నిజాం షుగర్స్‌ను వందరోజుల్లో తెరుస్తామని చెప్పి తొమ్మిదేళ్లు అయిందన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు మూతపడుతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం విశాఖ స్టీల్ పరిశ్రమ కొనుగోలు చేస్తామని అనడం హాస్యాస్పదమన్నారు.



సహనం అనేది చేదుగా ఉంటుంది,
కానీ దాని ఫలం ఎంతో తీపి.
– అరిస్టాటిల్

సాక్షి

సోమవారం, 17 ఏప్రిల్ 2023

మనసున మల్లెల మాలలూగెనే!

వసంత గ్రీష్మాలు వేసవికాలం. నింగిలోని సూర్యుడు నిప్పులు చెరిగే కాలం. ఇది ప్రకృతిలోని ఒక పార్శ్వం మాత్రమే! మండుటెండల ధాటికి అల్లాడిపోయే ప్రాణికోటి తాపోపశమనానికి తగిన వెసులుబాట్లను కూడా ప్రకృతి ఏర్పాటు చేసే ఉంచింది. ఏటా వేసవిలోనే నోరూరించే మామిడి పండ్లు విరివిగా పండుతాయి. వేసవిలోనే మల్లెలు విరగబూస్తాయి. వేసవులే లేకపోతే, మామిళ్ల మాధుర్యం, మనసుదోచే మల్లెల పరిమళం మనకు దక్కేవేనా? మల్లెలు, మామిళ్ల కోసమైనా ఏటా వేసవులు రావాల్సిందే! మన సాహిత్యంలో ఎందరెందరో కవులు మల్లెల సౌరభాన్ని వెదజల్లారు.

'మెండు మీఱిన పతగ బీఱెండ దాకి/ యొల్లబోయిన లేబొండుమల్లెపొదల/ తుదల జప్పటలై కడుదొడ్డ లగుచు/ బొడమ మొగ్గలగము లగ్గిబొబ్బలట్లు' అని శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్త మాల్యద' కావ్యంలో వర్ణించాడు. మండువేసవి వేడికి బొండుమల్లెల పొదల చివుళ్లు వాడి అణగి పోయి ఉంటే, వాటి మధ్య పెద్ద పెద్ద మల్లె మొగ్గలు అగ్గిబొబ్బల్లా కనిపించాయట! వేసవిలో ఒంటి మీద పుట్టే సెగ్గడ్డలు ఎవరికైనా అగ్గిబొబ్బల్లానే కనిపిస్తాయి. రాయలవారికి మాత్రం వాడిన చివుళ్ల మధ్యనున్న బొండుమల్లెల మొగ్గలు అగ్గిబొబ్బల్లా కనిపించడం విచిత్రం కాదు, ఆయన వర్ణనా వైదుష్యానికి నిదర్శనం కూడా!

రాయలవారి కంటే ముందు పోతనామాత్యుడు కూడా తన కవిత్వంలో మల్లెలను ప్రస్తావించాడు. 'నల్లనివాడు పద్మనయనమ్ములవాడు... మల్లియలార మీ పొదల మాటున లేడు గదమ్మ! చెప్పరే!' అంటూ గోపికలు నల్లనయ్య జాడ కోసం మల్లెలను ఆరాతీశారట! వాటి పొదల మాటునే ఆ నల్లనివాడు నక్కి ఉంటాడని వాళ్ల అనుమానం పాపం! మన పదకవితా పితామహుడు అన్నమయ్య కూడా శ్రీనివాసుని తలపులతో ఉన్న శ్రీదేవి విరహాన్ని మల్లెలతో పోల్చాడు. 'పాలతి జవ్వనమున బూవక పూచె/ యెలమి నిందుకు మనమేమి సేసేదో' అనే కీర్తనలో 'సతి చింతా లతలలో సంపెంగపూవులు పూచె/ మతి విరహపు మేన మల్లెలు పూచె' అన్నాడు. శ్రీనివాసుని తలపులతోనున్న శ్రీదేవి ఆలోచనల్లో తొలుత సంపెంగలు పూచాయట! మదిలో విరహతాపం మొదలైనప్పుడు మల్లెలు పూచాయట!

వేసవి వేడిని చవిచూసే ప్రతిదేశంలోనూ మల్లెలు పూస్తాయి. మన దేశం నలుచెరగులా మల్లెలు ప్రతి వేసవిలోనూ విరివిగా కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే, మల్లెల ఉత్పాదనలో ఈజిప్ట్, భారత్ పోటాపోటీగా ఉంటున్నాయి. మల్లెలను ఎరిగిన ప్రతి దేశంలోనూ ప్రజలు మల్లెలను ఇష్టపడతారు. అయితే, మిగిలిన జనాలతో పోల్చుకుంటే, మల్లెలంటే మన తెలుగువాళ్లకు మరి కొంచెం మక్కువ ఎక్కువ. 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' అంటూ శంకరంబాడి సుందరాచారి తెలుగుతల్లిని తన మాటల మల్లెపూలదండతో అలంకరించడమే ఇందుకు తిరుగులేని నిదర్శనం.

మన సాహిత్యంలోని ఆధునికుల్లో మల్లెలను అమితంగా ఆరాధించినవాడు చలం. ఆయనకు మల్లెలను అలంకరించుకునే అలవాటు కూడా ఉండేది. మల్లెపూల గురించి ఆయన అద్భుతమైన కవిత రాశారు. 'మల్లెపూలు, తెల్లని మల్లెపూలు!...' అంటూ సాగే ఆ కవితలో 'ఒక్క స్వర్గంలో తప్ప/ ఇలాంటి వెలుగు తెలుపు/ లేదేమో- అనిపించే మల్లెపూలు/ అలసి నిద్రించే రసికత్వానికి/ జీవన మిచ్చే ఉదయపు పూలు/ రాత్రి సుందరస్వప్నానికి సాక్షులుగా/ అవి మాత్రమే మిగిలిన/ నా ఆప్తులు!' అంటాడాయన. మల్లెలంటే అంతటి వల్లమాలిన ఇష్టం ఉండటం వల్లనే కాబోలు చలం ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అంతగా పరిమళభరితం చేశాడు.

మల్లెల్లో రకాలుంటాయి... బొండుమల్లెలు, కాడమల్లెలు, రేకమల్లెలు, సెంటుమల్లెలు. మన కవిత్వంలో సిరిమల్లెలు, మరుమల్లెలు కనిపిస్తాయి. మల్లెలసాగు సిరులు కురిపిస్తుంది. ఇక మల్లెలకు మరులు కురిపించే లక్షణమూ ఉంది. 'అరవింద మశోకం చ చూతం చ నవమల్లికా!/ నీలోత్పలం చ పంచై తే, పంచబాణస్య సాయకాః!' అనే శ్లోకాన్ని గమనిస్తే ఈ సంగతి స్పష్టంగానే అర్థమవుతుంది. మన్మథుడు సంధించే ఐదురకాల పూలబాణాలలో మల్లెల బాణాలు కూడా ఉన్నందునే కాబోలు మన కవులు వాటిని 'మరుమల్లెలు' అంటూ మురిసిపోయారు. మల్లెలకు శృంగారాలంకరణల్లో మాత్రమే కాదు, మన ఆధ్యాత్మిక ఆరాధనల్లోనూ ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా శ్రీమహావిష్ణువుకు మల్లెలు ప్రీతిపాత్రమైనవి. 'మల్లికా కుసుమైరేవం వసంతే గరుడధ్వజమ్/ యోర్చయేపరయా భక్త్యా దహేత్ పాపం త్రిధార్జితమ్' అని 'పుష్పచింతామణి' చెబుతోంది. అంటే వసంత రుతువులో శ్రీమహా విష్ణువును మల్లెలతో అర్చిస్తే, మనోవాక్కాయ కర్మల ద్వారా చేసిన పాపాలన్నీ నశిస్తాయట!

పాశ్చాత్యదేశాల వారికి మల్లెలంటే వెంటనే స్ఫురించేది మన భారతదేశమే! భారతదేశాన్ని మల్లెలకు చిరునామాగా భావిస్తారు వాళ్లు. 'మల్లెలు- అవి భారత్‌లో నా తల్లితండ్రులతో గడిపిన జ్ఞాపకాలను మోసుకొస్తాయి' అంటుంది బ్రిటిష్ నటి యాన్ రీడ్. ఆమె తండ్రి ఒక బ్రిటిష్ దినపత్రిక కోసం భారత్‌లో ఉంటూ పనిచేసేవాడు. అందుకే ఆమె జ్ఞాపకాల్లో ఆ మల్లెల పరిమళం!

జ్ఞాపకాల్లోనే కాదు, పరిసరాల్లోనూ మల్లెల పరిమళం అవసరం. ముఖ్యంగా దేశంలో రాజకీయ దుర్గంధం మితిమీరుతున్న సమాజానికి మల్లెల పరిమళమే కాస్తంత ఉపశమనం. మల్లెలు పూసి, పరిమళించాలంటే ఏటేటా వేసవులు రావాల్సిందే! రాజకీయాల వేడినే భరిస్తున్న వాళ్లం వేసవులను భరించలేమా? కనీసం మల్లెల కోసమైనా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.ద్వాదశి ప.2.56 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.1.58 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర. **వర్జ్యం:** ఉ.9.22 నుండి 10.54 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** సా.6.26 నుండి 7.55 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కావాల్సింది 'వర్గ పోరాటాల చరిత్ర'

విశ్లేషణ



రంగనాయకమ్మ


విద్యలో, 'ప్రభుత్వ జోక్యం' ఈ నాటిది కాదు. ఎప్పుడో 1848లోనే, మార్క్స్, ఎంగెల్సు ఈ వాస్తవాన్ని 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో ప్రస్తావించారు. కులం, మతం, ప్రాంతం- అనే భేదాల్ని ఉపయోగించుకుని అధికారంలోకి రావడానికి ప్రతీ పార్టీ సహజంగానే ప్రయత్నిస్తుంది. అనేక రంగాలలో జరిగే అనేక ప్రయత్నాలలో, పాఠ్య పుస్తకాలలో చేసే ఈ మార్పులు కూడా ఒకటి. చిత్రం ఏమిటంటే, 'ఉభయ' పక్షాల వారూ, రాజుల్నీ, చక్రవర్తుల్నీ దోపిడీ వర్గ ప్రతినిధులుగా చూడరు. ఆ రాజులూ, చక్రవర్తులూ ఆ నాటి కాలాల్లో రైతుల శ్రమ మీదా, చేతివృత్తుల వారి శ్రమ మీదా ఆధారపడి బతికిన పరాన్నజీవులని చెప్పరు.

కాంగ్రెసు ప్రభుత్వం ప్రచురించిన కొన్ని పాఠ్యపుస్తకాలలో వున్న చరిత్రకి సంబంధించిన కొన్ని పాఠాల్ని ఇప్పటి బీజేపీ ప్రభుత్వం తీసివెయ్యడం ఆరు నెలల కిందట (2022 జులైలో) జరిగింది. అది ఇప్పుడు ఒక వివాదంగా వుంది.

కేంద్రంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక రకంగానూ, బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇంకో రకంగానూ చరిత్ర పాఠాల్లో ఈ మార్పులు జరుగుతూ వచ్చాయి! గతంలో ఎప్పుడు, ఎలాంటి మార్పులు చేశారు- అనే వివరాలలోకి వెళ్ళడం ఇక్కడ సాధ్యం కాదు కాబట్టి ఇప్పుడు జరుగుతోన్న వివాదాన్నే ప్రధానంగా చూడాలి. సెంట్రల్ సిలబస్‌లో 6వ తరగతి నించీ 12వ తరగతి వరకూ వున్న సోషలూ, చరిత్రా పాఠాలు పిల్లలకి భారంగా తయారయ్యాయి కాబట్టి కొన్ని పాఠాల్ని తీసివెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ ప్రభుత్వం అంటే, అధికార పార్టీకి అనుకూలంగా వుండే ప్రొఫెసర్ల కమిటీ అన్నమాట! 'సిలబస్ హేతుబద్ధీకరణ' అనే పేరుతో, కొన్ని పాఠాలు తీసేశారు. వాటిలో అతి ప్రధానమైనది – దాదాపు 4 వందల యేళ్ళు పాలించిన మొఘల్ చక్రవర్తుల చరిత్ర. అలాగే, గాంధీ హత్యా, గుజరాత్‌లో మత కల్లోలాలూ, వగైరా, వగైరా.

కాంగ్రెసు ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలలో మొఘలుల పాలనకు విపరీతమైన ప్రాముఖ్యం ఇచ్చారనీ, ప్రాచీన హిందూ రాజుల చరిత్రకి ప్రాధాన్యం లేదనీ, దక్షిణ భారత దేశాన్నీ, ఈశాన్య భారతాన్నీ ఏలిన రాజుల్ని పట్టించుకోలేదనీ, కాంగ్రెసు మీద బీజేపీ సమర్థకుల విమర్శ. ముస్లిం మైనారిటీలను బుజ్జగించి, వారి ఓట్లను పొందడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం, ముస్లిం పాలకులకు అంత ప్రాధాన్యం ఇచ్చిందని కాంగ్రెసు మీద బీజేపీ ఆరోపణ. అయితే, బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్న మార్పులు, మత విద్వేషాలను రెచ్చగొట్టి, ఎన్నికల్లో మెజారిటీ హిందూ మతస్థుల ఓట్లను రాబట్టడానికి చేసిన కుట్ర అని ప్రతిపక్షాల వాదన!

విద్యలో 'ప్రభుత్వ జోక్యం' అనేది ఈ నాటిది కాదు. ఎప్పుడో 1848లోనే, మార్క్స్, ఎంగెల్సు ఈ వాస్తవాన్ని 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో ప్రస్తావించారు. ఆ ప్రభుత్వ జోక్యానికి వుండే పెట్టుబడిదారీ వర్గ స్వభావాన్ని కార్మికవర్గ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చాలని ఆ ప్రణాళిక ఉద్దేశం. ఆ దృష్టితో చూసినప్పుడు కాంగ్రెస్సూ, బీజేపీ – రెండూ బూర్జువా వర్గ ప్రయోజనాలను కాపాడేవే. అలా కాపాడడం కోసం, అధికార పీఠం ఎక్కడానికి, అవి ఎంచుకునే పద్ధతులు తేడాగా వుంటాయి. ఉదాహరణకి, బీజేపీ ఎందుకు హిందూ మెజారిటీ ఓట్ల మీద ఆధారపడుతుందీ అనే విషయం అర్థం చేసుకోవాలంటే, 1906లో ఏర్పడ్డ 'ముస్లిం లీగ్' గురించీ, 1915లో ఏర్పడ్డ 'హిందూ మహాసభ' గురించీ తెలుసుకోవాలి. అప్పుడు ఆ మతాలకు చెందిన భూస్వాములకూ, పరిశ్రమాధిపతులకూ, వర్తకులకూ, రాజకీయ నాయకులకూ, అటువంటి వారి ప్రయోజనాల మధ్య వున్న వైరుధ్యాలను పరిశీలించాలి. అదంతా ఇక్కడ వీలుకాదు. సారాంశం ఏమిటంటే, మత సంస్థలు గానీ, మతంతో ముడిపడి వున్న రాజకీయాలు గానీ, నిజంగా మతాలకు సంబంధించిన అంశాలు కావు. ఇప్పుడే కాదు, కొన్ని వందల ఏళ్ళ కిందట మతం పేరుతో జరిగిన యుద్ధాల్లో కూడా, ఎంగెల్సు చెప్పినట్టు, 'స్పష్టమైన భౌతిక వర్గ ప్రయోజనాలు వుండినాయి'! 'ఆ నాటి వర్గపోరాటాలు మత నినాదాల దుస్తులలో వుండి, వేరువేరు వర్గాల ప్రయోజనాలూ, అవసరాలూ, డిమాండ్లూ వంటివి, మతం అనే తెరవెనక మరుగు పడ్డాయ'నే విషయాన్ని 'జర్మనీలో రైతు యుద్ధం' అనే పుస్తకంలో ఎంగెల్సు చాలా వివరంగా చెపుతాడు. అది ఈ నాటికీ వాస్తవమే. పైకి, తక్షణంగా, ఒక కారణం (ఉదా: గోద్రా రైలు దహనం, ఆ తర్వాత జరిగిన మత కల్లోలాలు) కనిపించినప్పటికీ, అనేక లింకుల ద్వారా చరిత్రని పరికిస్తే – మనకి పాలకవర్గ ప్రయోజనాలు కనిపిస్తాయి. 'వర్గ ప్రయోజనం' అన్నప్పుడు రెండు వేరు వేరు వర్గాలు- అనే కాదు; ఒకే వర్గంలోనే, రెండు వేరు వేరు సెక్షన్ల ప్రయోజనాల మధ్యకూడా వైరుధ్యాలు ఉంటాయి.




వర్గాలుగానూ, ఉపవర్గాలుగానూ చీలివున్న సమాజంలో, పాలక వర్గ ప్రయోజనాలను కాపాడడానికి, ఒకే ఒక్క రాజకీయ పార్టీయే వుండదు. అనేక పార్టీలు వుంటాయి. కులం, మతం, ప్రాంతం- అనే భేదాల్ని ఉపయోగించుకుని అధికారంలోకి రావడానికి ప్రతీ పార్టీ సహజంగానే ప్రయత్నిస్తుంది. అనేక రంగాలలో జరిగే అనేక ప్రయత్నాలలో, పాఠ్య పుస్తకాలలో చేసే ఈ మార్పులు కూడా ఒకటి. ఈ చరిత్ర పుస్తకాలలో రాజుల్నీ, చక్రవర్తుల్నీ చిత్రించేటప్పుడు ఒక పక్షం మేధావులు అన్ని మతాల పాలకుల్నీ కొంత 'సంస్కరణ వాద దృక్పథం'తో చూపుతారు. ఇంకో పక్షం మేధావులు హిందూ పాలకుల్ని మాత్రమే గొప్ప చేస్తూ, ముస్లిం రాజుల్ని దుష్టులుగా చూపుతారు. చిత్రం ఏమిటంటే, ఉభయ పక్షాల వారూ, రాజుల్నీ, చక్రవర్తుల్నీ దోపిడీ వర్గ ప్రతినిధులుగా చూడరు. ఆ రాజులే స్వయంగా దోపిడీదారులనీ, వాళ్ళు శ్రామిక జనాలనించీ లాగిన కౌలూ, వడ్డీ, లాభాల వంటి శ్రమ దోపిడీ ఆదాయాల మీదే బతికిన వాళ్ళనీ మాత్రం గుర్తించరు. వాళ్ళ వీరత్వం గురించీ, యుద్ధ కళల గురించీ, కళా పోషణల గురించీ, వాళ్ళ పాండిత్య ప్రతిభల గురించీ, మత సామరస్యాల గురించీ, వాళ్ళ దైవభక్తి గురించీ, దానశీలతల గురించీ... ఇలా, ఇలా చిత్రించుకుంటూ పోతారు, ఇరుపక్షాల వారూ కూడా! అంతేగానీ, ఆ రాజులూ, యువరాజులూ, రాణులూ, యువ రాణులూ, ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టేవారు కాదనీ, వాళ్ళది వందలాది సేవక పరివారం మీద ఆధారపడిన పరమ సోమరి జీవితం అనీ మాత్రం ఎక్కడా ఒక్క ముక్క అయినా రాయరు. ఆ రాజులూ, చక్రవర్తులూ ఆ నాటి కాలాల్లో రైతుల శ్రమ మీదా, చేతి వృత్తుల వారి శ్రమ మీదా ఆధారపడి బతికిన పరాన్న జీవులనీ చెప్పరు (స్కూలు పుస్తకాల్లో కాదు గానీ, చరిత్రకి సంబంధించిన ఇతర రచనల్లో, వర్గాల గురించీ, వర్గ పోరాటాల గురించీ రాసిన మేధావులు కొందరైనా వున్నారు).

చరిత్రకి సంబంధించిన పాఠ్యపుస్తకాల వివాదం చూశాక, శ్రామిక వర్గ పక్షం వహించే రచయితలు చెయ్యాల్సింది ఏమిటి? 'పిల్లల కోసం వర్గపోరాట చరిత్ర పాఠాలు' రాయడం! 'పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం' పేరుతో రాసినట్టు, వర్గ దృక్పథంతో కొన్ని చరిత్ర పాఠాలు రాయాలనివుంది నాకు. బీజేపీ ప్రభుత్వం అంటే భయం లేదుగానీ, నా 'హెర్నియా' జబ్బు రాయనిస్తుందో లేదో చూడాలి!

వ్యాసకర్త ప్రసిద్ధ రచయిత్రి

పేదరికాన్ని నిర్మూలిస్తే... బాల కార్మికులుండరు!

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

భారతదేశంతో సహా ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థ కొనసాగుతున్నది. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 5 నుంచి14 సంవత్సరాల వయస్సులో ఉన్న బాల కార్మికులు కోటి 26 లక్షల మంది ఉన్నారు. వీరిలో 12 లక్షల మంది ప్రమాదకర వృత్తుల్లో ఉన్నారు. బెల్జియం దేశ జనాభా కన్నా వీరి సంఖ్యే ఎక్కువ. ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం 43 శాతం పిల్లలు 8వ తరగతి లోపే బడి మానేసి బాల కార్మికులుగా మారారు. ఇది షెడ్యూల్డ్ కులాల్లో 55 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో 63 శాతంగా ఉంది. 'ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్' ప్రకారం భారత దేశంలో ఆరు కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారు. అనధికార గణాంకాల ప్రకారం బాల కార్మికుల సంఖ్య 10 కోట్లు. భారత్ మొత్తం జనాభాలో వీరు 14 శాతం కాగా, కార్మికుల్లో 4 శాతంగా ఉన్నారు.

భారతదేశం లోని ప్రతి పది మంది పిల్లల్లో ఒకరు జీవనోపాధి కోసం పని చేస్తున్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో బాల కార్మికుల యజమానులు ఉన్న రాష్ట్రాలు బిహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర. ప్రపంచం మొత్తం మీద అత్యధిక బాల కార్మికులు భారతదేశంలోనే ఉన్నారు. ఇందులో ఎక్కువమంది వ్యవసాయ రంగంలో ఉన్నారు. బాల కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వీరికి వేతనం తక్కువ, పని గంటలు ఎక్కువ. వజ్రాల పరిశ్రమ, శివకాశీలోని టపాసుల తయారీ పరిశ్రమ, జైపూర్ లోని రాళ్ల చెక్కుడు, పన, ఫిరోజాదుల్లోని అద్దాల పరిశ్రమ, మురాదాబాద్‌లోని లోహ పరిశ్రమ, అలీగఢ్‌లోని తాళాల పరిశ్రమ, మీర్జాపూర్ తివాచీల తయారీ, మార్కాపూర్ పలకల తయారీ పరిశ్రమ వంటి వాటిల్లో బాలకార్మికులు ప్రధానంగా పని చేస్తున్నారు.

ఈ పరిశ్రమల్లో పనిచేసే పిల్లలు అనేక రుగ్మతలకు గురౌతున్నారు. తివాచీల తయారీ పరిశ్రమల్లో పనిచేసే బాలలు కంటి చూపు కోల్పోతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. కశ్మీరులోని తివాచీల పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 60 శాతం మంది క్షయ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నారని అనేక సర్వేలు చెబుతున్నాయి. ఫిరోజాబాద్‌లోని గ్లాస్, గాజుల పరిశ్రమల్లో పనిచేసే పిల్లలు ఆస్తమా, బ్రాంకైటిస్, కంటి సంబధిత రోగాలకు గురౌతున్నారు. శివకాశి టపాకాయల పరిశ్రమల్లో పేలుళ్ళ వల్ల అనేకమంది



ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురౌతున్నారు. 50 శాతం మంది ఏదో ఒక రూపంలో లైంగిక వేధింపులకు గురౌతున్నారు. దేశంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం ఎక్కువగా ఉన్న పేద ప్రాంతాల్లో మైకా బెల్ట్ ఒకటి. ఇక్కడా పెద్ద సంఖ్యలో బాలకార్మికులు ఉన్నారు.

భారతదేశంలో తీవ్రంగా ఉన్న బాల కార్మిక వ్యవస్థపై అనేక దేశాలు విమర్శలు చేయటంతో... బాలల రక్షణ కోసం అంటూ పాలకులు కొన్ని చట్టాలు చేశారు. కానీ ఈ చట్టాలేవీ బాలలను బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి చేయలేక పోయాయి. అలంకార ప్రాయ చట్టాలుగానే మిగిలాయి.

బాల కార్మిక సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాల వైఫల్యాలపై తీవ్ర విమర్శలు రావటంతో... వారి సమస్యలను అధ్యయనం చేసి తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సులు చేయటానికి 1979లో గురుపాదస్వామి కమటీని ఏర్పాటుచేసింది ప్రభుత్వం. పేదరికం ఉన్నంత వరకు బాల కార్మిక వ్యవస్థ ఉంటుందనీ, ఈ సమస్యను న్యాయ చర్యల ద్వారా నిర్మూలించలేమనీ కమిటీ పేర్కొంది.

బాలలు... కార్మికులుగా మారటానికి ఏ దేశంలోనైనా సామాజిక, ఆర్థిక విధానాలు, ఆర్థిక వ్యత్యాసాలు ప్రధాన కారణం. భారత సామాజిక వ్యవస్థ ఆర్థిక వ్యత్యాసాలతో కూడుకున్నది. దీనికి రాజ్యాంగ సంస్థలు, వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న దోపిడీ వర్గాల ప్రభుత్వాలు రక్షణగా ఉన్నాయి. దేశ వనరులన్నీ కొద్ది మంది చేతుల్లోకి వెళ్లి సంపద కేంద్రీకరణ జరుగుతున్నది. నేడు దేశంలో పేదరికం 45 శాతం పైగా ఉంది. గ్రామీణ పేదరికం 50 శాతం పైగా ఉంది. ఫలితంగా గ్రామీణ, పట్టణ పేదల కుటుంబ పోషణ భారంగా మారింది. వారికి వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు ఏ మాత్రం చాలక పిల్లలను కూడా పనుల్లోకి పంపవలసిన అవసరం ఏర్పడింది. ఆ విధంగా పేద కుటుంబాల పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు.

గ్రామీణ పేదలకు భూసంస్కరణల ద్వారా భూమి పంపిణీ చేయడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించడం, గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశ సహజ వనరులను ప్రజల అవసరాలకు ఉపయోగించడం వంటి చర్యల ద్వారా బాల కార్మికులు పుట్టుకురాకుండా అరికట్టగలం. ప్రజలే అందుకు పిడికిలి బిగించాలి.

వ్యాసకర్త ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
మొబైల్: 98859 83526

సభ్యసమాజానికి ఏం మెసేజ్ ఇద్దామని?

సారాంశం
సరికొండ చలపతి

ఆ మధ్య విన్న ఓ పాట...
చిన్న గౌను వేసుకున్న పెద్దపాపా..
నీ చిన్న నాటి ముద్దుపేరు లాలిపాపా
హై టెక్‌టెక్కు చూస్తె హీటు పుట్టు వెంటనే
ఫ్లైటు ఎక్కి నిన్ను చేరి కన్నుకొట్టు క్లింటనే..
– ఇది ఆనాటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్‌పై మన కుర్రకారు అభిప్రాయం. మోనికా లెవెన్‌స్కీతో రాసలీలలు పాపులరయి, క్లింటన్ ప్రపంచవ్యాప్తంగా బాగా అన్‌పాపులర్ అయిన రోజులనాటి సినిమా పాట..

......

తాజాగా పోర్న్ స్టార్‌తో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ సంబంధాలు, ఆయన హయాంలో ఆమెకు చేసిన ఫేవర్లు.. వెరసి కేసులు, ట్రంప్ అరెస్టులు.. ఇప్పుడో ఎపిసోడ్ నడుస్తోంది.

......

నిరుపేద కుటుంబం నుంచి వచ్చి... వీధి దీపాల కింద చదువుకుని అట్టడుగు స్థాయి నుంచి అగ్రరాజ్యానికి అధినేత అయిన అబ్రహం లింకన్‌ను చరిత్ర సగౌరవంగా అక్కున చేర్చుకుంది. అనేక తరాలకు స్ఫూర్తిదాయకమైంది. ఒక నేత యువతకు ఎలా మార్గదర్శకమవుతాడో పాఠాల్లో ఆయన్ను మనం చదువుకున్నాం. మరి క్లింటన్, ట్రంప్ లాంటి ఈనాటి నాయకులు ఇప్పటి యువతకు ఏం మెసేజ్ ఇస్తున్నారో పైన పాట చూస్తే అర్థమవుతోంది.

......

ఇక లోకల్ ఏరియాకొస్తే.. మచ్చుకుకొన్ని..
– ఓ మహిళానేత ఒక నాయకుడిపై ప్రెస్ మీట్ పెట్టి మరీ చెబుతుంది..లైంగికంగా వేధిస్తున్నాడని.
– మరో ఎమ్మెల్యే గలీజ్ వ్యవహారంపై ఓ మహిళ వాట్సాప్ మెసేజ్‌లు రిలీజ్ చేస్తుంది.
– మరో శాసనసభ్యుడు సభలోనే అశ్లీల వీడియోలు చూసి దొరికిపోతాడు.
– మరో మహా నాయకుడు మాట జారి పరువు నష్టాన్ని ఎదుర్కొని లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు.
– ఒక పార్టీ రాష్ట్రనేత, ఎంపీ పేపర్ లీకేజీ కేసులో జైలుకు వెళ్తాడు.
– మరో పార్టీ అధినేత తలపై ఓటుకు నోటు కేసు వేలాడుతూ ఉంటుంది.
– మరో మహిళా నేతపై సీబీఐ ఎంక్వయిరీ నడుస్తూంటుంది.
... ఇలా ప్రతి రోజూ ఏదో ఒక నేత మీద ఏదో ఒక ఆరోపణ, స్కాము.. ఏదో మరక పడుతూనే ఉంది. ఇదంతా గమనిస్తున్న యువతకు, వచ్చే తరానికి ఏం మెసేజీ వెళ్తుంది?
వస్తున్న ఆరోపణలూ, కేసులు, ఎంక్వయిరీలు నిజమని నిర్ధారించలేం.
ఇవన్నీ రాజకీయ ఎత్తుగడలలో భాగమే కావచ్చు. నిఖార్సయిన నేతలకు కూడా బురద పూయడం కూడా చూస్తున్నాం. వీరిపై ఆరోపణలన్నీ నిజాలు కావని కొద్ది కాలానికి నిగ్గు తేలవచ్చు.
– కానీ, అప్పటికే సమాజంలో జరగవలసిన డ్యామేజీ జరిగిపోతుంది.

......

ఈ కథ చూడండి... ఇప్పుడు జరుగుతున్న తతంగానికి దగ్గరగా ఉంటుంది.
అనగనగా ఒక పల్లెటూర్లో ఒక వ్యక్తి ఉండేవాడు. అతనికి నెత్తిపై ఒక్క వెంట్రుక కూడా ఉండేది కాదు. నున్నగా చెంబులాగా తళతళలాడుతుండేది. అందుకని అతన్ని అందరూ 'నున్న గుండూ' అని పిలిచేవారు. క్రమంగా ఊరి వారందరూ అతని



పేరు మరచి పోయారు. నున్న గుండూ.. నున్న గుండూ అని పిలుస్తూంటే చాలా ఉక్రోషంగా, అవమానకరంగా ఉండేది. ఇది భరించలేక ఓ రోజు ఊరు వదిలి వెళ్లి పోయాడు. అలా తిరుగుతున్న క్రమంలో ఓ అడవిలోకి ప్రవేశించాడు. అతనికి ఓ మునీశ్వరుడు ఎదురుపడ్డాడు. ఆయన మన హీరోను చూసి ఆశ్చర్యపోయి ఇంతటి అరణ్యంలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావని ప్రశ్నించాడు. మనవాడు వలవలా ఏడుస్తూ తన గుండు విషయం, తద్వారా జరుగుతున్న అవమానం విషయం చెప్పాడు.
'మీ మహిమతో నా గుండు మీద ఎలాగైనా జుట్టు మొలిపించండి స్వామీ...' అని కాళ్లావేళ్లా పడ్డాడు. అప్పుడా ముని... ' పోయిన జుట్టును మొలిపించడం బ్రహ్మతరం కాదు నాయనా. దాని సంగతి మరిచిపో.. ఇంటికి వెళ్లు ' అని నిష్కర్షగా చెప్పేశాడు. దానితో మన హీరో మళ్లీ గొల్లుమన్నాడు. దానితో ముని మనసు కరిగి..'జుట్టు మొలిపించలేను కానీ , నీకు ఒక వరం ఇస్తాను...' అని అతని చేయి తీసుకుని మంత్రం వేశాడు.
'ఇక నుంచి ఎవరైనా నిన్ను నున్న గుండూ అని పిలిస్తే నీ చెయ్యి వారి తల మీద పెట్టు. తక్షణం వాడి జుట్టు కూడా ఊడి పోయి నీలా నున్నగుండులా మిగుల్తాడు..' అని చెప్పి వెళ్లిపోయాడు.
మన వాడు ఆనందంగా ఇంటికి బయలు దేరాడు. ఊరిలోకి ఎంటర్ అవుతుండగానే 'ఓరి నున్న గుండూ! ఇన్ని రోజులు ఎక్కడికి పోయావు, కనిపించడంలేదు ..' అని ఓ వ్యక్తి పలకరించాడు. మనవాడికి కోపం వచ్చింది. నన్ను గుండు అంటావా అంటూ ఆ వ్యక్తి నెత్తి మీద చేయి పెట్టాడు. ఆ వ్యక్తి జుట్టంతా రాలిపోయి గుండు మిగిలింది. అది చూసిన మన 'నున్న గుండు' ఆనందానికి అవధుల్లేవు. అప్పటినుంచి ఎవరు నున్న గుండూ అని పిలిచినా వారి తలమీద చేయిపెట్టి వారికి జుట్టు లేకుండా చేసేవాడు.
ఆ ఊరులో మూడొంతుల మంది మనవాడిలాగే.. నున్నగుండులై పోయారు. అలా ఎవరు అసలు మొదటి నున్నగుండో తెలియకుండా పోయింది...

......

ఇది తలల సంగతి .. మన నేతల సంగతి అలాగే కనిపిస్తోంది.
పాలిటిక్స్‌లో ఇప్పుడదే ట్రెండ్ .. అచ్చం ఇలాగే. అందరి చేతుల్లోనూ అదే శక్తి.. ముని వరం కనిపిస్తోంది.
ఒకరి మీద ఆరోపణలు రాగానే తానొక్కడినే దోషిని కానంటూ మరొకరిపై నిందలు వేయడం ..వారి తలపై చేయిపెట్టడం..వారి బాగోతాన్ని బయటపెట్టడం. తమ స్థాయికి వారిని తీసుకురావడం..తాజా పేపర్ లీక్ అయినా, లిక్కర్ స్కామ్ అయినా ఇంకా దేశవ్యాప్తంగా ఏ ఇతర స్కామ్ అయినా.. మరొకరిపై నిందలు ఆరోపణలు.. వందల కొద్దీ కేసులు. ఎంక్వయిరీలు. పైన చెప్పినట్టు ఎదుటి వారి తలపై చేతులే.. అంతా నున్నగుండులే. అసలు దోషులెవరో తెలియకుండా. దీనికి అధికారపక్షం, ప్రతిపక్ష నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు ఎవరూ మినహాయింపు కాదు, అందరికీ ఏదో మరక కనిపిస్తూనే ఉంటుంది.

......

ఈ క్రమంలో... చివరికి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవడానికి, చరిత్ర చెప్పుకోవడానికి ఈ జనరేషన్‌లో ఒక్క నేతా లేకుండా చేసుకుంటున్నట్టున్నాం. ఈ జనరేషన్ సంగతి సరే. ఈ రాజకీయంలోకి పాత తరం నేతలను కూడా లాగేసి వారినీ మన గాటన కట్టేస్తున్నాం. ఇప్పటిదాకా మనం ఆదర్శప్రాయులని పాఠాల్లో నేర్చుకుని వారిని అనుసరించే ప్రయత్నం చేసిన వారందరిపైనా ఏదో ఒక అపనింద.. మరక.
కొన్ని తరాలను తమ ప్రవర్తనతో, వ్యక్తిత్వంతో, త్యాగాలతో జాతిని వెలిగించిన వారిని .. ఎవరికి వారు వారి 'రాజకీయ సమూహం'లో కలిపేసుకుని ఎదుటివారిని బురదలో నెట్టే పని చాలా బలంగా నడుస్తోంది. మనతరం వచ్చేతరానికి స్ఫూర్తి చిహ్నంగా నిలవక పోవడమే కాదు.. పాత తరాన్ని కూడా స్ఫూర్తిదాయకం కాకుండా శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాం.
వందల అడుగుల ఎత్తున వాళ్ల విగ్రహాలను పెట్టుకోవడమే కాదు,
అంత ఎత్తున వారిని ఉండనిద్దాం..
– లేకుంటే వచ్చే తరానికి లింకన్లు కాదు కన్నుకొట్టే క్లింటన్లు, ట్రంప్‌లే ముందు తరాలకు కనిపిస్తారు.. చిలిపి పాటలు పాడుకోవడానికి.

అష్టభావ పుష్పార్చన

భగవంతునికి సుగంధభరితమైన పువ్వులతో పూజలు చేస్తుంటాం. అయితే, ఎనిమిది భావ పుష్పాలతో పూజించాలని పెద్దలు చెపుతారు. వాటిలో, అహింసా పుష్పం మొదటిది. ఇతరులను మాటలతో గానీ, చేతలతో గానీ గాయ పరుస్తూ పూజ చేస్తే దేవుడు మెచ్చడు. అలాగే, మనసును పూర్తిగా లగ్నం చేస్తూ ఇంద్రియ నిగ్రహం అనే పుష్పంతో పూజించాలి. మానవ సేవే మాధవ సేవ. సర్వ జీవుల పట్ల కరుణ చూపుతూ సర్వ భూత దయ అనే పుష్పంతో



పూజిస్తే దైవం ప్రసన్నుడవుతాడు. చేసే పూజ పట్ల, భగవంతుని తత్త్వం పట్ల ఎరుక కలిగి చేస్తే అది జ్ఞాన పుష్పంతో చేసే పూజ!

ఇతరుల తప్పులను క్షమించగలిగే క్షమాగుణం ఎంతో గొప్పది. క్షమాగుణమనే పుష్పం పూజకు ఎంతో శ్రేష్ఠం. తపస్సు వల్ల ఏకాగ్రత సిద్ధిస్తుంది. ఎందరో మునులు తపస్సు చేతనే దైవాన్ని ప్రత్యక్షం చేసుకున్నారు. అందుకే తపస్సు అనే పుష్పం పూజకు ఉత్తమం. పూలు, పండ్లు, ధూప దీపాలు లేకపోయినా, నిశ్చలమైన ధ్యాన పుష్పంతో భగవంతుని కరుణను పొందవచ్చు. సత్యమున్న చోటు దైవం స్థిర నివాసం. ఎటువంటి పాపులనైనా భరించగలను గానీ సత్యహీనుని ఒక్కరినైనా భరించలేనని బ్రహ్మతో భూదేవి మొర పెట్టుకుందట.

అసత్యాలు పలికేవారికి సమాజంలో విలువ ఉండదు. దైవం దృష్టిలోనూ విలువ ఉండదు. సత్యమనే పుష్పంతో పూజిస్తే దైవం త్వరగా అనుగ్రహిస్తాడు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

శ్రీశైల క్షేత్రంలో డ్రోన్ చక్కర్లు

- అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో షూటింగ్
- పోలీసులకు దేవస్థాన అధికారుల ఫిర్యాదు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం అర్ధరాత్రి ఒక డ్రోన్ చక్కర్లు కొట్టింది. దేవస్థానం, పోలీసు శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు పుణ్యక్షేత్రం పురవీధుల్లో డ్రోన్ కెమెరాతో షూటింగ్ చేశారు. ఈ విషయాన్ని స్థానికులు దేవస్థాన అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో దేవస్థాన సీఎస్‌వో అయ్యన్న తమ సిబ్బందితో కలిసి పలు సత్రాల్లో విస్తృతంగా సోదాలు చేసినా, డ్రోన్ వినియోగించిన వ్యక్తి ఆచూకీ లభించలేదు. పుణ్యక్షేత్రం వీధుల్లో డ్రోన్ తిరగడంపై సీఎస్‌వో అయ్యన్న శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈవో లవన్న తెలిపారు. సీఎస్‌వో ఫిర్యాదు మేరకు ఐపీసీ 336, 287 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు శ్రీశైలం ఒకటో పట్టణ ఎస్‌ఐ జి.లక్ష్మణరావు చెప్పారు.

'రామాయణం' పట్టు చీర ప్రదర్శన

అద్దంకి రూరల్ : బాపట్ల జిల్లా అద్దంకి హరిహర గోకుల క్షేత్రం నిర్వాహకుడు గొనుగుంట సుబ్బారావు, గోసంరక్షణ బాధ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 160 అడుగుల పొడవు కలిగిన పట్టు చీరను ప్రదర్శించారు. సత్యసాయి జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు జి.నాగరాజు చీరపై నేసిన 168 రామాయణ ఘట్టాలు, 13 భారతీయ భాషల్లో 32,200 శ్రీరామ నామాలు ఆకట్టుకుంటున్నాయి. అయోధ్య తీసుకువెళుతూ అద్దంకిలో ఈ ప్రత్యేక చీర ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

నేడు 116 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు!

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 116 మండలాల్లో సోమవారం వడగాడ్పులు వీయడంతోపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. అనకాపల్లి, ఎన్టీఆర్ జిల్లాల్లో 15 మండలాలు చొప్పున విజయనగరం, వైఎస్సార్ జిల్లాల్లో 13 మండలాలు చొప్పున, పార్వతీపురం మన్యం జిల్లాలో 10, కాకినాడ జిల్లాలో 9, తూర్పుగోదావరి జిల్లాలో 8 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉండే అవకాశం ఉందని వివరించారు. కాగా, ఆదివారం వంద మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లాలో 11, కాకినాడ జిల్లాలో 3, విజయనగరం జిల్లాలోని 3 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచినట్లు వాతావరణ శాఖ తెలిపింది. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం కనిమెరకలో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీకాకుళం జిల్లా బుర్జ మండలం కొల్లువలసలో 43.9, అనకాపల్లి జిల్లా మడుగులలో 43.8, నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లెలో 43.7, ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం మేకలవారిపల్లిలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.4	28.1
విజయవాడ	43.0	27.0
రాజమహేంద్రవరం	43.0	27.5
ఏలూరు	43.0	26.0
అనంతపురం	42.3	23.7
ఆమదాలవలస	42.0	26 .0
మార్కాపురం	42.0	26 .0
కర్నూలు	41.8	26.5
తిరుపతి	41.0	22.0
అనకాపల్లి	40.5	26.8
విశాఖపట్నం	40.4	28.0
నెల్లూరు	40.2	27.0
కడప	39.9	22.4
విజయనగరం	39.0	28.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	41.3	21.4
రామగుండం	40.6	23.4
హైదరాబాద్	37.8	24.6

డేంజర్ 'లైఫ్‌స్టైల్'

జీవనశైలి మార్పులతో దేశంలో 63 శాతం మంది మృత్యువాత

- జీవన విధానం, ఆహార అలవాట్లతో చుట్టుముడుతున్న వ్యాధులు
- ఊబకాయం, క్యాన్సర్, గుండెపోటు, శ్వాసకోస జబ్బులే అధికం
- 2030కి ప్రతి మూడు మరణాల్లో ఒకటి జీవనశైలి వ్యాధులతోనే..
- ప్రపంచ ఆరోగ్య సంస్థ, టారీ, తదితర సంస్థల నివేదికలు
- అప్రమత్తంగా ఉండాలని వైద్య సంఘాలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ లేఖ



సాక్షి ప్రతినిధి, కర్నూలు: ప్రపంచీకరణతో ప్రపంచమే ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిపోయింది. పోటీ ప్రపంచంలో అందరి కంటే ముందుండటానికి ఉరుకులపరుగుల జీవితం ప్రతి ఒక్కరికీ నిత్యకృత్యమైపోయింది. ఈ ప్రపంచీకరణతో మనిషి ఆలోచనలు, అలవాట్లు, ఆహారం అన్నీ మారిపోయాయి. మారిన జీవనశైలి తనతోపాటు కొన్ని వ్యాధులను కూడా మోసుకొస్తోంది. దీంతో ఊబకాయం, క్యాన్సర్, గుండెపోటు, శ్వాసకోశ వ్యాధులు అధికమవుతున్నాయి. ప్రస్తుతం దేశంలో మరణిస్తున్న ప్రతి వంద మందిలో 63 శాతం మంది జీవనశైలి వ్యాధులతోనే మృతి చెందుతున్నారు. పొగ తాగడం , మద్యపానం, పోషకాహారలోపం, శారీరక వ్యాయామం లేకపోవడం, మానసిక, పని ఒత్తిళ్లు అనారోగ్యానికి ప్రధాన కారణాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) స్పష్టం చేసింది. 2030లో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు జీవనశైలి వ్యాధులతోనే మరణిస్తారని బాంబు పేల్చింది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగిస్తోంది.

టారీ సర్వేలో ఆందోళనకర అంశాలు

అలాగే థాట్ ఆర్బిటరేజ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టారీ) దేశంలోని 21 రాష్ట్రాల్లో 2,33,672 మంది వ్యక్తులను, అలాగే 673 ప్రజారోగ్య కార్యాలయాలను పరిశీలించింది. ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. 18 ఏళ్లు దాటిన వారు కూడా జీవనశైలి వ్యాధుల (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్-ఎన్‌సీడీ) జాబితాలో ఉన్నారు. 35 ఏళ్లు దాటిన వారికి హైపర్‌టెన్షన్, జీర్ణ సమస్యలు, షుగర్ ఎక్కువగా వస్తున్నాయి. వీటి తర్వాత స్థానంలో క్యాన్సర్ నిలుస్తోంది. దేశంలో 26–59 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరు ఎన్‌సీడీ జబ్బులతో బాధపడుతున్నారు. ఇది దేశానికి చాలా ఆందోళన కలిగించే అంశమని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. వీరు అనారోగ్యానికి గురైతే దేశ భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. దీంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గోయల్ దేశవ్యాప్తంగా వైద్య సంఘాలకు తాజాగా లేఖ రాశారు. జీవనశైలి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అధిక బరువు (ఒబేసిటీ)



2005తో పోల్చితే 2015లో అధిక బరువుతో బాధపడే వారి సంఖ్య రెట్టింపయింది. ఇందులో 20.7 శాతం మంది పురుషులు, 18.6 శాతం మంది స్త్రీలు ఉన్నారు. అయితే 2023కు ఈ సంఖ్య మళ్లీ రెట్టింపయింది. శారీరక శ్రమ లేకపోవడమే అధిక బరువుకు ప్రధాన కారణం.

మానసిక సమస్యలు



దేశం మొత్తం జనాభాలో 10 శాతం మంది పలు రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. 18 ఏళ్ల యువకులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. ఇప్పుడు ఈ సంఖ్య ఏటా 13 శాతం చొప్పున పెరుగుతోంది. దేశంలో కనీసం 15 కోట్ల మంది పలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. తమకు మానసిక సమస్య ఉంది అని గుర్తించలేని స్థితిలో మరో 5 కోట్లమంది దాకా ఉన్నారు. వీరందరికీ సైకియాట్రిస్టుల అవసరం ఉంది.

క్యాన్సర్

ప్రమాదకర రసాయనాలు ఉన్న కాస్మోటిక్స్, రసాయనాలతో మిళితమైన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, వాయు, వాతావరణ కాలుష్యం, మద్యం, పొగాకు, మాంసాహారం ఎక్కువ తీసుకోవడం, కూరగాయలు తక్కువగా తీసుకోవడం వంటి కారణాలతో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 5–8 శాతం పెరుగుతోంది. దీంతో ప్రతి ఒక్కరూ ఏడాదిలో ఒక్కసారైనా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జీవన విధానంలోని మార్పులు, సమతుల్యమైన ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడంతో 26 శాతం మంది గుండెజబ్బులకు గురవుతున్నారని 'టారీ' సర్వే తేల్చింది.

పాశ్చాత్య సంస్కృతితో ముప్పు..

మనదేశంలో పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి రాత్రిళ్లు మరీ ఎక్కువసేపు మెలకువతో ఉంటున్నారు. ఆహార అలవాట్లు, జీవన విధానం కూడా మారిపోయాయి. దీంతో రోగాలు చుట్టుముడుతున్నాయి. ఉదయమే నిద్రలేస్తే 'కార్టిజాల్' హార్మోన్ ఉత్పత్తితో బాడీ రిథమ్‌లో పనిచేస్తుంది. ఆలస్యంగా నిద్రలేస్తే దీని ఉత్పత్తి తగ్గిపోతుంది. రాత్రిళ్లు పనిచేసే వారు పగలు నిద్రపోతున్నారు. ఇది చాలా ప్రమాదం. కచ్చితంగా ప్రతి ఒక్కరూ వ్యాయామానికి సమయం కేటాయించాలి. దీంతో ఎండార్ఫిన్ ఉత్పత్తి అయి మెదడు చురుగ్గా పనిచేయడంతోపాటు ఒత్తిడి తగ్గుతుంది.

– డాక్టర్ శ్రీనివాసులు, హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ, కర్నూలు ప్రభుత్వాస్పత్రి

పట్టణాలు, మెట్రో నగరాల్లో మరింత ప్రమాదం..

జీవనశైలి వ్యాధులకు గురవుతున్నవారిలో పట్టణాలు, మెట్రో ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారు. బెంగళూరుకు చెందిన మాక్స్ హెల్త్‌కేర్ చైర్మన్, ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ అంబరీస్ మిట్టల్ పరిశీలనలో 1970లో దేశంలో పట్టణ ప్రాంతాల్లో 2 శాతం మందికి షుగర్ ఉండేది. 2020లో ఇది 15–20 శాతానికి పెరిగింది. ప్రస్తుతం అది 27 శాతానికి చేరింది. అలాగే మెట్రో నగరాల్లో 35–40 శాతం మందికి షుగర్ జబ్బు ఉంది. ఇదే క్రమంలో నరాల సంబంధిత వ్యాధులు గత 30 ఏళ్లతో పోల్చితే నాలుగురెట్లు పెరిగాయని న్యూఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీ న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ రాజేందర్‌కే ధనుంజయ పరిశీలనలో తేలింది.

కాలినడక భక్తులకు దివ్యదర్శనం టోకెన్లు జారీ



నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతున్న భాష్యకారులు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి అలిపిరి నడక మార్గంలో నడిచివెళ్లే భక్తులకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నారు. భక్తులు అలిపిరి మార్గంలో గాలిగోపురం 2,083వ మెట్టు వద్ద తప్పనిసరిగా స్కాన్ చేయించుకోవాల్సి ఉంది. అలాగే శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు దివ్యదర్శనం టోకెన్లు 1,240వ మెట్టు వద్ద ఇస్తారు. తిరుమలకు వాహనాల్లో చేరుకోవాలనుకునే భక్తులకు తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా శ్రీనివాసం, రైల్వే స్టేషన్ ఎదురుగా విష్ణు నివాసం, రైల్వే స్టేషన్ వెనుక వైపు గోవిందరాజ స్వామి సత్రాల్లో సర్వదర్శనం టైమ్ స్లాట్(ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేస్తారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 81,305 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.71 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు జరుగనుంది. తొలి రోజు శ్రీవారి ఆలయంలో మొదటి గంట, అనంతరం శ్రీరామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు ప్రాణం నిలిపారు

- నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఘనత
- రూ.లక్షలు ఖర్చయ్యే వైద్యం ఉచితంగా అందించారు



కోలుకుని డిశ్చార్జి అయిన బేబి

నెల్లూరు(అర్బన్): నెలలు నిండకుండానే తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు ప్రభుత్వ వైద్యులు నాణ్యమైన వైద్యం అందించి ప్రాణం కాపాడిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జరిగింది. వివరాల్లోకి వెళితే... నెల్లూరు నగరం సంతపేటలోని కామాక్షినగర్‌కు చెందిన పి.కుమార్, శాంతి నిరుపేద దంపతులు. శాంతి పుట్టిల్లు గూడూరు. ఆమెకు తొమ్మిది నెలలు నిండకుండానే పురిటి నొప్పులు రావడంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గత జనవరి 19వ తేదీన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ బరువు 820 గ్రాములే ఉండటంతో అక్కడి వైద్యులు బిడ్డను బతికించడం కష్టమని చెప్పారు. దీంతో అదేరోజు నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని తల్లీబిడ్డల విభాగంలోని ఎస్ఎన్‌సీయూ ఎమర్జెన్సీ వార్డులో వెంటిలేషన్ అడ్మిషన్ పొందా రు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద బిడ్డ ఆరోగ్యంపై డాక్టర్లతో చర్చించారు. ఎస్ఎన్‌సీయూ ఇన్‌చార్జి డాక్టర్ హేమంత్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో వారు అందించిన వైద్యంతో బిడ్డ 1.75 కిలోలకు పెరగడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంది. దీంతో వై ద్యులు శనివారం సాయంత్రం డిశ్చార్జి చేశారు. తమ బిడ్డను కాపాడిన డాక్టర్లకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమా ర్ మాట్లాడుతూ ప్రైవేట్ వైద్యశాల్లో రూ.లక్షలు ఖ ర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు.

సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత ప్రారంభం

సింహాచలం: సింహగిరిపై కొలువైన వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి తొలి విడత చందనం అరగదీతను దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ నెల 23న వైశాఖ శుద్ధ తదియ నాడు చందనోత్సవం నిర్వహించనున్నారు. ఆ రోజు స్వామి నిజరూపదర్శనం అనంతరం రాత్రి తొలి విడతగా సమర్పించే మూడు మణుగుల(120 కిలోలు) పచ్చి చందనాన్ని సిద్ధం చేసేందుకు ఈ అరగదీతను ఆరంభించారు. ఉదయం 6.05 గంటలకు తొలిచందనం చెక్కకు అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తొలి చందనాన్ని అరగదీశారు. తర్వాత 15 మంది నాలుగో తరగతి సిబ్బంది ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

తోటపల్లి క్వారీపై హైకోర్టు జరిమానా విధించలేదు

జరిమానా వేశారన్న చంద్రబాబు మాటలను ఖండించిన లీజుదారు



క్వారీ లీజు అనుమతులు మీడియాకు చూపిస్తున్న తోటపల్లి క్వారీ లీజుదారుడు లావు ప్రసాద్

ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి క్వారీపై హైకోర్టు ఎటువంటి జరిమానా విధించలేదని ఆ క్వారీ లీజుదారు లావు ప్రసాద్ స్పష్టం చేశారు. ఇటీవల నూజివీడులో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబు తోటపల్లి క్వారీపై హైకోర్టు రూ.3 కోట్ల జరిమానా విధించినట్లు అసత్య ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. ఆగిరిపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోటపల్లి క్వారీలో తనకు టీడీపీ ప్రభుత్వంలోనే అన్ని అనుమతులు వచ్చాయని చెప్పారు. అక్రమ క్వారీ నిర్వహించినందువల్ల హైకోర్టు తనకు రూ.3 కోట్ల జరిమానా విధించినట్టు చంద్రబాబునాయుడు నూజివీడు బహిరంగసభలో చెప్పటం బాధాకరమన్నారు. తనకు హైకోర్టు రూ.3 కోట్లు కాదు కదా మూడు రూపాయలు కూడా జరిమానా విధించలేదని చెప్పారు. క్వారీపై తప్పుడు కేసు వేసిన వ్యక్తికి.. మరోసారి ఇలాంటి తప్పుడు కేసులు వేయొద్దని కోర్టు రూ.50 వేల జరిమానా విధించిందని తెలిపారు. తాను మొదటి నుంచి టీడీపీకి చెందిన వ్యక్తినని, తనపై ప్రతిసారి టీడీపీకి చెందిన వారే అక్రమ క్వారీ చేస్తున్నానని పత్రికలకెక్కటం అవమానకరంగా ఉందని చెప్పారు. తాను ఎన్నో ఏళ్ల నుంచి టీడీపీ సానుభూతిపరుడిగా ఉన్నందుకు ఆ పార్టీ ఇచ్చిన బహుమతి ఇదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో తోటపల్లి క్వారీ నుంచి ప్రభుత్వానికి రూ.3 కోట్లు ఆదాయం ఇచ్చానే తప్ప తనకు కోర్టు ఎటువంటి జరిమానా వేయలేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్‌కు వస్తే ఆధారాలు చూపిస్తానని ఆయన చెప్పారు.

ఇళ్ల లబ్ధిదారులకు అదనపు సాయం

- రూ.3,287 కోట్ల మేర రుణాలు మంజూరు
- పావలా వడ్డీకి రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణం
- ఇప్పటివరకు 9.33 లక్షల మందికి సాయం

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా లబ్ధిదారులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు వారికి మరింత మేలు చేస్తోంది. ఉచితంగా ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు, ఉచితంగా ఇసుక, ఇతర నిర్మాణ సామాగ్రిని ఇస్తున్న సర్కారు.. అక్కడితో ఆగకుండా ఇప్పుడు వారికి అదనపు సాయం చేస్తోంది. ఒక్కో లబ్ధిదారులికి పావలా వడ్డీకి రూ.35 వేల రుణాన్ని బ్యాంకుల ద్వారా సమకూరుస్తోంది. ఇలా ఇప్పటివరకూ 9.33 లక్షల మందికి రూ.3,287.50 కోట్ల రుణాలను బ్యాంకులు లబ్ధిదారులకు మంజూరు చేశాయి.

అత్యధికంగా సత్యసాయి జిల్లాలో..

గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరులో శ్రీసత్యసాయి జిల్లా టాప్‌లో ఉంది. ఈ జిల్లాలో 59,292 మంది లబ్ధిదారులుండగా వీరిలో 84 శాతం అంటే 49,845 మందికి ఇప్పటికే రుణాలు మంజూరయ్యాయి. ఆ తర్వాత.. పార్వతీపురం మన్యం జిల్లాలో 27,125 మంది లబ్ధిదారులు ఉండగా 69 శాతం అంటే 18,636 మంది రుణాలు అందుకున్నారు. ఈ పథకం కింద రెండుదశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. వీటిలో 2.62 లక్షలు టిడ్కో ఇళ్లు పోగా, మిగిలినవి సాధారణ ఇళ్లు. సాధారణ ఇళ్ల లబ్ధిదారుల్లో 17.24 లక్షల మందికి రుణాలు మంజూరు చేయాలన్న లక్ష్యం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ 54 శాతం మందికి రుణాలు మంజూరు ప్రక్రియ పూర్తయింది. బ్యాంకులు, సెర్ప్/మెప్మాలను సమన్వయపర్చుకుంటూ లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా గృహ నిర్మాణ శాఖ చర్యలు తీసుకుంటోంది.

వడ్డీల భారం తప్పింది



గుంకలామ్ వైఎస్సార్, జగనన్న కాలనీలో మాకు ఉచితంగా స్థలం కేటాయించారు. అంతేకాక.. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చారు. అదనంగా ఖర్చయ్యే మొత్తానికి అప్పులుచేయకుండా ప్రభుత్వం బ్యాంకు రుణం ఇచ్చింది. పావలా వడ్డీకి రుణం ఇవ్వడంతో బయట అప్పులకు అధిక వడ్డీల భారం తప్పింది. మా ఇంటి నిర్మాణం పూర్తయింది. 11 నెలలుగా జగనన్న కాలనీలో ఉంటున్నాం.

– ఆర్. పద్మావతి, లబ్ధిదారురాలు, విజయనగరం జిల్లా

సకాలంలో రుణాలు మంజూరు..



ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రుణసాయం అందిస్తోంది. ఈ రుణాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు ఈ రుణాల ఫాలో అప్ బాధ్యతలను అప్పగించాం. వారు బ్యాంకులు, సెర్ప్, మెప్మాలను సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులందరికీ రుణాలు మంజూరయ్యేలా చూస్తున్నారు.

– లక్ష్మీశా, ఎండీ, గృహ నిర్మాణ సంస్థ

విత్తనాలు రెడీ

ఖరీఫ్ కోసం 6.18 లక్షల క్వింటాళ్లు సిద్ధం

మే 1 నుంచి వేరుశనగ, జూన్ 1 నుంచి వరి, ఇతర విత్తనాలు




సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం విత్తనాలను సిద్ధం చేసింది. రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ద్వారా రైతులకు అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. రబీ కోతలు జోరందుకోవడంతో ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీకి సిద్ధం చేయగా.. మే 1 నుంచి వేరుశనగ, జూన్ 1 నుంచి వరి, ఇతర విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 9.15 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసిన అధికారులు ఖరీఫ్ సీజన్ కోసం 6.18 లక్షల క్వింటాళ్లను ఆర్బీకేల ద్వారా రైతులకు అందించనున్నారు. రబీ సీజన్ కోసం 2.97 లక్షల క్వింటాళ్లను సిద్ధం చేయనున్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) అమలవుతున్న జిల్లాల్లో క్వింటాల్‌కు రూ.1,000, మిషన్ పరిధిలో లేని జిల్లాల్లో క్వింటాల్‌కు రూ.500 చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నారు. పచ్చిరొట్ట విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలపై 50 శాతం, వేరుశనగ, నువ్వుల విత్తనాలపై 40 శాతం, అపరాలపై 30 శాతం, శనగ విత్తనాలపై 25 శాతం చొప్పున సబ్సిడీ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు అన్నిరకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీపై, కంటింజెన్సీ కింద 80 శాతం సబ్సిడీపై ఇవ్వనున్నారు.

ఖరీఫ్ సీజన్ కోసం సిద్ధం చేస్తున్న విత్తనాలు

పంట	ఇండెంట్ (క్వింటాళ్లలో)
వరి	2,97,340
మినుము	3,314
పెసలు	1,018
నువ్వులు	184
కందులు	9,811
ఉలవలు	1,932
రాగులు	372
కొర్రలు	110
సామలు	20
అండుకొర్రలు	211
జీలుగ	57,403
జనుము	22,523
పిల్లి పెసర	19,213
రాజ్మా	4,553

ఆర్బీకేల ద్వారా అందిస్తాం



ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. రైతుల ద్వారా సేకరించిన విత్తనాలతో పాటు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ, ప్రైవేట్ కంపెనీల నుంచి సేకరించి అగ్రి ల్యాబ్‌లలో నాణ్యత ధ్రువీకరించిన తర్వాత ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ జరుగుతోంది.

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ సీడ్స్

సాహస పర్యాటకంపై స్పెషల్ ఫోకస్

జల, సాహస క్రీడలకు పర్యాటక సంస్థ ప్రాధాన్యం

- వివిధ జిల్లాల్లో కొత్తగా 50 చోట్ల బోటింగ్, అడ్వెంచర్ కార్యకలాపాలు
- రూ.25 కోట్లకు పైగా పెట్టుబడులతో ముందుకొచ్చిన సంస్థలు
- చిన్నారుల కోసం ఫన్ జోన్లు, స్కై వాక్, స్కై సైక్లింగ్, జిప్‌లైనర్, బెలూన్ క్రీడలు
- విశాఖ, నెల్లూరుల్లో ప్రత్యేకంగా ట్రెక్కింగ్ కేంద్రాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జల, సాహస క్రీడల పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) వివిధ జిల్లాల్లో బోటింగ్‌కు అనువైన జల వనరులను, అడ్వెంచర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్‌కు వీలుండే ప్రాంతాలను గుర్తించింది. ఇందులో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) బిడ్లను ఆహ్వానించగా.. 50 ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. త్వరలోనే ఏపీటీడీసీ ఆయా సంస్థలతో ఏపీటీడీసీ పూర్తిస్థాయి అగ్రిమెంట్లు పూర్తి చేసుకోనుంది. అనంతరం సుమారు రూ.25 కోట్లకు పైగా పెట్టుబడులతో జల, సాహస క్రీడల కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ ఇలా..

విశాఖపట్నం డివిజన్‌లో జోడుగుళ్లపాలెం, భీమిలి, సాగర్ నగర్, హిరమండలం డ్యామ్, శృంగవరపుకోట, తాండవ రిజర్వాయర్, పూడిమడక, కొండకర్ల ఆవ, మంగమారి పేట, యండాడ, శారదా రివర్, గోస్తనీ నది, కాకినాడ డివిజన్‌లో భూపతిపాలెం రిజర్వాయర్, హోప్ ఐలాండ్, పాలవెల్లి, అంతర్వేది, కర్నూలు డివిజన్‌లో సంగమేశ్వర, సుంకేసుల, గార్గేయపురం, చిన్న చెరువు, నెల్లూరు డివిజన్‌లో గుండ్లకమ్మ, ఏపూరపాలెం–చీరాల, కొత్తపట్నం బీచ్, పాపాయపాలెం, కొత్తకోడూరు, మైపాడు, నెల్లూరు ట్యాంక్, కడప డివిజన్‌లో పీర్ గైబుషా కోట, కర్నూలు డివిజన్‌లో ఒంటిమిట్ట, విజయవాడ డివిజన్‌లో హంసలదీవి, సూర్యలంక, అనుపు–నాగార్జున సాగర్, మోటుపల్లి బీచ్, రివెరా బీచ్ రిసార్ట్ ఫ్రంట్, రామాపురం–వేటపాలెం, తిరుపతి డివిజన్‌లో రాయలచెరువు, కడప డివిజన్‌లో బుక్కరాయచెరువు (బుక్కరాయపట్నం), చిత్రావతి రివర్ (పుట్టపర్తి) ప్రాంతాల్లో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

అడ్వెంచర్, ఫన్ జోన్లు ఇలా..

విజయవాడ డివిజన్‌లోని బెరంపార్కు, ఎత్తిపోతల జలపాతం(పల్నాడు)లో ఫన్‌జోన్, గాలి బెలూన్ల గేమ్స్, కర్నూలు డివిజన్‌లోని శ్రీశైలం, విశాఖ డివిజన్ బొర్రా గుహల వద్ద వర్చువల్ క్రికెట్, 12డీ షోలు, బొర్రా గుహల ప్రాంతంలో స్కై సైకిల్, స్కై వాక్, బార్మా వంతెన, గాలికొండలో జిప్‌లైన్, కాకినాడ డివిజన్ దిండి, ద్వారకా తిరుమల, తిరుపతి డివిజన్ పులిగుండు, హార్సిలీ హిల్స్‌లో అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. విశాఖలోని జింధగడ ట్రెక్కింగ్, నెల్లూరులోని నరసింహ కొండలో ప్రత్యేకంగా ట్రెక్కింగ్ సెంటర్లను ప్రవేశపెడుతున్నారు.


ఫస్ట్ రన్నరప్‌తో నందినీ (ఎడమ)

ఫెమినా మిస్ ఇండియా వరల్డ్‌గా నందినీ గుప్తా

ఫెమినా మిస్ ఇండియా వరల్డ్- 2023గా రాజస్తాన్‌కు చెందిన నందినీ గుప్తా(19) ఎంపికయ్యారు. మిస్ వరల్డ్ పోటీల్లో నందినీ గుప్తా భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాజస్తాన్‌లో జరిగిన 59వ ఆడిషన్ ఫైనల్స్‌లో ఢిల్లీకి చెందిన శ్రేయా పూంజా ఫస్ట్ రన్నరప్‌గా, మణిపూర్‌కు చెందిన స్ట్రెలా లువాంగ్ రెండో రన్నరప్‌గా నిలిచారు.

వయస్సు ఏడాది.. మంచులో 150 మైళ్ల ప్రయాణం



అలాస్కా: ఏడాది వయస్సు ఆస్ట్రేలియన్ షెపర్డ్ కుక్క పిల్ల పేరు ననుక్. దీని సాహసం చూస్తే ఆశ్చర్యం కలగకమానదు. యజమాని కుటుంబం తోపాటు టూర్‌కెళ్లి తప్పిపోయింది. గడ్డకట్టిన బేరింగ్ సముద్రం మీదుగా 150 మైళ్లు ప్రయాణించింది. మధ్యలో సీల్స్, మంచు ఎలుగుబంట్ల దాడిలో గాయపడింది. చివరికి నెల తర్వాత అలాస్కాలోని గాంబెల్‌లో యజమాని మాండీ ఇవోగ్రిగస్ ఇంటికి చేరుకుంది. మాండీ కుటుంబం గత నెలలో బేరింగ్ జలసంధిలోని సెంట్ లారెన్స్ దీవిలో సవూంగా ప్రాంతానికి వెళ్లింది. అక్కడే మాండీ కుటుంబానికి చెందిన ననుక్, స్టార్‌లైట్ అనే కుక్కలు తప్పిపోయాయి. కొద్ది రోజులకు స్టార్‌లైట్ ఇంటికి చేరుకుంది. కానీ, ననుక్‌కు దారి దొరకలేదు. సోషల్ మీడియాలో ననుక్ గురించి మాండీ కుటుంబం పోస్టులు పెట్టింది. చివరికి అక్కడికి 150 మైళ్ల దూరంలోని వేల్స్‌లో ఉన్నట్లు తెలిసింది. విమానయాన సంస్థల సహకారంతో ననుక్‌ను సొంతూరికి రప్పించారు. శరీరంపై కొద్దిపాటి గాయాలే తప్ప మొత్తమ్మీద ఆరోగ్యంగా ఉన్న ననుక్‌ను చూసి మాండీ కుటుంబంలోని చిన్నారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అయితే, ననుక్ అంతదూరం ప్రయాణించడం మాత్రం మిస్టరీయేనని కుటుంబీకులు చెబుతున్నారు.

జుట్టుపైనా వివక్ష..!

అమెరికాలో పాతుకుపోయిన భావజాలం నిషేధిస్తూ బిల్లును ఆమోదించిన టెక్సాస్

'అది జుట్టా, కలుపు మొక్కా?' అని ఒకరు,
'గొర్రె బొచ్చుకు, వారి జుట్టుకు ఏమన్నా తేడా ఉందా?' అని మరొకరు,
'నల్ల జుట్టుంటే ఉద్యోగానికేం పనికొస్తారు?'
జుట్టుపై అమెరికన్ల వివక్షాపూరిత వ్యాఖ్యలివి!

జాతి వివక్ష, మత వివక్ష, కుల వివక్ష గురించి విన్నాం. కానీ అగ్రరాజ్యంగా చెప్పుకునే అమెరికాలో మాత్రం తలపై జుట్టు దగ్గర్నుంచి కాలి గోళ్ల దాకా అక్కడ అన్నింటా వివక్ష రాజ్యమేలుతోంది. నల్ల జుట్టుపై వివక్షను నిషేధిస్తూ టెక్సాస్ హౌస్ తాజాగా బిల్లును ఆమోదించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయంగా మారింది...



జుట్టు నల్లగా, పొడవుగా, రింగులు తిరిగి ఉంటే అమెరికన్లు సహించలేరు. కొప్పు బాగా కుదిరితే చక్కగా ఉంటుందంటాం. కానీ నల్లజాతి అమ్మాయిలు రకరకాల హెయిర్ స్టైల్స్‌తో కొప్పును గొప్పగా ప్రదర్శించడం కూడా అమెరికన్లకు కంటగింపు వ్యవహారమే. స్కూళ్లు, పని ప్రాంతాలు, నలుగురు కలిసే చోట... ఇలా అంతటా ఈ వివక్ష తీవ్ర రూపు దాల్చి కన్పిస్తుందక్కడ. ఆఫ్రో, బ్రయిడ్స్, డ్రెడ్‌లాక్స్, కార్న్‌రోస్ హెయిర్ స్టైల్స్ చేసుకునే వారిపై వివక్ష పెరిగిపోతుండటంతో టెక్సాస్‌లో ప్రతినిధుల సభ కల్పించుకోవాల్సి వచ్చింది. నల్లజుట్టుపై వివక్ష పనికిరాదంటూ క్రౌన్ యాక్ట్ బిల్లును ఆమోదించింది. జుట్టుపై వివక్ష తగదంటూ డెమొక్రాట్ సభ్యురాలు రెట్టా బోవర్స్ తొలుత గళమెత్తారు. ఎవరి జుట్టు ఎలా ఉంటే అలానే ఉండనివ్వాలి. మార్చుకొమ్మని శాసించే హక్కు ఎవరికీ ఉండదు''అన్నారామె. బోవర్స్ తొలిసారి ఈ బిల్లును ప్రతిపాదించినప్పుడు ఇదంత అవసరమా అని అంతా కొట్టిపారేసారు. కానీ ఇప్పుడది 143–5 ఓట్లతో నెగ్గడంతో ఆమె ఆనందం అవధులు దాటింది.

ఈ వివక్ష ఇప్పటిది కాదు!

అమెరికాలో నల్ల జుట్టుపై వివక్ష 18వ శతాబ్దం నుంచీ ఉంది. ఆఫ్రికన్ల జుట్టు గొర్రె బొచ్చులా ఉంటుందని అప్పట్లోనే హేళన చేసేవారు. తర్వాత రకరకాల హెయిర్ స్టైల్స్ చేసుకునే నల్లజాతి మహిళలు ఉద్యోగాలకు పనికి రారన్న అభిప్రాయం అమెరికన్లలో పెరిగింది. జుట్టు ఎక్కువున్న వారికి వృత్తిపరమైన లక్షణాలేవీ ఉండవని, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే సామర్థ్యముండదని అడ్డమైన వాదనలు తెరపైకి తెచ్చారు. తెల్ల జుట్టు వాళ్లకే ఉద్యోగాల్లో ప్రాధాన్యమిచ్చేవారు.

బిల్లు ఎలా వచ్చిందంటే..

హ్యూస్టన్‌లో బార్బర్స్ హిల్ హైస్కూలులో అధికారులు డెండ్రే ఆర్నాల్డ్ అనే విద్యార్థిపై చూపిన వివక్ష ఈ బిల్లుకు కారణమైంది. ఆర్నాల్డ్ ఏడో తరగతి నుంచి జుట్టు పెంచుకుంటున్నాడు. అది ట్రినిడాడియన్ల సంస్కృతిలో భాగం. కానీ జుట్టు కత్తిరించుకోకుంటే గ్రాడ్యుయేషన్ క్లాసులకు అనుమతించేది లేదని స్కూలు అధికారులు తేల్చి చెప్పారు. అబ్బాయి తల్లిదండ్రులు కాళ్లావేళ్లా పడ్డా లాభం లేకపోయింది. ఇదంతా 2020లో జరిగింది. ఆర్నాల్డ్ కథ ఇంటర్నెట్‌లో వైరలైంది. అతనికి ప్రఖ్యాత టీవీ షో ది ఎలెన్ డిజెనరస్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. హెయిర్ లవ్ అనే షార్ట్ ఫిల్మ్ తీసిన దర్శకుడు మాథ్యూ ఎ చెర్రీ ఆ అబ్బాయిని ఆస్కార్ అవార్డు ఫంక్షన్‌కు కూడా ఆహ్వానించాడు. మరెందరో విద్యార్థులను జుట్టు పొడవుగా ఉందంటూ స్కూలు నుంచి తీసేసిన ఉదంతాలు వెలుగులోకి రావడంతో ఈ వివక్షను నిషేధిస్తూ చట్టం చేయాల్సి వచ్చింది.

ఒబామా భార్యకూ తప్పలేదు!

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మహిళ మిషెల్‌కు కూడా జుట్టు వివక్ష తిప్పలు తప్పలేదు. ఒబామా అధ్యక్షుడిగా ఉండగా ఆమె తన రింగుల జుట్టును సాఫీగా ఉండేలా చేయించుకున్నారట. ఈ విషయం గతేడాది ఓ కార్యక్రమంలో ఆమే స్వయంగా చెప్పారు. ''వైట్‌హౌస్‌లో ఉండగా ఒబామా పాలనపై కాకుండా నా జుట్టుపై ఎక్కడ చర్చ జరుగుతుందోనని హెయిర్‌స్టైల్ మార్చుకున్నా. ఒక నల్లజాతి కుటుంబం శ్వేతసౌధంలో ఉండటాన్ని సగటు అమెరికన్లు అంతగా జీర్ణించుకోలేరు. దానికి తోడు నా జుట్టుపైనా వివాదం రేగడం ఎందుకని భావించా''అన్నారు. అమెరికా సమాజంలో జుట్టు వివక్ష ఎంతలా వేళ్లూనుకుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు!

ఇంటర్వ్యూ ఉంటే హెయిర్‌స్టైల్ మారాల్సిందే!

డోవ్, లింక్డిన్ సంస్థలు ఇటీవల జుట్టు వివక్షపై సంయుక్త అధ్యయనం చేశాయి. నల్లజాతి యువతుల్లో మూడింట రెండొంతుల మంది ఇంటర్వ్యూలకి వెళ్లినప్పుడు హెయిర్ స్టైల్స్ మార్చుకుంటున్నట్టు తేలింది. నల్లటి కురులున్న 25–34 మధ్య వయసు వారిలో 20 శాతం మందిని ఉద్యోగాల నుంచి తీసేశారు. టీవీ షోలు, సోషల్ మీడియాలోనూ నల్ల జుట్టుపై విషం కక్కడం పరిపాటిగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పెద్ద క్రిమినల్స్ అవుదామని..

అతీక్, అష్రాఫ్ అహ్మద్‌ను హత్య చేయడానికి కారణం అదే


అరుణ్ మౌర్య సన్నీ తివారీ

ప్రయాగ్‌రాజ్/లక్నో/న్యూఢిల్లీ: నేర ప్రపంచంలో తమ పేరు మార్మోగిపోవాలి, ఒక్కసారిగా పెద్ద గుర్తింపు రావాలన్న ఆకాంక్షే హత్యలకు పురిగొల్పిందా? అవుననే చెబుతున్నారు ఉత్తరప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్లు అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్‌ను హత్య చేసిన నిందితులు. శనివారం రాత్రి మీడియా, పోలీసుల సమక్షంలోనే ఇద్దరిని కాల్చిచంపిన సంగతి తెలిసిందే. బాందాకు చెందిన లవ్లేశ్ తివారీ(22), హమీర్‌పూర్‌కు చెందిన మోహిత్ అలియాస్ సన్నీ(23), కాస్‌గంజ్‌కు చెందిన అరుణ్ మౌర్య(18)ను పోలీసులు అరెస్టు చేశారు. వారిని ప్రశ్నించి వివరాలు రాబట్టారు. జంట హత్యలకు గల కారణాలపై ఆరా తీశారు. నేర ప్రపంచంలో గుర్తింపు, పేరుప్రఖ్యాతుల కోసమే హత్యలు చేశామని నిందితుల్లో ఒకరు అంగీకరించినట్లు తెలిసింది. లవ్లేశ్ తివారీ మాదక ద్రవ్యాలకు బానిస అయ్యాడని బాందాలో అతడి పొరుగింటి వ్యక్తి చెప్పారు. లవ్లేశ్ గతంలో నేరాలకు పాల్పడి, పలు మార్లు జైలుకు వెళ్లొచ్చాడని వెల్లడించారు. సన్నీ నేరాల్లోకి ఎలా అడుగు పెట్టాడో తనకు తెలియదని అతడి సోదరుడు పింటూ చెప్పాడు.

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి నిందితులు

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ప్రయాగ్‌రాజ్ కోర్టు ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. అతీక్ అహ్మద్, అష్రాఫ్ అహ్మద్ హత్య ఘటనపై దర్యాప్తు కోసం ప్రభుత్వం కమిషన్ ముగ్గురు సభ్యులతో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసింది.

చట్ట ప్రకారమే శిక్షించాలి: కాంగ్రెస్

నేరగాళ్లకు కఠిన శిక్షలు విధించాలని, కానీ, అది చట్టప్రకారమే జరగాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. దేశంలో అమల్లో ఉన్న చట్టాలకు లోబడే శిక్షలు ఉండాలని పేర్కొంది. రాజకీయ లబ్ధి కోసం చట్టాన్ని అతిక్రమించడం ప్రజాస్వామ్యానికి ముప్పేనని తేల్చిచెప్పింది. అతీక్ అహ్మద్, అష్రాఫ్ హత్యల నేపథ్యంలో కాంగ్రెస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నేరస్థులకు శిక్షలు విధించడానికి న్యాయస్థానాలు ఉన్నాయని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుర్తుచేశారు.

మన్మోహన్ ప్రభుత్వాన్ని కాపాడినవారిలో అతీక్

అమెరికాతో అణు ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ 2008లో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించాయి. లోక్‌సభలో యూపీఏ సర్కారు సంఖ్యాబలం 228కి పడిపోయింది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో గట్టెక్కాలంటే మరో 44 మంది ఎంపీల మద్దతు అవసరం. ప్రభుత్వాన్ని కాపాడడానికి సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్, జేడీ(యూ) తదితర పార్టీలు ముందుకొచ్చాయి. గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ. కానీ, జైలులో ఉన్నాడు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి మొత్తం ఆరుగురు ఎంపీలను జైళ్ల నుంచి తాత్కాలికంగా బయటకు తీసుకొచ్చారు. వారిలో అతీక్ అహ్మద్ కూడా ఉన్నాడు.


66 అడుగుల లోతు ఉన్న ఈ మంచు కారిడార్ జపాన్‌లో ఉంది. ఇంతలోతుకు మంచు తొలచి అక్కడి టటెయామా కురోబే ఆల్పైన్ మార్గం సిద్ధంచేశారు. శనివారం నుంచి ఈ మార్గంలో పర్యాటకులను అనుమతిస్తున్నారు. ప్రకృతిరమణీయమైన ఈ ప్రాంతాన్ని జపాన్ పైకప్పుగా పిలుస్తారు.

కర్ణాటకలో బీజేపీకి మరో షాక్

మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ రాజీనామా



బనశంకరి: కర్ణాటకలో మరో 25 రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా అధికార బీజేపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. కన్నడనాట బీజేపీని బలోపేతం చేసిన మొదటితరం నేతల్లో ఒకరైన మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన బలమైన లింగాయత్ సామాజిక వర్గం నేత. హుబ్లీ–ధార్వాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా ఎన్నికవుతూ ఉన్నారు. షెట్టర్ 2012 మే– 2013 జూన్ కాలంలో సీఎంగా వ్యవహరించారు. బీజేపీ నేత లక్ష్మణ సవది ఇటీవలే కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. ఆదివారం ఉత్తర కన్నడ జిల్లా శిరసిలో అసెంబ్లీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరిని కలిసి షెట్టర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పించారు. తరువాత బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం ద్వారా 4 దశాబ్దాల బంధాన్ని తెంచుకున్నారు. టికెట్ కోసం షెట్టర్ మూడురోజులుగా ఢిల్లీలో మకాం వేసి పార్టీ పెద్దలతో ప్రయత్నాలు చేసినా నిరాశే మిగిలింది. ఈయన కాంగ్రెస్‌లో చేరొచ్చని వినికిడి.

లిక్కర్ స్కామ్‌లో మీ పాత్ర ఏంటి?

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రశ్నించిన సీబీఐ
- దాదాపు 9 గంటలపాటు ప్రశ్నల వర్షం


సీబీఐ విచారణకు వెళ్లడానికి ముందు మీడియాతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు ఆదివారం ప్రశ్నించారు. మౌఖికంగా, లిఖితపూర్వకంగా ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. కేజ్రీవాల్ తొలుత రాజ్‌ఘాట్‌లో గాంధీజీ స్మారకాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. సీబీఐ అధికారులు ఉదయం నుంచి రాత్రి 8.30 గంటల దాకా.. దాదాపు 9 గంటలపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించారు. సీబీఐ కార్యాలయం వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విచారణ అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. అధికారులు 56 ప్రశ్నలు అడిగారని, అన్నింటికీ సమాధానాలు చెప్పానని వివరించారు. తాము ఏ తప్పూ చేయలేదన్నారు. ప్రాణాలు వదులుకుంటాం తప్ప నిజాయతీని కాదని తేల్చిచెప్పారు. సీబీఐ కార్యాలయానికి చేరుకోవడానికంటే ముందు కేజ్రీవాల్ 5 నిమిషాల నిడివిగల వీడియో ట్వీట్‌చేశారు. 'నన్ను అరెస్టుచేయాలని సీబీఐని బీజేపీ ఆదేశించబోతోంది. సీబీఐ అడిగే ప్రతి దానికీ సమాధానం చెప్తా. దాచడానికి ఏమీ లేదు. బీజేపీ నేతలు చాలా శక్తివంతమైన వ్యక్తులు. వారు ఎవరినైనా అరెస్టు చేయించగలరు. నేరం చేయకున్నా జైలుకు పంపించగలరు' అని పేర్కొన్నారు.

ఆప్ నేతల అరెస్టు

మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌ను సీబీఐ ప్రశ్నించడాన్ని వ్యతిరేకిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు దాదాపు 1,500 మందిని అరెస్టు చేశారు. 32 మంది ఢిల్లీ ఎమ్మెల్యేలు, 70 మంది కౌన్సిలర్లు, 20 మంది పంజాబ్ ఎమ్మెల్యేలను అరెస్టుచేశారని పార్టీ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ తెలియజేశారు.

లై–డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా?: బీజేపీ

సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు సాక్ష్యాలు, వాస్తవాల ఆధారంగానే పని చేస్తాయని, భావోద్వేగాలతో కాదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా పేర్కొన్నారు. అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా నాటకాలు ఆపాలని హితవు పలికారు. లై–డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా? అని కేజ్రీవాల్‌కు సవాలు విసిరారు.

ఈకల్లో విషం.. తాకితే మరణం

కిలకిలరావాలతో అలరించే పక్షులంటే ఇష్టపడనివారు ఎవరుంటారు? బుల్లి పిట్టలను ఇంట్లో పెంచుకోవడం చాలామందికి ఒక చక్కటి అభిరుచి. పిట్టలకు ఆహారం, నీరు అందిస్తూ వాటి ఎదుగుదలను చూసి ఆనందిస్తుంటారు. పక్షులంటే మనుషులకు ప్రియనేస్తాలే. కానీ, ముట్టుకుంటే చాలు క్షణాల్లో ప్రాణాలు తీసే భయంకరమైన రెండు రకాల పక్షులను న్యూగినియా అడవుల్లో డెన్మార్క్ పరిశోధకులు గుర్తించారు. అవి వాటి ఈకల్లో విషం దాచుకుంటున్నట్లు కనిపెట్టారు. వాటిని ఇంట్లో పెంచుకోలేం, ఆహారం ఇవ్వలేం. విషపూరిత పక్షుల సమీపంలోకి వెళ్లడం కూడా ప్రమాదమేనని హెచ్చరిస్తున్నారు.

- న్యూగినియా అడవుల్లో రెండు రకాల విషపూరిత పక్షులు
- గుర్తించిన డెన్మార్క్ సైంటిస్టులు

- అడవుల్లో విషపూరిత ఫలాలు, పదార్థాలను ఆరగించి, వాటిని న్యూరోటాక్సిన్లుగా మార్చి, తన రెక్కల్లో నిల్వ చేసుకొనే సామర్థ్యం ఈ పక్షుల్లో అభివృద్ధి చెందింది.
- విష ప్రభావాన్ని తట్టుకొని జీవించే శక్తి సమకూరింది.
- కాలానుగుణంగా వాటి శరీరంలో సంభవించిన జన్యుపరమైన మార్పులే ఇందుకు కారణమని డెన్మార్క్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం ప్రతినిధి జాన్సన్ చెప్పారు.
- ఇటీవల న్యూగినియా అడవుల్లో పర్యటన సందర్భంగా ఈ పక్షులను గుర్తించామని ఒక ప్రకటనలో వెల్లడించారు.
- తాజాగా గుర్తించిన రెండు రకాల విషపూరిత పక్షులు రిజెంట్ విజ్లర్(పచీసెఫాలా స్క్లీగెల్లీ), రఫోస్–నేప్డ్ బెల్‌బర్డ్(అలిడ్రియాస్ రుఫినుచా) అనే పక్షి జాతులకు చెందినవి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఈ జాతులు అధికంగా కనిపిస్తుంటాయి.
- సౌత్, సెంట్రల్ అమెరికాలో ఉండే డార్ట్ కప్పలు (గోల్డెన్ పాయిజన్ ఫ్రాగ్స్) అత్యంత విషపూరితమైనవి చెబుతుంటారు. ఈ కప్పలను తాకితే కొద్దిసేపట్లోనే మరణం సంభవిస్తుంది.
- డార్ట్ కప్పల్లోని విషం లాంటిదే ఈ పక్షుల్లోనూ ఉన్నట్లు పరిశోధకులు కనిపెట్టారు.
- పక్షుల్లో బాత్రాసోటాక్సిన్ అనే విషం అధిక మోతాదులో ఉందని సైంటిస్టులు పేర్కొన్నారు.



- ఇలాంటి విషమే గోల్డెన్ పాయిజన్ కప్పల చర్మంలో ఉంటుంది.
- విషం నిల్వ ఉన్న ఈ పక్షుల ఈకలను తాకితే కండరాల్లో పక్షవాతం లాంటిది ఏర్పడుతుంది. గుండె కొట్టుకోవడం ఆగిపోతోంది. చివరకు మృత్యువు కాటేస్తుంది. ఇదంతా క్షణాల వ్యవధిలోనే జరిగిపోతోంది.
- పక్షుల శరీరంలో సోడియం చానళ్లను క్రమబద్ధం చేసే ప్రాంతాల్లో మ్యుటేషన్స్(మార్పులు) వల్ల వాటిలో విషాన్ని తయారు చేసుకొని నిల్వచేసుకోవడంతోపాటు తట్టుకొనే శక్తి స్వతంత్రంగానే అభివృద్ధి చెందిందని సైంటిస్టులు పేర్కొన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతికి ప్రతీక అదానీ: రాహుల్

కోలారు: అదానీపై చూపిస్తున్న ప్రేమను ప్రధాని మోదీ పేద ప్రజలపై ఇసుమంతైనా చూపించడం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆదివారం కర్ణాటకలోని కోలారు పట్టణంలో నిర్వహించిన జై భారత్ సభలో ప్రధాని మోదీపై ఆయన విమర్శల వర్షం కురిపించారు. గతంలో కోలారులోనే మోదీపై ఆరోపణలు చేసిన కేసులో రాహుల్‌కు జైలుశిక్ష పడి లోక్‌సభ సభ్యత్వం రద్దయిన విషయం తెలిసిందే. ఆదివారం ఇక్కడ జరిగిన మొదటి ఎన్నికల సభలో ఆయన ప్రసంగిస్తూ బీజేపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. తన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసి, జైలుపాలు చేసినా ప్రభుత్వాన్ని చూసి భయపడేది లేదని స్పష్టం చేశారు. అదానీ అవినీతికి మారుపేరని పేర్కొన్నారు. 'అదానీ విమానంలో ప్రధాని మోదీ అత్యంత రిలాక్స్ మూడ్‌లో ఎందుకు కూర్చుంటారు? అదానీ కంపెనీలో చైనా డైరెక్టర్ ఎందుకు ఉన్నారు?'అని రాహుల్ ప్రశ్నించారు. మోదీ, అదానీ సంబంధాలపై ప్రశ్నించినప్పుడల్లా బీసీ వర్గాన్ని అవమానించానంటూ తనవైపు వేలెత్తి చూపుతున్నారని విమర్శించారు.


కనికట్టు కాదిది.. తలకట్టు!

అమెరికాకు చెందిన నల్లజాతి మహిళ ఎవిన్ డుగాస్(47) తన 5 అడుగుల 5 అంగుళాల భారీ తలకట్టుతో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. అతి పెద్ద తలకట్టును కలిగిన ఆఫ్రికా సంతతి మహిళగా గత 13 ఏళ్లలో ఆమె మూడు పర్యాయాలు తన రికార్డులను తానే బద్దలు కొట్టింది. లూసియానాకు చెందిన డుగాస్ 1999 నుంచి కురులను పెంచుతోంది.



వజ్రంలో వజ్రం

సూరత్ కంపెనీకి అరుదైన వజ్రం లభ్యం



సూరత్: వజ్రాన్ని చూస్తేనే కళ్లు చెదురుతాయి. ధగధగలాడుతూ చూపరుల్ని కట్టి పడేస్తుంది. అలాంటిది వజ్రంలో వజ్రం ఉంటే ఇంక వేరే చెప్పాలా. కళ్లు కూడా తిప్పుకోలేం. అలాంటి అరుదైన వజ్రం గుజరాత్‌లో సూరత్‌లో వి.డి. గ్లోబల్ అనే వజ్రాల కంపెనీకి లభించింది. ఆ వజ్రం లోపల ఉన్న వజ్రం కూడా లోపల అటూఇటూ ఎంచక్కా కదులుతోందని ఆ కంపెనీ వెల్లడించింది. 0.329 క్యారట్ల ఈ వజ్రానికి బీటింగ్ హార్ట్ అని పేరు పెట్టారు. వజ్రాల గనుల తవ్వకాల్లో గత ఏడాది అక్టోబర్‌లో ఈ వజ్రం లభించింది. అరుదైన వజ్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ది జెమ్ అండ్ జ్యూయెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రొమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) దానిపై మరింత అధ్యయనం చేసింది. ఆప్టికల్, ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్స్ ద్వారా విశ్లేషించి 2019లో సైబీరియాలో లభించిన వజ్రం మాదిరిదే బీటింగ్ హార్ట్ కూడానని తేల్చింది. అప్పట్లో సైబీరియాలో లభించిన ఈ వజ్రంలో వజ్రం 80 కోట్ల ఏళ్ల కిందటిదని, విలువ అమూల్యమని చెప్పుకున్నారు. ఆ వజ్రానికి మత్రోష్కా అని పేరు పెట్టారు. రష్యాలో తయారు చేసే ఒక దానిలో ఒకటి ఇమిడిపోయే చెక్క బొమ్మల్ని మత్రోష్కా అని పిలుస్తారు. ఇప్పుడు అచ్చంగా అదే మాదిరి వజ్రం మన దేశంలో కూడా లభించడం విశేషం. ఈ వజ్రం లోపలి వజ్రం కూడా అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. వజ్రాలపై అధ్యయనం చేసే 'డి బీర్స్'గ్రూప్‌కు చెందిన నిపుణురాలు సమంతా సిబ్లీ గత 30 ఏళ్లలో బీటింగ్ హార్ట్‌లాంటి అరుదైన వజ్రాన్ని చూడలేదని చెప్పారు. ఈ వజ్రం ఎలా ఏర్పడిందో అధ్యయనం చేస్తామని తెలిపారు.

గంటలో 3,206 పుష్ అప్‌లు

ఆస్ట్రేలియా వ్యక్తి గిన్నిస్ రికార్డు



సిడ్నీ: జిమ్ చేసే సిక్స్‌ప్యాక్ బాడీ అయినా రోజూ 100 పుష్‌అప్‌లు చేస్తేనే బాగా అలిసిపోతారు. అలాంటిది ఆస్ట్రేలియాకు చెందిన ఒక వ్యక్తి కేవలం గంటలో 3,206 పుష్‌అప్‌లు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌కు చెందిన 33 ఏళ్ల లుకాస్ హెల్మెక్ పుష్ అప్‌లు చేయడం ద్వారా తనకున్న స్టామినా ఏంటో ప్రపంచానికి చూపించాడు. గంటకి 3,182 పుష్ అప్‌లు చేసి రికార్డు సాధించిన సాటి ఆస్ట్రేలియన్ డేనియల్ స్కాలి పేరు మీదున్న రికార్డుల్ని బద్దలు కొట్టాడు. లుకాస్ నిమిషానికి 53 పుష్ అప్‌లు చేశాడని గిన్నిస్ వరల్డ్ అధికారులు వెల్లడించారు. ఈ రికార్డు సాధించడానికి అనుభవజ్ఞులైన జిమర్‌ల దగ్గర రెండు మూడేళ్ల పాటు శిక్షణ కూడా తీసుకున్నట్టు లుకాస్ వెల్లడించాడు.

కర్ణాటకలో రూ.170 కోట్లు సీజ్: ఈసీ

బెంగళూరు: కర్ణాటకలో ఎన్నికల నిబంధనావళి అమల్లోకి వచ్చిన మార్చి 29వ తేదీ నుంచి ఇప్పటివరకు జరిపిన దాడుల్లో రూ.170 కోట్ల సొత్తు పట్టుబడిందని ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. ఇందులో రూ.71 కోట్ల నగదు, రూ.38 కోట్ల విలువైన మద్యం, రూ.29 కోట్ల ఆభరణాలు, రూ.19 కోట్ల ఉచిత వస్తువులు, రూ.13 కోట్ల డ్రగ్స్ ఉన్నాయని వెల్లడించింది. ఇందుకు సంబంధించి 1,410 వరకు కేసులు నమోదు చేశామని కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ అధికారి చెప్పారు. మే 10వ తేదీన జరగాల్సిన ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడానికి ముందు అంటే మార్చి 9–27 తేదీల మధ్య రూ.58 కోట్లు సీజ్ చేశామని వివరించారు.

మోదీ గొప్ప దార్శనికుడు

అమెరికా వాణిజ్య మంత్రి గినా రైమొండో ప్రశంసలు

వాషింగ్టన్: ప్రధాని మోదీపై అమెరికా వాణిజ్య మంత్రి ప్రశంసలు కురిపించారు. ఆయన గొప్పదార్శనికుడని, భారత్‌ను ప్రపంచశక్తిగా తయారు చేసేందుకు పేదరికాన్ని పారదోలేందుకు, అంకితభావంతో పనిచేస్తున్న ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా కొనియాడారు. శనివారం వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రైమొండో..గత నెలలో భారత్‌లో పర్యటించిన ఆమె ప్రధాని మోదీతో సమావేశమైన విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. టెక్నాలజీ గురించి కూడా మోదీకి లోతైన పరిజ్ఞానం ఉందన్నారు. ఏఐ అంటే కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అని మనకు తెలుసు, కానీ, ఏఐ అంటే అమెరికా–ఇండియా టెక్నాలజీ అని మోదీ చెప్పారన్నారు. ఏఐ రంగంలో విప్లవానికి అమెరికా, భారత్‌లు సారథ్యం వహిస్తాయని రైమొండో తెలిపారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు.. నలుగురి మృతి

డేడ్‌విల్లే: అమెరికాలో మళ్లీ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. అలబామా రాష్ట్రంలోని చిన్న పట్టణమైన డేడ్‌విల్లేలో శనివారం రాత్రి 10.30 గంటలకు పుట్టినరోజు వేడకల్లో కాల్పులు జరిగినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారా? లేదా? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు.

వడదెబ్బకు 13 మంది బలి

ముంబై: మహారాష్ట్ర భూషణ్ పురస్కార ప్రదానోత్సవంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఖార్‌గఢ్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు లక్షలాది మంది తరలివచ్చారు. తీవ్రమైన ఎండలో గంటల తరబడి కూర్చున్నారు. వడదెబ్బకు గురై 13 మంది ప్రాణాలు కోల్పోయారు. 600 మందికిపైగా జనం అస్వస్థతకు గురయ్యారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నవీ ముంబైకి చేరుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

సూడాన్ ఘర్షణల్లో భారతీయుడు మృతి

న్యూఢిల్లీ: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య తలెత్తిన ఘర్షణల్లో 61 మందికి పైగా చనిపోయారు. మృతుల్లో ఆల్బర్ట్ ఆగస్టీన్ అనే భారతీయుడు ఉన్నారు. సూడాన్‌లో 2021 అక్టోబర్‌లో సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అప్పటి నుంచి అత్యున్నత మండలి అధికారం చెలాయిస్తోంది. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యే ప్రభుత్వానికి అధికారం అప్పగించే విషయంలో ఆర్మీ, పారామిలటరీ బలగాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఖార్టూమ్‌లోని అధ్యక్ష భవనాన్ని, విమానాశ్రయాన్ని, ఇతర కీలక ప్రాంతాలు తమ ఆధీనంలోనే ఉన్నట్లు సైన్యం, పారా మిలటరీ బలగాలు ప్రకటించుకున్నాయి. శనివారం నుంచి రాజధానితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తలెత్తిన హింసాత్మక ఘటనల్లో 61 మంది పౌరులు చనిపోయారు. ఇరుపక్షాలకు చెందిన డజన్లకొద్దీ మరణించి ఉంటారని వైద్యుల సంఘం ఒకటి అంటోంది. మరో 670 మంది గాయపడినట్లు చెబుతోంది. దాల్ గ్రూప్ కంపెనీ ఉద్యోగి, భారతీయుడు ఆల్బర్ట్ ఆగస్టీన్ తుపాకీ కాల్పుల్లో చనిపోయినట్లు అక్కడి భారత రాయబార కార్యాలయం తెలిపింది.

కేజ్రీవాల్‌కు స్టాలిన్ కృతజ్ఞతలు

సాక్షి, చెన్నై: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తమిళనాడు సీఎం స్టాలిన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి, దేశ ప్రయోజనాల దృష్ట్యా, ప్రాధాన్యత ఉన్న అంశాలను గుర్తు చేస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్‌కు కేజ్రీవాల్ లేఖ రాశారు. అలాగే తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్‌కు వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానాన్ని ప్రస్తావించారు. ఇందుకు ట్విట్టర్ ద్వారా సీఎం స్టాలిన్ కృతజ్ఞతలు తెలియజేశారు. తమిళనాడు శాసన సభ తీర్మానాన్ని ప్రస్తావిస్తూ, అభినందిస్తూ తమ ప్రయత్నంలో పాలు పంచుకున్నందుకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఏ ప్రజాస్వామ్యంలోనైనా శాసనసభ సార్వభౌమాధికారం సర్వోన్నతమైనదని పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాల శాసనాధికారాలను, బాధ్యతలను తక్కువగా అంచనా వేయకూడదన్నారు.

న్యూస్‌రీల్

రామనాథపురంలో గవర్నర్ పర్యటన రేపు



సాక్షి,చెన్నై : రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి రెండు రోజుల పర్యటన కోసం రామనాథపురం జిల్లాకు వెళ్లనున్నారు. ఈనెల 18, 19 తేదీలలో జరిగే ఈ పర్యటనలో జాలర్లు, రైతు సంఘాల నేతలతో సంప్రదింపులతోపాటు పసుం పొన్ ముత్తరామ లింగ దేవర్, ఇమాన్యుయేల్ శేఖర్ స్మారక మందిరాలను సందర్శించనున్నారు. ఈ పర్యటన నిమిత్తం 18వ తేదీ ఉదయం ఐదు గంటలకు విమానంలో ఆయన మదురై వెళ్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రామనాథపురం చేరుకుంటారు. రామేశ్వరంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తారు. అక్కడ జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. అనంతరం దేవిపట్నానికి వెళ్లి జాలర్ల కుటుంబాలు, జాలర్ల సంఘాల ప్రతినిధులను కలవనున్నారు. అలాగే ఎట్టి వయల్ గ్రామంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులను కలుస్తారు. 19న కొశమంగళం మంగళనాథ స్వామి ఆలయంను సందర్శిస్తారు. అనంతరం దేవర్ సామాజిక వర్గం ఆరాధ్యుడు పసుం పొన్‌ముత్తురామలింగ దేవర్ స్మారక ప్రదేశానికి వెళ్తారు. తర్వాత త్యాగి ఇమాన్యుయేల్ శేఖర్ స్మారక ప్రదేశాన్ని సందర్శించి చెన్నైకు గవర్నర్ తిరుగు ప్రయాణమవుతారు.

వంతెన నిర్మాణ పనుల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న సీఎస్

సాక్షి, చెన్నై: చెన్నైలో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు, ఈసీఆర్ మార్గం విస్తరణ పనులను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బు తనిఖీ చేశారు. మధ్య కైలాశ్–ఇందిరానగర్ మధ్య జరుగుతున్న వంతెన నిర్మాణాలను ముందుగా ఆయన పరిశీలించారు. మేడవాక్కం–షోళింగనల్లూరు మధ్య వర్షపు నీటి కాలువల పనులను తనిఖీ చేశారు. ఈసీఆర్ మార్గాన్ని కూడా పరిశీలించారు. పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆయా పనుల్లో నాణ్యతను ఆయన పరిశీలించి, నాణ్యతలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కార్చిచ్చు ఆర్పేందుకు హెలికాప్టర్లు

సాక్షి, చెన్నై: కోయంబత్తూరు జిల్లా పరిధిలోని పశ్చిమ కనుమల్లో కార్చిచ్చుతో అడవులు తగలబడుతున్నాయి. ఈ మంటలను అదుపు చేయడానికి హెలికాప్టర్లను రంగంలోకి దించారు. వివరాలు.. కోయంబత్తూరు జిల్లా పరిధిలోని ఆలందూరు, నాగై గౌండం పుదూర్ పరిసరాలలోని పశ్చిమ కనుమల్లో అడవులు గత మూడు రోజులుగా తగల బడుతున్నాయి. కార్చిచ్చు కారణంగా చెలరేగిన మంటలు క్రమంగా విస్తరిస్తున్నాయి. పలు రకాల చెట్లు ఈ కారు చిచ్చుకు బుడిద అవుతున్నాయి. ఈ మంటలను ఆర్పేందుకు అటవీ అధికారులు, సిబ్బంది 200 మంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలు అదుపులోకి రాకపోగా, క్రమంగా విస్తరిస్తుండడంతో ఆందోళన తప్పలేదు. ఇంత వరకు ఈ మంటల్లో అటవీ జంతువులు చిక్కుకోలేదు. ఈ మంటలు మరింతగా వ్యాపించిన పక్షంలో ఆ జంతువులకు హాని కలిగే ప్రమాదం ఉందని గ్రహించారు. దీంతో సూలూరు వైమానిక దళం అధికారులను అటవీ అధికారులు సంప్రదించారు. మంటల్ని ఆర్పేందుకు ఆదివారం హెలికాప్టర్లను రంగంలోకి దించారు. హెలికాప్టర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి కార్చిచ్చు రేగుతున్న ప్రాంతాల్లో చల్లుతున్నారు. ఈ మంటలను అదుపులోకి తెచ్చేందుకు హెలికాప్టర్లు సూలూరు నుంచి చిన్న చిన్న నీటి ట్యాంకర్లతో దూసుకెళ్తున్నాయి. అక్కడ నీటిని పెద్దఎత్తున చల్లుతున్నారు. త్వరలో మంటలు అదుపులోకి వచ్చే అవకాశం ఉంది.

కిరాతక తండ్రి ఆత్మహత్యా యత్నం



దండపాణి (ఫైల్)

సాక్షి, చెన్నై: తనయుడిని పరువు హత్యచేసి పరారైన కిరాతక తండ్రి దండపాణి ఆదివారం గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడిని చికిత్స నిమిత్తం కృష్ణగిరి ఆసుపత్రికి తరలించారు. వివరాలు.. కృష్ణగిరి జిల్లా ఊత్తంకరై సమీపంలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న కుమారుడు సుభాష్‌ను తండ్రి దండపాణి నరికి చంపేసిన విషయం తెలిసిందే. అడ్డు వచ్చిన కోడలు అనుసూయ, తన తల్లి కన్నమ్మాల్‌ను కూడా దండపాణి నరికి పడేశాడు. అతడి చేతిలో సుభాష్, కన్నమ్మాళ్ దారుణంగా హతమయ్యారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న కోడలు అనుసూయను కృష్ణగిరి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరారీలో ఉన్న దండపాణి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఆదివారం వేకువ జామున హనుమంత తీర్థ బస్టాప్ వద్ద రక్త గాయాలతో ఉన్న దండపాణిని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు భయపడి అతడు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు తేలింది. అతడికి కృష్ణగిరి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

పళణికే పగ్గాలు!



సమావేశంలో మాట్లాడుతున్న పళణి స్వామి

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడపాడి కె. పళణి స్వామి ఎంపికను ఆ పార్టీ కార్యనిర్వాహక సమావేశం ఆమోదించింది. పార్టీ పరంగా విధాన నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని ఆయనకు కట్టబెట్టారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను విస్తృతం చేయడానికి తీర్మానించారు. ఆదివారం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌లో ఈ మేరకు 15 తీర్మానాలు చేశారు.

- ప్రధాన కార్యదర్శిగా గుర్తింపు
- కార్యనిర్వాహక సమావేశంలో 15 తీర్మానాలు
- మరింత విస్తృతంగా సభ్యత్వ నమోదు
- ఆగస్టులో మదురై వేదికగా మహానాడు



ఎంజీఆర్, జయలలిత విగ్రహాల వద్ద నివాళి

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకేలో పళణి స్వామి, పన్నీరు సెల్వం మధ్య విభేదాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. న్యాయ పోరాటంలో గెలుపు తన వైపుగా ఉండడంతో చకచక పావులు కదిపిన పళణి స్వామి పార్టీని తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. అలాగే పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ వ్యవహారాలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరం మళ్లీ న్యాయ పోరాటం చేస్తోంది. ఈ పిటిషన్లపై తీర్పులు వెలువడాల్సి ఉంది. ఈ సమయంలో తన వ్యూహాలకు మరింత పదును పెట్టే విధంగా పళణి స్వామి అడుగుల వేగాన్ని పెంచారు. పార్టీ కార్యనిర్వాహక సమావేశానికి (ఎగ్జిక్యూటివ్ మీటింగ్)కు పిలుపునిచ్చారు.

అందరూ హాజరు..

రాయపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశం నిమిత్తం అక్కడకు వచ్చిన పళణి స్వామికి బ్రహ్మరథం పట్టేవిధంగా పార్టీ వర్గాలు ఆహ్వానం పలికాయి. అక్కడున్న దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత విగ్రహాల వద్ద నివాళులర్పించి పార్టీ కార్యాలయంలోకి పళణి అడుగు పెట్టారు. ప్రవేశ మార్గంలో ఉంచిన ఎంజీఆర్, జయలలి చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించి సమావేశానికి హాజరయ్యారు. పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే, పళణి స్వామిని ఆహ్వానిస్తూ, ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎంపికను అభినందిస్తూ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు కరతాళ ధ్వనులను మారుమోగించారు. అన్నాడీఎంకే పార్టీ పరంగా రాష్ట్రంలోని 75 జిల్లాలకు చెందిన కార్యదర్శులు, ఇతర రాష్ట్రాలలోని పార్టీ కమిటీ నిర్వహకులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోని ముఖ్య నేతలు, సీనియర్లు, పార్టీ ఎమ్మెల్యేలు అంటూ 320 మంది కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరు అయ్యారు.



పళణికి స్వాగతం పలుకుతున్న అన్నాడీఎంకే కార్యకర్తలు

ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికైన పళణి స్వామి పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటుగా సర్వ సభ్య సమావేశం మద్దతు, ఆమోదాన్ని పొందాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో పళణి స్వామి ఎంపికను ఆమోదించారు. అలాగే పార్టీ పరంగా నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని పళణి స్వామికి కట్టబెట్టారు. కర్ణాటక ఎన్నికల గురించి చర్చించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. పళణి స్వామి ప్రధాన కార్యదర్శిగాఎంపిక కావడాన్ని అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలపడంతో పాటుగా 15 తీర్మానాలు ఈ సమావేశంలో చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ తీర్మానం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల క్షీణింపునకు నిరసనగా తీర్మానం చేశారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను విస్తృతం చేస్తూ, 2 కోట్ల మంది సభ్యులను చేర్చడం లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఒక్కో జిల్లాలో పార్టీ పరిస్థితి, బలోపేతం దిశగా చేపట్టాల్సిన అంశాలు, పళణి స్వామి విస్తృతం పర్యటన ల గురించిసమీక్షించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆగస్టు 20వ తేదీన మదురై వేదికగా బ్రహ్మాండ మహానాడుకు నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీల బలోపేతానికి తీర్మానించారు. కాగా పార్టీ కార్యక్రమాల నిమిత్తం ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్‌కు అన్నాడీఎంకే తరపున స్కార్పియో వాహనం అందజేశారు. ఈ తాళాన్ని ఆయనకు పళణి స్వామి అందజేశారు.

ప్రధాన కార్యదర్శిగా ఆమోదం

108తో ప్రత్యేక గుర్తింపు

- ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ వ్యాఖ్య
- 1.46 కోట్ల మందికి సేవలందించినట్లు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

సాక్షి, చెన్నై: తమిళనాడుకు ప్రత్యేక చిహ్నంగా 108 సేవలు నిలుస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. ఇప్పటి వరకు 1.46 కోట్ల మందికి ఈ అంబులెన్స్‌ల ద్వారా సేవలు అందించామన్నారు. వీటిని మరింత విస్తృతం చేయనున్నామన్నారు. మదురైలో ఆదివారం 108 ఉద్యోగ, కార్మికుల సంక్షేమం సంఘం తొలి మహానాడు జరిగింది. ఇందులో ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ ప్రసంగిస్తూ, 2008లో 200 వాహనాలతో అంబులెన్స్ సేవలకు డీఎంకే ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ప్రస్తుతం 1,353 వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. 205 అంబులెన్స్‌లను మరిన్ని వసతులతో తీర్చిదిద్దామని వివరించారు. మరో 65 అంబులెన్స్‌లు చిన్న పిల్లలకు అసవరమైన అన్ని రకాల సేవలతో రూపొందించామన్నారు. తాము ప్రస్తుతం అధికారంలోకి వచ్చినానంతరం రూ. 102 కోట్ల 28 లక్షలతో 293 అంబులెన్స్‌లను కొనుగోలు చేశామన్నారు. ఈ అంబులెన్స్‌లో తమిళనాడుకు ప్రత్యేక గుర్తింపు చిహ్నంగా మారినట్లు ధీమా వ్యక్తం చేశారు. ప్రపథమంగా తమ ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన ఈ పథకాన్ని, సేవలను అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా మలుచుకున్నాయని పేర్కొన్నారు. రోజుకు 108 అంబులెన్స్‌కు 12,500 ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు వివరించారు. 2008 నుంచి ఇప్పటి వరకు 1.46 కోట్ల 71 వేల 266 మంది సేవలు పొందారని తెలిపారు. కరోనా కాలంలో 108 సేవలు అభినందనీయమని, సిబ్బంది సేవలు వెలకట్ట లేనిదిగా పేర్కొన్నారు. కరోనా సమయంలో 542 అంబులెన్స్‌ల ద్వారా 6 లక్షల 30 వేల 500 మంది కరోనా రోగులను ఆస్పత్రులకు తరలించామన్నారు. ఈ అంబులెన్స్‌ల సేవలను మరింతగా విస్తరించనున్నట్లు తెలిపారు.

విమానాశ్రయం వద్దే..వద్దు!

- గ్రామస్తుల వినూత్న నిరసన
- గుండు గీయించుకుని, నామాలతో భిక్షాటన



గుండు గీసుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సాక్షి, చెన్నై: తమకు విమానాశ్రయం వద్దే వద్దు అన్న నినాదంతో ఏకనాపురం పరిసర గ్రామాల ప్రజలు ఆదివారం వినూత్న నిరసనకు నిర్వహించారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా గుండు గీయించుకున్నారు. నెత్తిన నామాలు ధరించి, చేతిలో పాత్రతో భిక్షాటన చేశారు. వివరాలు.. చెన్నై విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా కాంచీపురం జిల్లా పరందూరులో కొత్త విమానాశ్రయ టెర్మినల్‌కు కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. రూ. 20 వేల కోట్లతో 4750 ఎకరాల విస్తీర్ణంలో ఈ టెర్మినల్, రన్ వే పనులకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ పనులకు 13 గ్రామాలలో స్థల సేకరణ ప్రక్రియకు నిర్ణయించారు. దీనిని వ్యతిరేకిస్తూ ఏకనాపురం వేదికగా ఆ గ్రామాల ప్రజలు చేస్తూ వస్తున్న ఉద్యమం ఆదివారంతో 264వ రోజుకు చేరింది. ఇక్కడి ప్రజలను బుజ్జగించేందుకు పలు దఫాలుగా రాష్ట్ర మంత్రులు చర్చలు జరిపారు. ఈ పరిస్థితుల్లో గత వారం చెన్నై పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ఈ విమానాశ్రయ పనుల కోసం నిధుల కేటాయించాలని సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేయడం ఆగ్రామాల ప్రజలలో మరింత ఆగ్రహాన్ని రేపింది.

వినూత్న రీతిలో..

చర్చల సమయంలో తమకు భరోసా ఇచ్చే విధంగా ఓ వైపు తమకు హామీలు ఇస్తూనే క్షేత్రస్థాయిలో సీఎం స్టాలిన్ చర్యలు మరో విధంగా ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం వినూత్న నిరసనకు దిగారు. ఆ గ్రామాలలోని వందలాది మంది పిల్లలు, వృద్ధులు, మహిళలు గ్రామ ప్రవేశ మార్గంలో ఉన్న భారత రాజ్యాంగ సృష్టి కర్త అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా గుండు గీయించుకున్నారు. నెత్తిన నామాలు వేయించుకున్నారు. పాత్రను చేతబట్టి భిక్షాటనకు దిగారు. ఆ పరిసర గ్రామాల్లో ర్యాలీగా వెళ్తూ భిక్షాటనతో తమకు విమానాశ్రయం వద్దే వద్దు అని నినాదించారు. అటువైపుగా వచ్చిన బస్సులలో ప్రయాణించే వారి వద్ద భిక్షాటన చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ పంట పొలాలను రక్షించాలని, తమగ్రామాలను ఖాళీ చేయించకుండా యావత్ ప్రజానీకం తమకు అండగా నిలబడాలని గ్రామస్తులు వేడుకున్నారు.

నిఘా నీడలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ



తిరువళ్లూరులో ఆర్ఎస్ఎస్ నాయకుల సమావేశం

సాక్షి, చెన్నై: నిఘా నీడలో ఆదివారం సాయంత్రం రాష్ట్రంలో 45 చోట్ల ఆర్ఎస్ఎస్ ర్యాలీ జరిగింది. చెన్నైలో రెండు చోట్ల నిర్వహించారు. వివరాలు.. సుప్రీంకోర్టు అనుమతితో రాష్ట్రంలో ర్యాలీకి ఆర్ఎస్ఎస్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం రాష్ట్రంలో 45 చోట్ల ర్యాలీ నిర్వహించారు. పోలీసులు విధించిన 12 రకాల కట్టుబాట్లకు అనుగుణంగా ర్యాలీ జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నిఘానీడలో ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పకడ్బందీ భద్రతతో వ్యవహరించారు. ర్యాలీ, సభలో వ్యక్తిగతం, కులమతాలకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని ముందుగానే పోలీసులు హెచ్చరించడంతో నిర్వాహకులు అందుకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎలాంటి కర్రలు, ఆయుధాలు అన్నది లేకుండా ర్యాలీ జరిగింది. ప్రజలకు, వాహన దారులకు ఇబ్బంది కలిగించకుండా అనేక ప్రాంతాల్లో ఎంపిక చేసిన మార్గాల్లో ఆర్ఎస్ఎస్ సేవకులు ముందుకు కదిలారు. అనంతరం ఆయా ప్రాంతాలలో సభలు జరిగాయి. చెన్నైలో ఊరపాక్కం, కొరట్టూరులలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ ఆర్ఎస్ఎస్ ప్రచార కార్యదర్శి నరసింహన్ ప్రకటన చేశారు. భారతీయ సమాజానికి నమ్మకం కలిగించే విధంగా ఈ ర్యాలీని నిర్వహించామని వివరించారు. చెన్నై కొరట్టూరులో జరిగిన ర్యాలీకి ఆర్ఎస్ఎస్ నేత వన్నియరాజన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ హాజరయ్యారు.

క్రీడా ప్రతిభకు పట్టం

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి, అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. తొలి ప్రయత్నంగా చెన్నై కార్పొరేషన్ బడుల్లోని క్రీడా ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి భారత క్రికెటర్ అశ్విన్ అకాడమీ ద్వారా క్రికెట్, గ్రేట్ గోల్స్ ద్వారా ఫుట్‌బాల్ శిక్షణను ఇవ్వనున్నారు.

- కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- చెన్నైలో ప్రారంభం
- విద్యార్థులకు ప్రోత్సాహం
- సొంత ఖర్చుతో అంతర్జాతీయ శిక్షణ
- నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ



మంత్రి ఉదయనిధి స్టాలిన్‌తో ఎంపికైన క్రీడాకారులు

సాక్షి, చెన్నై: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది దిగ్విజయవంతంగా ప్రపంచ స్థాయి చెస్ పోటీలను చెన్నై శివారులోని మహాబలిపురంలో నిర్వహించారు. క్రీడాభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమం లక్ష్యంగా సీఎం స్టాలిన్ ప్రత్యేక కార్యాచరణను ఇప్పటికే ప్రకటించారు. నియోజకవర్గానికి ఓ క్రీడా మైదానం, అత్యుత్తమ శిక్షణకు తగ్గ చర్యలకు నిర్ణయించారు. అలాగే ఉత్తమ సేవలను అందించే క్రీడాకారులను గౌరవించే విధంగా చర్యలు చేపట్టారు. అలాగే పేద విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు సిద్ధమయ్యారు. తమకు పలాన క్రీడ మీద పట్టు ఉన్నా, ప్రోత్సహించే వారు లేరనే వేదనలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తాము ఉన్నామన్న ప్రోత్సాహం ఇచ్చేందుకు క్రీడల శాఖ సిద్ధమైంది. క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలలో రాణించే సత్తా ఉన్నా, శిక్షణకు సరి పడ్డ స్థోమత లేక మౌనంగా ఉన్న విద్యార్థుల భుజం తట్టి అండగా నిలిచేందుకు క్రీడా అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా తొలి ప్రయత్నంగా చెన్నై కార్పొరేషన్ పాఠశాలలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన ఒప్పందాలు క్రీడా మంత్రి ఉదయ నిధి స్టాలిన్ నేతృత్వంలో రెండు రోజుల క్రితం చెన్నైలో జరగడం విశేషం.

అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ

సిటీ పెట్టుబడులకు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్, సస్టైన్ (సీఐటీఐఐ) నినాదంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు క్రికెట్, ఫుట్‌బాల్ శిక్షణకు శ్రీకారం చుట్టారు. భారత క్రికెటర్, స్పిన్ బౌలర్ రవి చంద్రన్ అశ్విన్ నేతృత్వంలోని జన్ నెక్స్ట్ క్రికెట్ ఇన్‌స్టిట్యూట్ అకాడమీతో ఒప్పందాలు చేసుకున్నారు. అలాగే ఫుట్‌బాల్ క్రీడ కోసం గ్రేట్ గోల్స్ ఫౌండేషన్ ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాల మేరకు కార్పొరేషన్ పాఠశాలలో చదువుకుంటున్న 6, 7, 8 తరగతులకు చెందిన క్రీడా ప్రతిభ కలిగిన విద్యార్థులు 30 మందిని ఏటా క్రికెట్ శిక్షణ నిమిత్తం ఎంపిక చేశారు. ఈ శిక్షణ కోసం విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల కిట్లు ప్రభుత్వం అందజేయనున్నారు. శిక్షణ కోసం ప్రత్యేకంగా ఆరో క్రికెట్ పిచ్‌లను నుంగంబాక్కంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కోసం రూ. 19 లక్షలు కేటాయించారు. 12 నెలల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రికెటర్లుగా తీర్చిదిద్దబోతున్నారు. ఇందులో బాలిక క్రికెట్ జట్టు కూడా ఉండడం విశేషం. అలాగే ఫుట్‌బాల్ ప్రాక్టీస్ కోసం గ్రేట్ గోల్స్ ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం రూ. 8 లక్షలు కేటాయించారు. తొలి విడతగా 60 మంది విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేశారు. ఇందులో 20 మంది బాలికలు ఉన్నారు. 11 నెలల పాటు వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. మాస్‌తోపు బాలిక పాఠశాలలో ఫుట్‌బాల్ శిక్షణకు ప్రత్యేక మైదానం సిద్ధం చేయడం విశేషం. క్రికెటర్ అశ్విన్‌తో పాటు నిష్ణాతులైన నిపుణుల క్రికెట్ శిక్షణ విద్యార్థులకు విస్తృతం చేయనున్నారు.



క్రీడాకారులకు సామగ్రి అందజేస్తూ..

కరుప్పన్ కోసం కుంకీలు



కరుప్పన్ ఏనుగు

సాక్షి, చెన్నై: కరుప్పన్ ఏనుగును పట్టుకునేందుకు రెండు కుంకీలు ఆదివారం రంగంలోకి దిగాయి. ఈరోడ్ జిల్లా తాలవాడి పరిధిలోని కరుప్పన్ అనే అడవి ఏనుగు వీరంగం సృష్టిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. దీని దాడిలో ఇప్పటికే ఇద్దరు మరణించారు. ఈ ఏనుగును పట్టుకునేందుకు ఈనెల మొదటివారం నుంచి అటవీ అధికారులు తీవ్రంగా యత్నిస్తున్నారు. ఇప్పటికే ఆ ఏనుగుకు రెండు సార్లుమత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. ఆ మత్తులోనే ఏనుగు అధికారులకు చిక్కకుండా తప్పించుకుంది. మరోమారు మత్తు ఇంజెక్షన్ ఇస్తే ఏనుగు ఆరోగ్యానికి హాని తప్పదని వైద్యాధికారులు తేల్చారు. దీంతో ఆ ఏనుగును పట్టుకునేందుకు చిన్న తంబి, మారియప్పన్ అనే రెండు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. కరుప్పన్ వచ్చి వెళ్లేమార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కదలికలను పర్యవేక్షిస్తున్నారు. కరుప్పన్ జాడ తెలియగానే కుంకీల ద్వారా మచ్చిక చేసుకుని పట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఇదిలా ఉండగా సత్యమంగళం పులల అభయారణ్యం నుంచి నీటి కోసం ఏనుగులు గ్రామాల్లోకి ఆదివారం చొరబడ్డాయి. వీటిని మళ్లీ అడవుల్లోకి తరలించేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

క్లుప్తంగా

వసూళ్లు తగ్గడంపై వాదన

• కండక్టర్, అసిస్టెంట్ మేనేజర్‌పై వేటు

కొరుక్కుపేట: ప్రభుత్వ బస్సుల్లో వసూళ్ల తగ్గడం విషయంలో వివాదం ఏర్పడడంతో మేనేజర్, కండక్టర్‌లను సస్పెండ్ చేశారు. వివరాలు.. సేలం డివిజన్ అసిస్టెంట్ మేనేజర్ షాజహాన్ శనివారం చెన్నైలోని కోయంబేడు బస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో సేలం జిల్లా నుంచి బయలుదేరి కోయంబేడు బస్‌స్టేషన్‌కు చేరుకున్న కండక్టర్ సంతకాలు తీసుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో మేనేజర్ షాజహాన్ కలెక్షన్ తక్కువగా ఉండడంపై ప్రశ్నించాడు. దీంతో ఈ వ్యవహారాన్ని చెల్లదురై సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీంతో ఆవేశం చెందిన షాజహాన్ దాడికి దిగాడు. దీంతో షాక్ తిన్న కండక్టర్ తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఇప్పుడు ఆ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారి అధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై సేలం మేనేజ్‌మెంట్ డైరెక్టర్ విచారణ జరిపి మేనేజర్ షాజహాన్, కండక్టర్ చెల్లదురైను విచారించి వారిద్దరినీ వెంటనే విధుల నుంచి తొలగించడం తీవ్ర సంచలనం రేపింది.

ఘనంగా 48వ రైజింగ్ డే



రైజింగ్ డేలో పాల్గొన్న సీవీఆర్‌డీఈ అధికారులు

కొరుక్కుపేట: డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కంబాట్ వెహికల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీవీఆర్‌డీఈ) తరపున 48వ వార్షిక రైజింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి ఆత్మనిర్భర్ భారత్ కింద దేశీయంగా అభివృద్ధి చేసిన కొన్ని ఉత్పత్తులను అందజేశారు. సమీర్ వి కామత్ మాట్లాడుతూ సీవీఆర్‌డీఈ భారతీయ ప్రైవేట్ కంపెనీలు, పీఎస్‌యూల సహకారంతో ఏరో స్పేస్ బేరింగ్ టెక్నాలజీలో ఎల్‌సీఏ-తేజస్ హైస్పీడ్, హై ప్రెసిషన్, ఎయిర్ క్రాఫ్ట్ నాణ్యత బేరింగ్‌లను రూపొందించి అభివృద్ధి చేసినట్టు వివరించారు.

105 కిలోల జలగలు స్వాధీనం

అన్నానగర్: రామనాథపురం జిల్లా మండపంలో భారత తీర రక్షక దళం శనివారం హోవర్ క్రాఫ్ట్‌లో బాగలసంధి జలాలపై గస్తీ నిర్వహించింది. ఆ సమయంలో సముద్రపు ఒడ్డున పడి ఉన్న మూటలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో జలగలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని సీజ్ చేసి మండపం తీర రక్షక దళ శిబిరానికి తీసుకొచ్చి తూకం వేశారు. అందులో 105 కిలోల జలగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవం.. వెంకన్న కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కర్పూర నీరాజనం

తిరుత్తణి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట మండలంలోని చెట్టివారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. కల్యాణోత్సవం పాల్గొనేందుకు వీలుగా పెద్దసంఖ్యలో మహిళలు గ్రామానికి చేరుకున్నారు. ఉత్సవ వేడుకలకు నాందిగా మహిళలు మేళ తాళాల నడుమ పట్టువస్త్రాలు, పూజాసామగ్రి మాంగళ్యంతో పాటు వరుస తీసుకొచ్చి ఆలయ కల్యాణోత్సవం ప్రాంగణంలో సిద్ధంగా ఉంచారు. విశేష అలంకరణలో కల్యాణప్రియుడిగా కొలువైన వేంకటేశ్వస్వామి, శ్రీదేవి భూదేవి ఉత్సవమూర్తులకు భట్టాచార్యుల బృందం హోమపూజలతో పాటు వేద మంత్రోచ్ఛారణతో కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గోవిందనామస్మరణతో స్వామివారి కల్యాణోత్సవం తిలకించి పరవశం చెందారు. వేడుకల్లో రాష్ట్ర చేనేత పరిశ్రమ శాఖ మంత్రి ఆర్.గాంధీ, కమల గాంధీ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మహిళలకు పసుపు, కుంకుమ ప్రసాదాలు అందజేశారు. రాత్రి గ్రామీణులకు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ వేడుకలు విజయవంతంగా నిర్వహించారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



మహా కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) పవిత్ర జలాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

పళ్లిపట్టు: శ్రీ కృష్ణుడి ఆలయ మహాకుంభాభిషేకం వేడుకలు ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్కేపేట మండలంలోని పరభయంగకరపురం గ్రామ పంచాయతీలోని కొళత్తిమేడు గ్రామంలో గ్రామీణుల సంయుక్త సహకారంతో రాధ, రుక్మిణి సమేత శ్రీ కృష్ణుడి ఆలయం నిర్మించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు మహాకుంభాభిషేకం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు గ్రామవీధులను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి పురోహితులు హోమగుండపూజలు చేశారు. ఆదివారం ఉదయం మహాపూర్ణాహుతి అనంతరం మంగళ వాయిద్యాల నడుమ పవిత్ర పుణ్యతీర్థాల కలశాలు బయల్దేరి గోపుర కలశానికి మహాకుంభాభిషేకం నిర్వహించి భక్తులపై పుణ్యతీర్థాలు వెదజల్లారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో గోవిందనామస్మరణతో స్వామిదర్శనం చేశారు. అనంతరం రాధ, రుక్మిణి సమేత శ్రీ కృష్ణుడికి అభిషేకం ఆరాధన పూజలతో విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహాకుంభాభిషేకం వేడుకల్లో మంత్రి గాంధీ కుటుంబీకులతో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

బావిలో పడిన జింక

• రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

తిరువళ్లూరు: తాగునీటి కోసం జనావాసానికి వచ్చి వ్యవసాయ భావిలో పడిన జింకను తిరువళ్లూరు అగ్నిమాపక సిబ్బంది రక్షించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. తిరువళ్లూరు జిల్లా పూండి కాపు అటవీ ప్రాంతంలో జింకల సంచారం ఎక్కువగా వుంది. ఈ నేపత్యంలో తాగునీటి కోసం అటవీ ప్రాంతం నుంచి విలాపాక్కం గ్రామానికి వచ్చిన జింకను స్థానికులు పట్టుకోవడానికి యత్నించారు. జనం నుంచి తప్పించుకోవడానికి పరుగులు పెట్టిన జింక సమీపంలోని 50 అడుగుల పాడుబడిన వ్యవసాయబావిలో పడిపోయింది. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి భావిలో పడిన జింకను రక్షించారు. అనంతరం జింకను పూండి కాపు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.



జింకను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

ఎస్వీఎం కార్స్‌లో కియా ఈవీ 6 ఎలక్ట్రిక్ కార్లు



ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరిస్తున్న నటుడు వైభవ్ రెడ్డి, మధుసూదన రావు

సాక్షి చెన్నై: కార్ల విక్రయ రంగంలో పేరు గడించిన చెన్నైకు చెందిన ఎస్వీఎం కార్స్ ప్రైవేట్ లిమిటెడ్ నగరవాసుల కోసం కియా ఇండియా సరికొత్తగా ఈవీ6 ఎలక్ట్రిక్ కార్లను అందుబాటులోకి తెచ్చింది. శనివారం రాత్రి చెన్నై ఈక్కాట్టుతాంగల్‌లోని ఎస్వీఎం కార్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ఈవీ6 ఎలక్ట్రిక్ కార్లను సినీ నటుడు వైభవ్ రెడ్డి, బాడీ బిల్డింగ్‌లో మిస్టర్ వరల్డ్‌గా అవతరించిన రాజేంద్ర మణితో కలసి ఆ షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన రావు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదేన రావు మాట్లాడుతూ దేశీయ విద్యుత్తు కార్ల విపణిలోకి అడుగు పెట్టిన కియా ఈవీ6 పేరుతో 2023 వెర్షన్ ఎలక్ట్రిక్ కార్లను మార్కెట్‌లోకి తీసుకుని రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే కియా కార్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ ఉందని అన్నారు. చెన్నై నగరంలోని కాట్టు పాక్కం, ఈక్కాట్టు తాంగల్ ఎస్వీఎం కార్ల షోరూమ్‌లలో కియా ఈవీ6 ఎలక్ట్రిక్ కార్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్ల కొనుగోలుకు బుకింగ్‌లను ప్రారంభించినట్టు తెలిపారు. ముందుగా స్థానిక షోరూమ్ ఈవీ6 సేల్స్ మేనేజర్ గుగన్ మాట్లాడుతూ, ఈవీ6 కార్లల్లో ఫ్యూచర్స్‌ను వివరించారు. కార్యక్రమంలో స్థానిక షోరూమ్ జనరల్ మేనేజర్ తేనప్పన్, కాట్టు పాక్కం బ్రాంచ్ జనరల్ మేనేజర్ శంకర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు

అన్నానగర్: సేలం జిల్లా పెరియనాయకన్ పాళయం సమీపంలోని ఓ గ్రామంలో 14 ఏళ్ల బాలిక తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. రాశిపురం తాలూకా మంగళాపురం సమీపంలోని వేపిలాయికుట్టి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆనంద్ (24). ఓ పాల కంపెనీకి చెందిన ఆటోలో తోలుతున్నాడు. ఈ క్రమంలో బాలికతో పరిచయం ఏర్పడి ప్రేమలో పడ్డాడు. ఇదిలా ఉండగా బాలిక తరచూ స్పృహతప్పి పడిపోవడం చూసి తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ బాలిక గర్భవతి అని తెలిపారు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు ఏత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ జరిపి పోక్సో చట్టం కింద ఆనంద్‌ను శనివారం అరెస్టు చేశారు.


• వాకథాన్



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఫోర్టిస్ మలర్ ఆస్పత్రి నేతృత్వంలో సంపూర్ణ ఆరోగ్యం గురించి అవగాహన కల్పించే విధంగా 200మందితో ఆదివారం వాకథాన్ జరిగింది. ఎలియట్స్ బీచ్‌లో జరిగిన కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై ప్రెసిడెన్సీ అధ్యక్షుడు డాక్టర్ సాయిరమణన్, ఆస్పత్రి ఫెసిలిటీ డైరెక్టర్ ఆర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. - సాక్షి, చెన్నై

నిర్మాతల సంఘం సహకరించ లేదు

తమిళసినిమా: జగద్గురువు రామానుజర్ గురించి తెలియని వారు ఉండరు. విష్ణుభక్తుడు. హిందూ మత పరిరక్షకుడు. కులమతాలకతీతంగా జనోద్ధరణకు పాటుపడిన మహానుభావుడు రామానుజన్ జీవిత చరిత్ర గురించి ఇప్పటికే పలు భాషల్లో చిత్రాలు రూపొందాయి. తమిళంలోనూ ఆయన జీవిత చరిత్రతో సీరియల్ రూపొందింది. తాజాగా శ్రీ రామనుజన్ బయోపిక్‌ను శ్రీకృష్ణన్ తన హయగ్రీవ సినీ ఆర్ట్స్ పతాకంపై నిర్మించి టైటిల్ పాత్రను పోషించారు. ఆయనతో పాటు నటుడు రాధారవి, కోట శ్రీనివాసరావు, వైజీ మహేంద్రన్, శ్రీమాన్, నిళల్‌గళ్ రవి, సిమ్రాన్, గాయత్రి ముఖ్యపాత్రలు పోషించారు. ఇరవి చందర్ వరద నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతాన్ని అందించారు. ఈ చిత్రంలో త్వరలో రావడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శనివారం సాయంత్రం ఒక నక్షత్ర హోటల్లో చిత్రం సింగిల్ సాంగ్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామానుజన్ జీవిత చరిత్రతో రూపొందిన ఈ చిత్రం ఒక మహా కావ్యంగా పేర్కొన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో ప్రదర్శించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చిత్ర నిర్మాత కథానాయకుడు శ్రీకృష్ణన్ మాట్లాడుతూ ఈ చిత్ర నిర్మాణానికి చాలా శ్రమించినట్లు చెప్పారు. తమకు తమిళ నిర్మాతల సంఘం ఏ విధంగానూ సహకరించలేదని, అది ఉన్నా లేనట్టేననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే రామానుజర్ చిత్రం బాగా వచ్చిందని దీనికి ఇళయరాజా అద్భుతమైన సంగీతాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ చిత్ర సింగిల్ సాంగ్ మిలియన్‌కు పైగా ప్రేక్షకులు చూశారని చెప్పారు. చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించినట్లు ఆ వేదికపై ఇళయరాజా చిత్రంలోని ఐదు పాటలను లైవ్‌లో పాడి సంగీత ప్రియులను అలరింపచేస్తారని చెప్పారు. చిత్రం విజయం ఖాయమని, దానిని ఎలా ప్రమోట్ చేయాలన్నది తనకు తెలుసని శ్రీకృష్ణన్ పేర్కొన్నారు.



రామానుజర్ చిత్రంలో ఓ సన్నివేశం

కోలీవుడ్ టాక్స్

కాసులుంటే కాకి కూడా కలర్‌గా మారుతుంది

తమిళసినిమా: బుల్లితెర యాంకర్‌గా పరిచయమై ఆ తరువాత వెండితెర కథానాయకిగా ఎదిగిన నటి ప్రియా భవానీ శంకర్. తొలి చిత్రం మేయాదమాన్‌తోనే విజయం వరించడంతో ఆ తరువాత ఈమెకు వరుసగా అవకాశాలు వరించడం మొదలెట్టాయి. ప్రస్తుతం బిజీ కథానాయకిలలో ప్రియ భవానీ శంకర్ ఒకరు. ఇటీవల ఈమె జయంరవికి జంటగా నటించిన అఖిలన్, శింబుతో జతకట్టిన పత్తుతల, తాజాగా రాఘవలారెన్స్ సరసన నటించిన రుద్రన్ చిత్రాలు వరుసగా తెరపైకి వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ మీ శరీర రంగును పరిహాసం చేస్తూ కొందరు మిమ్మల్ని గాయపరుస్తారన్నారు. అయితే మీరు ఎవరు అన్నది, మీరు ఏం కావాలనుకుంటున్నారు అన్న విషయాలను ఇతరులు మాట్లాడి నిర్ణయం తీసుకునే అవకాశం వారికి ఇవ్వొద్దని సూచించారు. ఇక్కడ అందానికి నిర్వచనం ఏదీ ఉండదు. స్కిన్ కేర్, తమ అందాలను మెరుగుపరచుకోవడానికి తారలు చాలా ఖర్చు చేస్తుంటారన్నారు. అయితే ఓ సాధారణ కళాశాల విద్యార్థికి అలా చేయడం సాధ్యం కాదన్నారు. అయితే రూపం, రంగు, శరీర సౌష్టవం వంటి వాటి గురించి చింతించాలిసన అవసరం లేదన్నారు. ఇన్‌స్టాగామ్‌లో ఫొటోలు చూసి ఒక నిర్ణయానికి రాకూడదు అన్నారు. ఇప్పుడు తాను తయారు కావడానికి 10 మందితో కూడిన ఒక బృందం ఉందన్నారు. అయితే ఇదే సౌందర్యం అని చెప్పడానికి నిర్వచనం ఏదీ లేదన్నారు. కాబట్టి శారీరక అందం గురించి ఎవరు బాధపడాల్సిన అవసరం లేదని, మానసిక వేదనకు గురి కాకుండా జీవితాన్ని పరిపూర్ణంగా గడపాలన్నారు. డబ్బు ఉంటే కాకి కూడా కలర్‌గా మారుతుందని కొందరు చెబుతుంటారని, అయితే డబ్బు ఎవరికి ఊరకనే రాదని మీరు ప్రపంచంతో పోరాడి కోరుకున్నది గెలవాల్సి ఉంటుందని నటి ప్రియ భవానీ శంకర్ పేర్కొన్నారు.



ప్రియా భవానీ శంకర్

వినోద ప్రధానంగా దైవమచ్చాన్!



దైవమచ్చాన్ చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు విమల్ కథానాయకుడిగా నటించిన చిత్రం దైవమచ్చాన్. నటి నేహా కథానాయకిగా పరిచయం అవుతున్న ఇందులో నటుడు పాండియరాజన్, ఆడుగళం నరేన్, బాల శరవణన్, వేల్ రామమూర్తి, మురుగానందం, వత్సన్ వీరమణి, తంగదురై, బిగ్‌బాస్ అనిత సంపత్, దీప తదితరులు ముఖ్యపాత్ర పోషించారు. మార్టిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఉదయ్ ప్రొడక్షన్స్, మ్యాజిక్ టచ్ పిక్చర్స్ సంస్థల అధినేతలు ఉదయ్‌కుమార్, గీతా ఉదయ్ కుమార్, ఎంపి వీరమణి సంయుక్తంగా నిర్మించారు. దీనికి కేమిల్ జె.అలెక్స్ ఛాయాగ్రహణంను, గాడ్విన్ సంగీతాన్ని, అజిష్ నేపథ్య సంగీతాన్ని అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 21వ తేదీన విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక వడపళనిలోని కమలా థియేటర్లో చిత్ర యూనిట్ నిర్వహించిన మీడియా సమావేశంలో నటుడు విమల్ మాట్లాడుతూ ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే ఫాంటసీ కామెడీ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. తాను విళంగు వెబ్ సిరీస్ షూటింగ్‌లో నటిస్తున్నప్పుడు నిర్మాత తనకే కథను చెప్పారన్నారు. కథ నచ్చడంతో ఇందులో నటించడానికి అంగీకరించినట్లు చెప్పారు. నటుడు వేల రామమూర్తి పాత్ర తన కలలో చెప్పిన విషయం నిజంగా జరుగుతాయన్నారు. నటుడు పాండియరాజన్ తనకు తండ్రిగా నటించాలని, ఆయనతో కలిసి నటించడం మంచి అనుభవం అని పేర్కొన్నారు. షూటింగ్‌లో అందరం ఒక కుటుంబంలా కలిసి పని చేసినట్లు విమల్ చెప్పారు. చిత్ర యూనిట్ సహకారంతోనే ఈ చిత్రాన్ని పూర్తి చేయగలిగినట్లు నిర్మాతలు చెప్పారు. చిత్రం బాగా వచ్చిందని ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తుందని అన్నారు.

దెయ్యం పాత్రలో యాషికా ఆనంద్

తమిళసినిమా: గ్లామరస్ నటిగా ముద్ర వేసుకున్న సంచలన నటి యాషికా ఆనంద్. ఈమె ప్రధాన పాత్రలో దెయ్యంగా నటించిన హార్రర్ చిత్రం చైత్ర. మార్స్ ప్రొడక్షన్స్ పతాకంపై కె.మనోహరన్, టి.కన్నన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం ఇది. అవితేజ్, శక్తి మహేంద్ర, పూజ, రమణన్, కన్నన్, లూయిస్, మొసకుట్టి తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రం ద్వారా ఎం.జెనిత్‌కుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన బొట్టు తదితర చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేశారన్నది గమనార్హం. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది 24 గంటల్లో జరిగే హార్రర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. చిత్రంలో పలు ఆసక్తికరమైన ఘటనలు చోటు చేసుకుంటాయన్నారు. ఇందులో నటి యాషిక ఆనంద్ దెయ్యం పాత్రలో భయపెడుతుందన్నారు. అందుకు కారణాలు ఏమిటి అన్నదే చిత్ర కథ అని అన్నారు. దీనికి సతీష్‌కుమార్ ఛాయాగ్రహణం, ప్రభాకరన్ మెయ్యప్పన్ సంగీతాన్ని అందించారని చెప్పారు. చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయని త్వరలోనే విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కాగా చిత్ర ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని తెలిపారు. దీంతో చిత్రం విజయంపై నమ్మకం పెరిగిందనే అభిప్రాయాన్ని దర్శకుడు వ్యక్తం చేశారు.



యాషికా ఆనంద్

రుద్రన్‌కు ప్రశంసలు

తమిళసినిమా: రాఘవ లారెన్స్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం రుద్రన్. నటి ప్రియాభవాని శంకర్ నటించిన ఇందులో నటుడు శరత్‌కుమార్ ప్రతినాయకుడిగా నటించారు. నిర్మాత కదిరేశన్ తొలిసారిగా మెగా ఫోన్‌పట్టి నిర్మించిన చిత్రం ఇది. కమర్షియల్ అంశాలతో యాక్షన్ ఓరియెంటెడ్ కథా చిత్రంగా రూపొందిన ఈ చిత్రం తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం భాషల్లో తమిళ ఉగాది సందర్భంగా విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శింపబడుతోంది. దీంతో రుద్రన్ చిత్ర దర్శక, నిర్మాత కదిరేశన్‌కు, నటుడు రాఘవ లారెన్స్‌కు దర్శకుడు లోకేష్ కనకరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆయన ట్విట్టర్లో పేర్కొంటూ రుద్రన్ చిత్రానికి పాజిటివ్ రివ్యూస్ రావడంతో చాలా సంతోషం ఉందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన రుద్రన్ చిత్ర దర్శక నిర్మాత కదిరేశన్, నటుడు రాఘవ లారెన్స్ దర్శకుడు లోకేష్ కనకరాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఈ చిత్రంలో ప్రతి నాయకుడిగా నటించిన శరత్‌కుమార్ ఒక ట్వీట్ చేశారు. రుద్రన్ చిత్రంలో విలన్‌గా నటించిన తన నటనను ఆదరిస్తూ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు, తన ప్రతి ప్రయత్నానికి అండగా నిలుస్తున్న మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు.



రుద్రన్ చిత్రంలో ఓ సన్నివేశం

క్లుప్తంగా

ఎస్ఐ ఆత్మహత్య



ఎస్ఐ తనిగవేలు(ఫైల్)

తిరువళ్లూరు: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఓ ఎస్ఐ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరువళ్లూరు జిల్లా కాకలూరు బైపా స్‌రోడ్డు ప్రాంతానికి చెందిన తనిగవేలు(49). తిరువళ్లూరు పరిధిలో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య గీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతను కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం యథావిధిగా విధులకు హాజరై శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. భోజనం తరువాత తన గదిలోకి వెళ్లాడు. ఆదివారం ఉదయం 8 ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భార్య గీత తలుపు తెరిచి చూడగా ఉరి వేసుకుని శవంగా కనిపించాడు. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తిరువొత్తియూరు: టీచర్ మందలించిందని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. చెన్నై కొలత్తూరు ఎంజీఆర్ నగర్‌కు చెందిన 13 సంవత్సరాల బాలిక బుద్ధగరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. పాఠశాలలో చివరి రోజు పురస్కరించుకుని విద్యార్థులు తమతో చదువుతున్న సహ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరం చేసుకోవడానికి నిర్ణయించుకున్నారు. ఇందుకోసం విద్యార్థులు కేక్, స్వీట్స్‌తో పాఠశాలకు వచ్చారు. మొదట దీనికి అనుమతి ఇచ్చిన టీచర్ తర్వాత పాఠశాలలో కేకు కట్ చేయకూడదని విద్యార్థినిని మందలించినట్లు తెలిసింది. మనస్తాపం చెందిన విద్యార్థిని ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న మాత్రలను ఎక్కువగా మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన తల్లిదండ్రులు విద్యార్థినిని చెన్నై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. రాజమంగళం పోలీసులు కేసు విచారిస్తున్నారు.

నగలు, నగదుతో పరార్

• యువతి అరెస్ట్

అన్నానగర్: కరూర్ సమీపంలో యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుని నగలు, నగదుతో పరారైన యువతితో సహా ముగ్గురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలు.. కరూర్ పశుపతిపాళయం దక్షిణ వీధికి చెందిన విఘ్నేశ్వరన్ (30)కు కంబం ప్రాంతానికి చెందిన దేవి (25)కి ఫిబ్రవరి 12న కరూర్‌లో వివాహమైంది. వివాహ సమయంలో దేవికి వరుడి కుటుంబీకులు రూ.2.40 లక్షలు నగదు, 8 సవర్ల బంగారు ఆభరణాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. వివాహం జరిగి రెండు రోజులలో దేవి శివకాశిలోని తన బంధువుల ఇంటికి వెళతామని చెప్పి విఘ్నేశ్వరన్‌తో బస్‌స్టేషన్‌లో దిగింది. తరువాత అక్కడి నుంచి తప్పించుకు పారిపోయింది. భార్య కనిపించకపోవడంతో శివకాశి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో మూడు రోజుల క్రితం మదురై సమీపంలో దేవి సహా ఆమెకు మధ్యవర్తులుగా వ్యవరిస్తున్న అమృతవల్లి (45), బాలమురుగన్ (43)ను అరెస్టు చేశారు. వీరు విఘ్నేశ్వరన్‌ను పెళ్లి పేరుతో మోసం చేసినట్లు తేలడంతో తంతోనిమలై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

120 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: చెన్నై అశోక్‌నగర్‌లో రిటైర్డ్ రైల్వే అధికారి ఇంట్లో 120 సవర్ల నగలు చోరీ చేసిన దుండగుని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై అశోక్‌నగర్ 12వ అవెన్యూ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు (62) రిటైర్డ్ రైల్వే అధికారి. ఊరికి వెళ్లిన ఇతను గత 13వ తేదీ ఇంటికి వెళ్లాడు. వెళ్లి చూడగా బీరువాలో వున్న 120 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి కుమరన్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దుండగుని ఆచూకీ గుర్తించారు. విచారణలో అతను చెన్నై తిరుపత్తూర్ జిల్లా అరిఫిలిప్స్ (58) అని తెలిసింది. పోలీసులు తిరుపత్తూర్‌లో ఉన్న అరిఫిలిప్స్‌ను అరెస్టు చేసి, అతని నుంచి 50 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ప్రముఖ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, నీతిఅయోగ్ అధికారి సంజయ్‌కుమార్ దర్శనానికి విచ్చేయగా, ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వీవీఎస్ లక్ష్మణ్ ముందుగా రుద్రాభిషేకంలో పాల్గొని, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

'పార్వతి' కోసం స్విమ్మింగ్ పూల్

• రూ.23 లక్షలతో నిర్మాణం



మంత్రికి ఆశీర్వాదం



స్విమ్మింగ్ పూల్‌లో పార్వతి

సాక్షి, చెన్నై : మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ ఏనుగు పార్వతి కోసం అతిపెద్ద స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. రూ. 23 లక్షలతో 3,500 చదరపు అడుగుల స్థలంలో నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్ పార్వతి ఆనంద తాండవం చేస్తూ జలకాలాటలో మునిగింది. వివరాలు.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మదురై మీనాక్షి అమ్మవారి ఆలయం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ ఆలయం ప్రవేశ మార్గంలో పార్వతి అనే ఏనుగు ప్రత్యేక ఆకర్షణతో కనిపిస్తుంటుంది. 2000 సంవత్సరంలో ఈ ఏనుగును ఉత్తరప్రదేశ్ నుంచి తీసుకొచ్చారు. అమ్మవారి సేవలో నిమగ్నమైన ఈ ఏనుగు ఆరోగ్య సంరక్షణలో అధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. పార్వతిలో మరింత ఉత్సాహాన్ని ఆనందాన్ని నింపే విధంగా ఆలయం తూర్పు గోపురం ప్రవేశ మార్గం సమీపంలోని స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. రూ. 23 లక్షల వ్యయంతో 3,500 చదరపు అడుగుల స్థలంలో ఐదు అడుగుల లోతులో స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. ఆదివారం జరిగిన పూజాది కార్యక్రమాలతో ఈ స్విమ్మింగ్ పూల్‌ను ఆర్థిక మంత్రి పళని వేల్ త్యాగరాజన్ ప్రారంభించారు. ఆలయ ఏనుగుకు ప్రత్యేకపూజలు , ఆహారం అందజేశారు. అనంతరం స్విమ్మింగ్ పూల్‌లోకి ఏనుగును పంపించారు. స్విమ్మింగ్ పూల్‌లో అటు ఇటు చక్కర్లు కొడుతూ ఆనంద తాండవంతో గజరాజు జలకాలాటలలో మునిగింది. అలాగే భక్తుల సౌకర్యార్థం రూ.కోటితో నిర్మించిన షెల్టర్‌ను మంత్రి ప్రారంభించారు.

రూ.5 కోట్ల నగల మోసం

• ఎనిమిది మంది అరెస్ట్

కొరుక్కుపేట: మదురైలోని ప్రముఖ నగల దుకాణం యజమాని వద్ద రూ. 5కోట్లతో నగలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఐదుగురు మహిళలు సహా 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మదురై సౌత్ ఎవెన్యూ మూలవీధిలో పి.ఎ స్.ఎస్. రుప్వావర్ రాంకుమార్ (41) గోల్డ్ మహల్ కాంప్లెక్స్ భవనంలో నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈయన సెల్లూరు, కరుపాయూరణి ప్రాంతానికి చెందిన చిన్న ఆభరణాల వ్యాపారులు ఇతని వద్ద వ్యాపార లావాదేవిలు జరిపేవారు. ఈ క్రమంలో రామ్‌కుమార్ వద్ద అక్టోబర్ 2022 నుంచి జనవరి 2023 వరకు నగలను కొనుగోలు చేసి డబ్బు చెల్లించలేదు. పలుమార్లు అడిగినా చెల్లించలేదు. దీంతో రామ్‌కుమార్ ఆ నగను తిరిగి ఇవ్వాలని కోరాడు. అయితే నగలు ఇచ్చేందుకు నిరాకరించారు. రూ.5 కోట్ల విలువైన నగలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడని నగల యజమాని రామ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టగా రామ్‌కుమార్‌ను మోసం చేసిన దీప(28), దీపిక (30), అన్నలక్ష్మి (49), తంగ మునీశ్వరన్ (36), జయప్రభ, దుర్గాదేవి (39), సెంద కృష్ణమూర్తి (36), మణికంఠన్ (35)లను అరెస్టు చేశారు. పోలీసులు జరిపిన విచారణలో రాంకుమార్ వద్ద కొనుగోలు చేసిన నగలను అమ్మేశారని, వచ్చిన డబ్బుతో కొత్త ఇళ్లు కట్టించుకున్నట్లు వెల్లడించారు. అరెస్టయిన 8 మంది నుంచి నగలను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేం..

కొరుక్కుపేట: మహానటుడు ఎన్టీఆర్ కారణజన్ముడని జనని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య కొనియాడారు. పెరంబూరు తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో అనన్య సామాన్య ధారావాహిక ఉపన్యాస కార్యక్రమం 97వ ప్రసంగం ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానిక పెరంబూరులోని డి.ఆర్.బి.సి. సి.సి. మహోన్నత పాఠశాల ప్రాంగణం వేదికైంది. శత జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు – శ్రీ నందమూరి తారక రాముడు అనే అంశంపై ఏర్పాటు అయిన ఈ ఉపన్యాస కార్యక్రమానికి వక్తగా గుడిమెట్ల చెన్నయ్య పాల్గొని మాట్లాడారు. సభకు పెరంబూరు తెలుగు సాహితీ సమితి అధ్యక్షులు తమ్మినేని బాబు అధ్యక్షత వహించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు

• బస్సు నడిపిన ఎస్ఐ

కొరుక్కుపేట: నామక్కల్ జిల్లా రాశిపురం కొత్త బస్‌స్టేషన్ నుంచి ఈరోడ్‌కు ఓ ప్రైవేట్ బస్సు వెళుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ బస్సు డ్రైవర్, ప్రైవేటు డ్రైవర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాశిపురం ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజన్‌సంఘటన స్థలానికి చేరుకుని ప్రభుత్వ, ప్రైవేట్ బస్సు డ్రైవర్లతో చర్చలు జరిపి ఇరువురిని బస్సు కదిలించాలని మందలించాడు. అయితే ప్రైవేట్ బస్సు డ్రైవర్ బస్సు ఎక్కేందుకు నిరాకరించాడు. దీంతో ఎస్ఐ నటరాజన్‌ప్రైవేటు బస్సును నడుపుతూ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా రాశిపురం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద బస్సును నిలిపేందుకు ప్రయత్నించగా బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఇందులో విద్యుత్ స్తంభం దెబ్బతినడంతో గంటపైగా పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలిసి ప్రైవేట్ బస్సు యాజమాని ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో కలకలం రేగింది.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

అన్నానగర్: నామక్కల్ జిల్లా పుదుచ్చత్తిరం ప్రాంతానికి చెందిన అరుణ్‌ప్రసాద్. ఈరోడ్ కలెక్టర్ కార్యాలయంలోని ట్రెజరీలో పనిచేస్తున్నాడు. ఇతని తల్లి రత్నం. ఆమె పుదుచ్చత్తిరం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ స్థితిలో వెన్నందూరుకు చెందిన కీర్తన అనే అమ్మాయితో అరుణ్ ప్రసాద్‌కు మూడు నెలల క్రితం వివాహమైంది. అప్పడినుంచి కీర్తనను అదనపు వరకట్నానికి వేధించినట్లు తెలిసింది. శనివారం పుదుచ్చత్తిరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అరుణ్‌ప్రసాద్, రత్నం వీరిద్దరిని పిలిచి రాజీ చేశారు. అయినా అప్పటి నుంచి కీర్తనను ఇంటిలోకి అనుమతించకుండా బయట నిలబెట్టారు. దీంతో మనస్తాపం చెందిన కీర్తన భర్త ఇంటి బయట కూర్చొని ధర్నాకు దిగింది.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

తిరువొత్తియూరు: కళ్లకురిచ్చి జిల్లాలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. కళ్లకురిచ్చి జిల్లాలో ఉన్న కల్వరాయన్ కొండ ప్రసిద్ధి చెందింది. దట్టమైన అటవీ ప్రాంతమైన ఇక్కడ కొందరు అక్రమంగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసులు సమాచారం అందింది. పన్నీరులోయలో గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిసింది. ఆలయం ప్రాంత ఇన్‌స్పెక్టర్ రామలింగం, పోలీసులు అక్కడికి చేరుకుని 30 సెంట్ల భూమిలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. గంజాయి సాగు చేస్తున్న అన్నామలై (32)ను పోలీసులు అరెస్టు చేశారు.

3వేల కిలోల గుట్కా స్వాధీనం

• ఇద్దరి అరెస్ట్

తిరువొత్తియూరు: కూడలూర్ మార్గంగా కేరళకు అక్రమంగా తరలిస్తున్న మూడు వేల కిలోల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీడ్రైవర్‌సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి కేరళ సరిహద్దులో ఉన్న మలుపు వద్ద ఇన్‌స్పెక్టర్ సుజామోహన్ ప్రమోద్ నేతృత్వంలో వాహన తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో కర్ణాటక నుంచి కూడలురు మార్గంగా కేరళకు వెళ్తున్నా వాహనాన్ని అడ్డుకొని తనిఖీ చేశారు. తనిఖీల్లో లారీలో బిస్కెట్ ప్యాకెట్ల మధ్య గుట్కా బండిల్స్ దాచి తీసుకుని వెళ్తున్నట్లు గుర్తించారు. తర్వాత లారీలో ఉన్న 3వేల కిలోల గుట్కా పార్సళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పాలకాడుకు చెందిన డ్రైవర్ సబిక్ (35), క్లీనర్ అబ్దుల్ రెహమాన్ (32) ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. లారీని స్వాధీనం చేసుకున్నారు.

లారీ బోల్తా..220 బాతులు మృతి



లారీని పక్కకు తొలగిస్తున్న సిబ్బంది

తిరువొత్తియూరు: డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా పడిన ఘటనలో అందులో ఉన్న 220 బాతులు మృతిచెందాయి. ఈ ఘటన నామక్కల్ జిల్లా పుదుసత్రం వద్ద కళ్ల కురిచ్చి జిల్లా నుంచి 1,200 బాతులను ఎక్కించుకున్న ఓ లారీ నామక్కల్ జిల్లా పరమత్తి వేలూరుకు వెళుతోంది. నామక్కల్ జిల్లా పుదుసత్రం వద్ద జాతీయ రోడ్డులో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో ఉన్న 220 బాతులు మృతిచెందాయి. డ్రైవర్ అజిత్ కుమార్‌కు తీవ్ర గాయమైంది. పుదుసత్రం పోలీసులు అక్కడికి చేరుకుని క్రేన్‌తో రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని పక్కకు తొలగించారు. ప్రాణాలతో ఉన్న మిగిలిన బాతులను మరో వాహనంలో ఎక్కించి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ మేస్త్రీపై దాడి

• ఐదుగురు అరెస్ట్

తిరువొత్తియూరు: భవన నిర్మాణ మేస్త్రీపై జరిగిన దాడి కేసులో ఐదుగురిని అరెస్ట్ చేశారు. చెన్నై పెరవళ్లూరు కామరాజ నగర్ ఒకటో వీధికి చెందిన శ్రీనివాసన్ (29) తాపీమేస్త్రి. ఇతను గత గురువారం దుకాణానికి వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో తిరువీకానగర్‌కు చెందిన పురా అలియాస్ విజయ్ (20) అక్కడికి వచ్చి శ్రీనివాసన్‌తో గొడవపడ్డాడు. అతనిపై దాడి చేసి వెళ్లాడు. ఆ తరువాత శుక్రవారం రాత్రి పెరవల్లూర్ గాంధీనగర్ పార్కు వద్ద శ్రీనివాసన్ నడిచి వెళ్తుండగా అక్కడికి స్నేహితులతో వచ్చిన విజయ్ మళ్లీ శ్రీనివాసన్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసన్‌ను స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. దీనిపై ఫిర్యాదు మేరకు తిరువికానగర్ పోలీసులు విజయ్, సత్య (20), పార్థిబన్ (23), ముత్తువేల్ (22), 17 ఏళ్ల బాలుడు సహా ఐదుగురిని పోలీసుల అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

దేశ భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెడుతున్న మోదీ

• ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు అపర్ణ



సభలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ ధ్వజమెత్తారు. ఐఎఫ్‌టీయూ ఏడవ జాతీయ మహాసభలు ఆదివారం తిరుపతిలో ఘనంగా ప్రారంభమయ్యా. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్రం ప్రభుత్వం కార్మికులను దగా చేస్తోందన్నారు. దేశంలోని కార్మిక వర్గాన్ని అణచివేసి, తీవ్ర ఇబ్బందులకు గురిచేసే నాలుగు లేబర్ కోడ్లకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే దేశంలో ఉద్యోగ భద్రత లేని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరగడానికి కేంద్రమే కారణమన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు సంఘాలు పెట్టుకోవడానికి, సమావేశాలు నిర్వహణకు, తమ హక్కుల సాధనకు వీలు లేకుండా బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలమైన లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశంలోని కార్మికులు, సంఘాలు ఏకమై ఐక్య పోరాటాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాన వక్త కాకతీయ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, వివక్షతకు గురైన బాధితుల గురించి అధ్యయనం చేయడమే తన సాహిత్య లక్ష్యమన్నారు. నేడు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు, వర్సిటీలు సైతం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులతో నిండిపోతున్నాయని, ఉద్యోగ భద్రత లేని జీవితాలే కనిపిస్తున్నాయన్నారు. సంపద సృష్టికి కారణమైన కార్మిక వర్గం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర వ్యతిరేక పాలనపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని అణచివేయడానికి లేబర్ కోడ్లను తెచ్చిన మోదీ ప్రభుత్వం అచ్చాదిన్ అని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

విద్యార్థి కిడ్నాప్ కేసులో మహిళ అరెస్ట్

అన్నానగర్: తిరుపూర్ సమీపంలో వెల్లకోవిల్‌కు చెందిన ప్లస్–2 విద్యార్థిని కిడ్నాప్ చేసిన యువతిని పోలీసులు ఆదివారం పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో వెల్లకోవిల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాసవనాయకన్‌పట్టికి చెందిన 24 ఏళ్ల యువతి విద్యార్థికి మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసినట్లు తేలింది. దీంతో ఆమెపై ఆదివారం పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అన్నామలైకు డీఎంకే నోటీసులు

• రూ. 500 కోట్ల నష్టపరిహారానికి డిమాండ్
• 48 గంటల గడువు

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు డీఎంకే నోటీసులు జారీ చేసింది. రూ. 500 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేసింది. 48 గంటలోపు చెల్లించని పక్షంలో సివిల్,క్రిమినల్ కేసులు తప్పదని ఆ పార్టీ సీనియర్ ఆర్ఎస్ భారతి హెచ్చరించారు. వివరాలు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై రెండు రోజుల క్రితం డీఎంకే అవినీతి అంటూ ఓ జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. 12 మంది డీఎంకే నేతలను, సీఎం స్టాలిన్‌ను ,డీఎంకే పార్టీ కార్యాలయాన్ని టార్గెట్ చేస్తూ, లక్షా 34 వేల కోట్ల అక్రమాస్తులను గడించారని ఆరోపించారు. దీనిని డీఎంకే తీవ్రంగా ఖండించింది. సీఎం స్టాలిన్‌పై ఆయన ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం సైతం తీవ్రంగా ఖండించింది. ఈ పరిస్థితుల్లో ఆదివారం రాత్రి డీఎంకే నేత ఆర్ఎస్ భారతి అన్నామలైకు నోటీసులు పంపించారు. ఆధార రహిత ఆరోపణలను గుర్తు చేస్తూ, రూ. 500 కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని ఆ నోటీసులో డిమాండ్ చేశారు. 48 గంటలు గడువు ఇస్తున్నామని, అప్పటిలోపు చెల్లించని పక్షంలో సివిల్, క్రిమినల్ కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

ఎన్నూర్ - మణలి మధ్య భారీ పెట్రోలియం పైప్‌లైన్

• కేంద్ర ప్రభుత్వం అనుమతి

కొరుక్కుపేట: ఎన్నూర్ – మణలి మధ్య 20.39 కి.మీ పొడవున పెట్రోలియం పైపులైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వివరాలు.. ఎన్నూర్ పోర్టు నుంచి మణలిలోని ఆయిల్ రిఫైనరీ వరకు పెట్రోలియం పైప్‌లైన్ వేసేందుకు పనులు చేపట్టారు. ఈ పైల్‌లైన్ ఎన్నూర్, వల్లూర్, కత్తివాక్కం, ఎర్నావూరు, మణలి, తిరువొత్తియూర్, సదయంగుప్పం వంటి గ్రామాల గుండా వెళ్తోంది. ఇందులో దాదాపు 10 కిలోమీటర్ల మేర ఎన్నూరు వాగు, చిత్తడి అడవులు, ఇసుక తిన్నెల గుండా వెళ్లాల్సి ఉంది. దీనికోసం కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ నుంచి అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంది. ఈ మేరకు గత నెలలో జరిగిన సమావేశంలో కోస్టల్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది.

ఆటోడ్రైవర్‌కు తుపాకీతో బెదిరింపు

• నిందితుడి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై పెరవళ్లూరులో అద్దె ఇవ్వడంపై ఏర్పడిన గొడవలో ఆటో డ్రైవర్‌ను తుపాకీతో బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై పెరవళ్లూరు ప్రాంతానికి చెందిన మహిళ బ్యూలా కుమారుడు జోసఫ్. ఇంటి నుంచి బయటకు వెళ్లిన బ్యూలా అదే ప్రాంతానికి చెందిన కుమార్ అనే వ్యక్తి ఆటోలో సవారీ మాట్లాడుకుని ఇంటికి వచ్చింది. అయితే సవారి చార్జీకి సంబంధించి ఆటో డ్రైవర్ కుమార్‌తో బ్యూలాకు మధ్య గొడవ ఏర్పడింది. దీని గురించి బ్యూలా ఆమె కుమారుడు జోసఫ్‌కు ఫోన్ చేసి విషయం తెలిపింది. వెంటనే అక్కడికి చేరుకున్న జోసఫ్ ఆటో డ్రైవర్ కుమార్‌ను తుపాకీతో బెదిరించాడు. దీంతో కుమార్ పెరవళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి జోసఫ్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఆ తుపాకీకి లైసెన్స్ ఉందా లేదా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎంఏ జియా ఉల్లా అన్నారు. శ్రీ కస్తూరిబా నేమి చంద్‌షా ఆర్ ముత్యాలు శెట్టి వివేకానంద విద్యాలయ జూనియర్ కళాశాల, జనకల్యాణ్ చెన్నై జిల్లా, రాయపేట ప్రభుత్వ ఆస్పత్రి , ఆర్ఎస్ఎస్ హెచ్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక పెరంబూరులోని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ ఎంఏ జియాఉల్లా , వల్లి మహాల్ అధినేత వి. శ్రీనివాసన్‌లు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 97మంది రక్తదానం చేశారు. అలాగే 12 మంది అవయవదానానికి, 25 మంది నేత్ర దానం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ కేతు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని విద్యార్థిని ఆత్మహత్య



దమయంతి (ఫైల్)

తిరువొత్తియూరు: క్రిష్ణగిరి జిల్లాలో ప్రేమ విఫలమైందని ఓ కళాశాల విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. క్రిష్ణగిరి జిల్లా నాయకనూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ (48) తాపీమేస్త్రి. ఇతని భార్య తమిళరసి పంచాయతీ మాజీ సర్పంచ్. వీరి చిన్న కుమార్తె దమయంతి (19) క్రిష్ణగిరిలో ఉన్న ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దమయంతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసి సింగారపేట పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆస్పత్రి వద్దకు చేరిన కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. విచారణలో విద్యార్థిని అదే గ్రామానికి చెందిన శ్రీనాథ్ (25) అనే యువకుడిని ప్రేమిస్తున్నట్లు, అతను ఆమెను వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించాడని, అతనిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన శ్రీనాథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

అతివేగానికి ఇద్దరు బలి

• ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదం
• ఇద్దరు యువకుల దుర్మరణం

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): ద్విచక్ర వాహనంపై అతివేగంగా ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని ఉబ్బలమడుగుకు వెళ్లే రోడ్డు మార్గంలో జరిగింది. ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై పూందమల్లి సమీపంలోని వసంతపురం ప్రాంతానికి చెందిన యువరాజు (19), విశ్వకుమార్ (17) ద్విచక్ర వాహనంపై వరదయ్యపాళెం సమీపంలోని ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి ఆదివారం ఉదయం బయలుదేరారు. మరో 10 నిమిషాల్లో పర్యాటక కేంద్రానికి చేరుకునే సమయంలో వరదయ్యపాళెం –ఉబ్బలమడుగుకు వెళ్లే అవంతిరోడ్డు మార్గంలోని గోవిందరాజు దరఖాస్తు వద్ద ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చిన రోడ్డు పక్కనే ఉన్న వినాయక స్వామి గుడిని ఢీకొట్టారు. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువరాజు, విశ్వకుమార్ తలలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం మృత దేహాలను సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆస్థానమండపంలో స్వల్ప అగ్నిప్రమాదం

తిరుమల: టీటీడీ ఆస్థాన మండపంలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఆస్థాన మండపంలోని రెండవ అంతస్తులో ఎలక్ట్రికల్ పరికరాలు, పాత పరుపులను భద్రపరిచారు. ఈ నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆ ప్రాంతంలోకి ప్రవేశించి వెళ్లిన కొంతసేపటికి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే ఆస్థాన మండపం నిర్వహణ సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. టీటీడీ ఆస్థాన మండపం కింద షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. అక్కడ పనిచేసే సిబ్బంది తరచూ ఆస్థానమండపంలోకి వస్తుండడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అక్కడి సిబ్బంది ఆరోపించారు. సంఘటనా స్థలానికి భద్రతా సిబ్బంది చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిప్రమాద నిరోధక పరికరాలు పనిచేయలేదు.

భక్తులతో కిటకిటలాడిన కాణిపాకం



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. క్యూలో ఉన్న భక్తులకు మజ్జిగ, తాగునీరు నీరు అందించారు. స్వామివారి దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది.

ఇదేం దర్యాప్తు?

భాస్కర్‌రెడ్డి అరెస్ట్‌పై భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా హోరెత్తిన నిరసన
- ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు
- నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు
- నిజాల ఆధారంగా విచారణ జరపాలని డిమాండ్


ప్రొద్దుటూరులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


కడప ఏడురోడ్ల కూడలిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కడప మేయర్ సురేష్ బాబు, పార్టీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్, కడప: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేయడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. సీబీఐ పక్షపాత ధోరణితో ఏకపక్షంగా విచారణ సాగిస్తోందని, ఇదేం దర్యాప్తు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కడపలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రాజంపేటలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సీబీఐ దిష్టిబొమ్మను దహనం చేశారు. పులివెందుల పూల అంగళ్ల సర్కిల్‌లో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అరెస్టుకు నిరసనగా నల్లకండువాలు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండుటెండలో రోడ్డుపై బైఠాయించారు. బద్వేలులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మైదుకూరులో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో ఎమ్మెల్యేలు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం

భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. వివేకా కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి కుటుంబాన్ని సీబీఐ కుట్రపూరితంగా ఇరికించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మీడియా కథనాలకు అనుగుణంగా దర్యాప్తు సాగుతోందన్నారు. సీబీఐ నిష్పక్షపాతంగా కేసును దర్యాప్తు చేయడంలో పూర్తిగా విఫలమైందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి విమర్శించారు. వివేకా, అవినాశ్‌రెడ్డి మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. అవినాశ్ గెలుపునకు వివేకా కృషి చేశారని తెలిపారు. అసలు దోషులను పట్టుకోవడంలో సీబీఐ విఫలమైందని వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.సురేష్‌బాబు మండిపడ్డారు. ఎంపీలు సీఎం రమేష్, రఘురామకృష్ణరాజు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలు.. అవినాశ్‌రెడ్డిని ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారన్నారు. భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తారని డీఎల్ రవీంద్రారెడ్డికి, ఎల్లో మీడియాకు మూడు రోజుల ముందే ఎలా తెలిసిందని ప్రశ్నించారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్రలో భాగంగానే భాస్కర్‌రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసిందని కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. బద్వేలులో నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ జీవితానికి మరక పూయాలనే కుట్రతోనే ఇదంతా జరుగుతోందని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. బెంగళూరులో సెటిల్‌మెంట్లు, సునీల్ తల్లితో అక్రమ సంబంధం, వివేకా రెండవ వివాహం, వారసత్వ సమస్యపై ఎందుకు విచారణ జరపరని ప్రశ్నించారు.


పులివెందులలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరేశలింగం పంతులు సేవలు చిరస్మరణీయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆదివారం ఆయనకు సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. 'మూఢ నమ్మకాలపై, వితంతువుల పునర్వివాహం కోసం, స్త్రీల విద్య కోసం పోరాటం చేసిన మహనీయులు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. సాహితీవేత్తగా, సంఘ సంస్కర్తగా ఆయన సేవలు చిరస్మరణీయం' అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందు

విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విజయవాడ నగరంలో పర్యటించనున్నారు. విద్యాధరపురంలోని మినీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 5.45 గంటలకు విద్యాధరపురం మినీ స్టేడియానికి సీఎం జగన్ చేరుకుంటారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంతరం రాత్రి 7.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

అనంతపురం జిల్లా నార్పల పర్యటన 26కు వాయిదా

సీఎం వైఎస్ జగన్ ఈనెల 26న అనంతపురం జిల్లా నార్పలలో పర్యటించనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 17న(సోమవారం) ముఖ్యమంత్రి నార్పలలో పర్యటించాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల ఈ పర్యటన 26వ తేదీకి వాయిదా పడింది.

'భావనపాడు'కు మూలపేట పోర్టుగా నామకరణం

ప్రజల వినతి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి/టెక్కలి: శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్టుకు మూలపేట పోర్టుగా నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోర్టుకు సంబంధిత భూములన్నీ మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లోనే ఉన్నాయి. పోర్టు ప్రతిపాదిత ప్రాంతంలో భావనపాడు లేకపోవడంతో.. స్థానికులు మూలపేట పోర్టుగా పేరు మార్చాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీంతో ఇప్పటివరకు భావనపాడు పోర్టుగా నోటిఫై అయిన ప్రాంతాన్ని.. ఇకపై మూలపేట పోర్టుగా పరిగణించాలని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ అభ్యర్థన మేరకు కోరిన వెంటనే మూలపేట పోర్టుగా నామకరణం చేయడంపై స్థానిక ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ పోర్టుకు సీఎం జగన్ ఈనెల 19న భూమి పూజ చేస్తారని కరికాల వలవన్ తెలిపారు.

తెలంగాణ

భద్రాచలంలో నూతన ఆర్జిత సేవలకు శ్రీకారం



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నూతన ఆర్జిత సేవలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వేదాశీర్వచనం కోసం భక్తులు కొనుగోలు చేసిన టికెట్లను ఈఓ రమాదేవి వారికి అందజేసి, సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తులను స్వామి వారి సేవకు మరింత చేరువ చేసేందుకే ఈ అవకాశమన్నారు. ఆలయంలో వేదాశీర్వచనం, స్వామికి తులసీమాల అలంకరణ, నిత్య సర్వ కైంకర్య సేవ, శ్రీరామనవమి ముత్యాల సమర్పణ, నిత్య పూల అలంకరణ సేవ, తులాభారం తదితర సేవలను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై త్వరలో చట్టం

సాక్షి, హైదరాబాద్: మధ్యవర్తిత్వానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం త్వరలో చట్టం చేయనుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ వెల్లడించారు. ఆ బిల్లు ఆమోదం పొంది అమల్లోకి వస్తే కేసుల పరిష్కారం వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం భారత మధ్యవర్తిత్వ దిన తొలి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ 'మధ్యవర్తిత్వం ద్వారా కేసుల్ని రాజీ చేసుకొనే విధానాన్ని అనుసరిస్తేనే ఏ దేశమైనా న్యాయ వివాదాల సత్వర పరిష్కారం ద్వారా పురోగతి సాధిస్తుంది. ఎంఎన్సీ సంస్థల నుంచి సాధారణ స్థాయి సంస్థల్లో జరిగే ఒప్పందాల్లో వివాదం ఏర్పడితే నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా తొలి దశలో మధ్యవర్తిత్వం ద్వారా ఆ వివాదం పరిష్కరించుకొనేలా ఒప్పందం ఉండాలి' అని తెలిపారు. 'హైదరాబాద్‌లో ఐఏఎంసీ ఏర్పాటును స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌లో ఆర్బిట్రేషన్-మీడియేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించింది. ఈ సెంటర్ల ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుంది. సింగపూర్ ఆర్బిట్రేషన్-మీడియేషన్ ఒప్పందంపై భారత్ 2019 ఆగస్టు 7న సంతకం చేసింది. శ్రీకృష్ణుడు కౌరవ, పాండవుల మధ్య రాయబారానికి ప్రయత్నించారు. అది విఫలం కావడంతోనే కురుక్షేత్ర యుద్ధం జరిగింది. పెను వినాశనానికి దారితీసింది. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దలు రచ్చబండ విధానం ద్వారా స్థానికంగా వివాదాల్ని పరిష్కరించే సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వ విధానానికి ఆదరణ లభిస్తోంది' అని ఆయన వివరించారు.

చోళుల కాలంలోనే 'మధ్యవర్తిత్వం'...

దేశంలో చోళుల కాలం నుంచే మధ్యవర్తిత్వ ప్రయత్నాలు సాగేవని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమాకోహ్లి తెలిపారు. 'వ్యాపార లావాదేవీల్లో వివాదాలను ఆర్బిట్రేషన్ విధానంలోనే పరిష్కరించుకొనేవారు. ఆర్బిట్రేషన్, చర్చలు, మధ్యవర్తిత్వం లోక్‌అదాలత్ ఇవన్నీ ప్రత్యామ్నాయ వివాద పరిష్కారానికి(ఏడీఆర్) విభిన్న కోణాలే. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ 2021-22 సమాచారం ప్రకారం దేశంలో 464 ఏడీఆర్ కేంద్రాలుంటే 397 పనిచేస్తున్నాయి. 570 మధ్యవర్తిత్వ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వాటిలో ఇప్పటివరకు 53 వేల కేసులు పరిష్కారం అయ్యాయి. మధ్యవర్తిత్వ బిల్లు-2021ను త్వరలోనే పార్లమెంటు ఆమోదించే అవకాశం ఉంది. నిర్దిష్ట గడువులోగా మీడియేషన్ ప్రక్రియ పూర్తి (180 రోజుల్లో పూర్తి చేయాలి. లేనిపక్షంలో మరో 180 రోజులు పొడిగింపు), మధ్యవర్తుల నమోదుకు జాతీయ స్థాయిలో మధ్యవర్తిత్వ మండలి ఏర్పాటు, మధ్యవర్తిత్వ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నాక ఉభయ పార్టీలు అందుకు కట్టుబడి ఉండాలి. మధ్యవర్తిత్వ వ్యవహారాలన్నీ గోప్యంగా ఉంచడం వంటివి ప్రతిపాదిత బిల్లులో కీలకాంశాలు. కోవిడ్ లాక్‌డౌన్ వేళ ఏడీఆర్ అమల్లో స్పష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అవి ఆన్‌లైన్ వివాద పరిష్కార దిశగా కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడ్డాయి' అని పేర్కొన్నారు.

33 కేసుల పరిష్కారం...

ఐఏఎంసీ ఇప్పటివరకు 33 కేసుల్ని పరిష్కరించిందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఆర్బిట్రేషన్ ద్వారా పది కేసులు, మీడియేషన్ ద్వారా 23 కేసుల్లో మొత్తం 700 బిలియన్ డాలర్ల విలువైన వివాదాలు పరిష్కారమయ్యాయని వివరించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఐఏఎంసీ సీఈవో జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, సింగపూర్ ఐఏఎంసీ చైర్మన్ జార్జి లిమ్ కూడా ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి మృతి

▶ మొదటి పేజీ తరువాయి

వచ్చారు. ఈ క్రమంలో 2004లో కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నీరజారెడ్డికి అవకాశం కల్పించారు. అప్పట్లో ఈమె పీఆర్పీ అభ్యర్థి జయరాంపై 5 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె ఆలూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈమె కూతురు హిమవర్షిణి తన భర్తతో కలిసి అమెరికాలో స్థిరపడ్డారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదని పేర్కొంది. దేశంలో వైద్య విద్యార్థుల వృత్తిపరమైన బాధ్యతలపై ఎన్ఎంసీ తాజాగా మార్గదర్శకాలను జారీచేసింది. వైద్య విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఈ అంశాలు కీలకమని పేర్కొంది. వైద్య విద్యార్థులు రోగులతో సమర్థవంతంగా మాట్లాడటానికి స్థానిక భాష నేర్చుకోవాలని కోరింది. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, వైద్యారోగ్య అత్యవసర పరిస్థితుల వంటి సందర్భాల్లో వీలైనంత సాయం చేయాలని సూచించింది.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

కేవలం చికిత్సకే పరిమితం కాకుండా వైద్యారోగ్య వ్యవస్థపై నమ్మకం కలిగేలా రోగి-వైద్యుడి సంబంధం ఉండాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని.. జాతీయ ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించింది. కేవలం పుస్తకాల నుంచే మాత్రమే కాకుండా అధ్యాపకుల అపార అనుభవం, ఆచరణాత్మక బోధన నుంచి నేర్చుకోవాలని పేర్కొంది. విద్యార్థులు ప్రాక్టికల్ రికార్డులు, కేస్‌షీట్లను శ్రద్ధగా నిర్వహించాలని.. కాపీ చేయడం, తారుమారు చేయడం వంటివి చేస్తే తగిన చర్యలు చేపడతామని హెచ్చరించింది.

అభాగ్యులపై 'వాత్సల్యం'


మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ

- నెలకు రూ.4 వేలు అందజేత
- గతేడాది 371 మందికి సాయం
- ఈ ఏడాది 6,315 మంది దరఖాస్తు

భీమవరం(ప్రకాశం చౌక్): అనాథలు, అభాగ్యులుగా మారిన 6 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం భరోసాగా మారింది. ఈ పథకం కింద నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదిపాటి ఆర్థిక సాయం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,400, కేంద్ర ప్రభుత్వం రూ.2,600 చొప్పున భరిస్తున్నాయి. ఓ పక్క ఉచితంగా చదువును అందిస్తూ మరోపక్క ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా అభాగ్యులైన బాలలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు.

లబ్ధిదారులు ఎవరంటే..

- తల్లితండ్రులు కోల్పోయిన, తల్లితండ్రులు దూరమైన పిల్లలు.
- పాక్షిక అనాథలైన (తల్లి లేక తండ్రి కోల్పోయిన), విడాకులు పొందిన తల్లితండ్రులు ఉన్న పిల్లలు.
- కుటుంబాన్ని వదిలివేసిన, తల్లితండ్రులు ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడిన వారి పిల్లలు.
- పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలు
- బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలు
- ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు.
- అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచికులు
- బాల్యవివాహ బాధితులు, హెచ్ఐవీ బాధిత, దివ్యాంగులు తదితర పిల్లలు.

గతేడాది రూ.1.78 కోట్లు అందజేత

మిషన్ వాత్సల్య పథకం ద్వారా గతేడాది పశ్చిమగోదావరి జిల్లాలో 371 మంది పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున రూ.1.78 కోట్లు అందించారు. ఈ ఏడాది 6,315 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను మండల స్థాయి స్క్రూటినీ కమిటీ సభ్యులు తహసీల్దార్, ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ ఎంఈవో, సీడీపీఓ, సూపర్‌వైజర్ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి నెలకు రూ.4 వేల చొప్పున 12 నెలలపాటు ఆర్థిక సాయం అందిస్తారు. గతేడాది లబ్ధిదారులను రెన్యూవల్ చేయడంతో పాటు కొత్తవారితో పాటు వారికి కూడా ఆర్థిక సాయం అందిస్తారు. ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగిసింది.

ప్రతినెలా ఆర్థిక సాయం



మా నాన్న కోవిడ్ కారణంగా చనిపోయారు. నన్ను మా అమ్మ చూసుకుంటోంది. మిషన్ వాత్సల్య పథకం ద్వారా నాకు ప్రతి నెలా ఆర్థిక సాయం అందుతోంది. ఈ పథకం తల్లితండ్రులు లేని పిల్లలకు భరోసాగా ఉంది. అభాగ్యులైన పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించడం మంచి కార్యక్రమం. – పట్నాల శ్రీవాణి, విద్యార్థిని, 18 వార్డు, భీమవరం

6,315 దరఖాస్తులు



మిషన్ వాత్సల్య పథకం అర్హులు గతేడాది 371 మంది కాగా రెన్యూవల్‌తో కలుపుకుని ఈ ఏడాది 6,315 దరఖాస్తులు వచ్చాయి. వాటిని మండల స్క్రూటినీ కమిటీ పరిశీలన తుది అర్హుల జాబితా ఎంపిక చేస్తారు. ఏడాది పాటు లబ్ధిదారులకు నెలకి రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. – బి.సుజాత రాణి మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ, భీమవరం

24,318 సంఘాలు.. రూ.912 కోట్ల రుణాలు

మహిళలను మహరాణులుగా మార్చాలని జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కంకణం కట్టుకుంది. అందుకనుగుణంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను విరివిగా అందజేస్తోంది. తద్వారా మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ పడుతోంది. ఆ దిశగా చేపట్టిన చర్యలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయి. మహిళలు తమ కుటుంబాలకు ఆసరాగా నిలబడుతూ ముందుకు సాగుతున్నారు.


స్వయం సహాయక సంఘాల మహిళలు

నెల్లిమర్ల: రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను విరివిగా మంజూరు చేస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 24,318 సంఘాలకు రూ.912 కోట్లు రుణాలుగా అందజేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలతో మహిళలు వ్యాపారాలను, కుటీర పరిశ్రమలను ప్రారంభించారు. తద్వారా అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణాల మొత్తాన్ని రూ.వెయ్యి కోట్లు దాటించాలని డీఆర్‌డీఏ- వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 1038 గ్రామైక్య సంఘాలు, 39,997 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఆయా సంఘాల్లో 4.5 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు విరివిగా బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 24,216 సంఘాలకు రూ.908 కోట్లు మంజూరు చేసింది. 2022 - 23 సంవత్సరంలో 24,318 సంఘాలకు రూ.912 కోట్లు రుణాలుగా అందజేసింది. ఒక్కో సంఘానికి కనిష్ఠంగా రూ.50వేలు, గరిష్ఠంగా రూ.20 లక్షలు రుణాలుగా మంజూరు చేసింది. ముందు తీసుకున్న రుణాలు, పొదుపు మొత్తాల ఆధారంగా అర్హత కలిగిన ప్రతి సంఘానికి అధిక మొత్తంలో రుణాలను ప్రభుత్వం అందజేసింది. బ్యాంకుల నుంచి సంఘాలు తీసుకున్న రుణాల్లో రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ అమలవుతున్న విషయం తెలిసిందే. రూ.3 లక్షల కంటే ఎక్కువ మొత్తాలను తీసుకుంటే ఏడాదికి 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలతో పాన్ షాపులు, జెరాక్స్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, పశువుల, గొర్రెల డెయిరీలు తదితర వ్యాపార, కుటీర పరిశ్రమలను ప్రారంభించారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాల ద్వారా జిల్లాలోని మహిళల జీవన ప్రమాణాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి.

2022 - 23లో స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు

- ఈ ఏడాది రూ.వెయ్యి కోట్లు పైబడి లక్ష్యం
- రుణాలతో అభివృద్ధి పథంలో డ్వాక్రా మహిళలు

జిల్లా: విజయనగరం
స్వయం సహాయక సంఘాలు: 39,997
సంఘాల్లో మహిళల సంఖ్య: 4.5 లక్షలు
2022 - 23లో మంజూరు చేసిన రుణాలు: రూ.912 కోట్లు
రుణాలు తీసుకున్న సంఘాలు: 24,318

రూ.912 కోట్లు రుణాలుగా అందజేశాం

2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 24,318 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశాం. రూ.912 కోట్లు రుణాలుగా మంజూరు చేశాం. ఈ ఏడాది రూ.వెయ్యి కోట్లకు పైగా మొత్తాన్ని రుణాలుగా అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా రుణాల మంజూరు ఇప్పటికే ప్రారంభించాం. రుణాలు తీసుకునే మహిళలు సద్వినియోగం చేసుకుని, జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలి. – ఎ.కల్యాణచక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ

రుణంతో స్వయం ఉపాధి


రుణంతో కొనుగోలు చేసిన ఆవుతో దేవి

ఈ ఫోటోలోని మహిళ పేరు సాడి దేవి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన మీనాక్షి స్వయం సహాయక సంఘం సభ్యురాలు. ఈ సంఘానికి గతేడాది రూ.18 లక్షలు రుణం మంజూరైంది. తీసుకున్న రుణంతో దేవి ఆవును కొనుగోలు చేసి, తద్వారా జీవనోపాధిని పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ రుణం తనకు ఎంతగానో ఉపయోగపడిందని చెబుతున్నారు.


రుణంతో ప్రారంభించిన పాన్ షాపులో భారతి

ఈ ఫోటోలోని మహిళ పేరు కెల్ల భారతి. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామం మజ్జి గౌరి స్వయం సహాయక సంఘానికి చెందిన ఈమె రూ.75 వేలు బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నారు. ఆ రుణంతో గ్రామంలోనే పాన్ షాపు ప్రారంభించారు. తద్వారా ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ రుణం తన స్వయం ఉపాధికి ఉపయోగపడిందని భారతి సంతోషం వ్యక్తం చేశారు.

తిరుపతి వెంకన్న అండతో.. 5 జిల్లాల్లో 429 ఆలయాల నిర్మాణం

- ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- నిధులు సమకూర్చిన టీటీడీ శ్రీ వాణి ట్రస్టు
- ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షలు

మహారాణిపేట: హిందూ ఆలయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించాలని, తద్వారా ప్రజల్లో భక్తిభావం పెంపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు, మత్స్యకార కాలనీల్లో ఆలయాలు నిర్మించడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ నిర్మాణాలకయ్యే నిధులను తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్టు ద్వారా సమకూరుస్తోంది. ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవదాయశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యవేక్షణలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 429 ఆలయాల నిర్మిస్తున్నారు. తిరుపతి శ్రీ వాణి ట్రస్టు నిధులు మంజూరు చేయడంతో ఆలయాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

సన్నిధి



మంచి మాట

ఏదో.. ఏవో అనుకుంటూ...

అనుకోవడం అనేది ప్రతి వ్యక్తికీ ఉండే లక్షణమే. అనుకోవడం అన్న లక్షణం లేని మనుషులు ఉండరు. అయితే మనలో పలువురికి ఏం అనుకుంటున్నాం, ఎందుకు అనుకుంటున్నాం, అనుకునేది సరైందేనా? వంటి వాటిపై ఉండాల్సిన పరిణతి, కచ్చితత్వం ఉండవు. ఈ తీరు పలు సమస్యలకు మూలం అవుతోంది.

ఒక పున్నమి రాత్రిలో తిక్క లోడు ఒకడు దారి వెంబడి నడుస్తూ పోతున్నాడు. కాసేపయ్యాక సేదతీరడం కోసం ఓ చెట్టు కింద నుంచున్నాడు. ఆ చెట్టుకు దగ్గరలో ఓ పెద్ద బావి కనిపిస్తే ఆ బావిలోకి తొంగి చూశాడు. ఆ బావి నీళ్లలో జాబిల్లి ప్రతిబింబం కనిపించింది. జాబిల్లి బావిలో పడిపోయింది అని అనుకున్నాడు. అయ్యో ఇప్పుడు నేనేం చెయ్యగలను? ఎలా ఈ జాబిల్లిని కాపాడగలను? ఇక్కడెవరూ లేరే, ఇప్పుడు ఈ జాబిల్లిని నేను కాపాడకపోతే అది చచ్చిపోతుంది కదా అని అనుకున్నాడు. అంతటితో ఊరుకోలేదు. అక్కడా ఇక్కడా వెతికి ఓ తాడును తీసుకుని దాన్ని బావిలోకి విసిరేశాడు జాబిల్లిని ఆ తాడుతో కట్టి బయటకు తియ్యొచ్చని అనుకుని. ఆ బావిలో ఏదో ఓ రాయికి ఆ తాడు చిక్కుకుపోయింది. ఆ వ్యక్తి చాలబలంగా ఆ తాడును లాగాడు. కానీ రాయికి చిక్కుకుపోయిన తాడు రాలేదు. జాబిల్లి చాల బరువుగా ఉందే, పైగా నేనిక్కడ ఒంటరిగా ఉన్నానే, నేనెలా జాబిల్లిని బయటకు తియ్యగలను? ఈ జాబిల్లి ఎప్పటి నుండి ఈ బావిలో ఉందో తెలియడం లేదు, జాబిల్లి అసలు బతికి ఉందా, చచ్చిపోయిందా కూడా తెలియడం లేదు అని అనుకుంటూ ఆ వ్యక్తి తాడును బలంగా లాగుతున్నాడు. అలా లాగుతూ ఉండగా ఆ తాడు తెగిపోయి అతడు వెల్లకిలా నేలపై పడిపోయాడు. పడిపోవడంవల్ల అతడి కళ్లు మూసుకుపోయాయి. తలకు దెబ్బ తగిలింది. కొద్దిసేపు తరువాత అతడు కళ్లు తెరిచినప్పుడు జాబిల్లి ఆకాశంలో కనిపించింది. దాన్ని చూసి తను జాబిల్లిని కాపాడేశాడనీ, తనకు మాత్రమే కొంచెం దెబ్బ తగిలిందనీ అయినా పరవాలేదనీ తనవల్ల జాబిల్లి కాపాడబడిందనీ తనకు తాను చెప్పుకున్నాడు. ఆ వ్యక్తిని చూసి మనం నవ్వుకుంటాం.

ఒక సందర్భంలో ఓషో చెప్పిన కథ ఇది.

కథలోని వ్యక్తి ఎక్కడ తప్పు చేశాడు? అతడు తన తత్త్వంతో ఏదో అనుకున్నాడు. ఆ అనుకున్నది సరికాదు. మనం కూడా ఇలాగే ఏదో, ఏవో అనుకుంటూ ఉంటాం. చాలసందర్భాల్లో మనం అనుకునేవి సరైనవి కావు. ఈ తీరు మన సమస్యల్లో ప్రధానమైంది.

అనుకోవడానికి అతీతంగా మనం బతకగలం అన్న చింతన కూడా మనలో చాలమందికి లేదు. ఎప్పుడూ ఏదో ఒకటి అనుకుంటూ ఉండాల్సిందే అన్న స్థితిలో మనం కొట్టుమిట్టాడుతున్నాం. తిక్కవ్యక్తి, జాబిల్లి బావిలో పడిపోయిన ఈ కథలాగానే మానవజాతి మొత్తం ఇలాంటి సమస్యలో ఇరుక్కుపోయి ఉంది. ఈ ప్రపంచమంతా ఈ సమస్య ఉంది అని అంటారు ఓషో.

దేన్నో అనుకుంటూ ఉండడమూ, దేన్ని పడితే దాన్ని అనుకుంటూ ఉండడమూ మనలోని సమస్యలు మాత్రమే కాదు మనం దిద్దుకోవాల్సిన తప్పులు. అభిప్రాయపడడంలాగా అనుకోవడం కూడా మనుషుల రుగ్మతే; కాకపోతే బలమైన బలహీనత.

ఏదో, ఏవో అనుకుంటూ ఉండడంవల్ల మనుషులకు నష్టం, కష్టం, హాని కలుగుతూ ఉంటాయి. ఏదో, ఏవో అనుకుంటూ ఉండడం కాదు పరిస్థితులు, సంఘటనలపై సమగ్రమైన, సరైన అవగాహనను పొందేందుకు పూనుకోవాలి. అలాంటి అవగాహన మాత్రమే మనకు కావాల్సిన మేలు చేస్తుంది.


– రోచిష్మాన్

గురువాణి

అది మాట కాదు.. మంత్రం

సత్యమేవజయతే!... వేదాల చివరి భాగాలయిన ఉపనిషత్తులలో చివరిదయిన ముండకోపనిషత్తులోని ఒక మంత్రం ఇది. అర్థం – సత్యము మాత్రమే జయాన్ని పొందుతుంది..అని. లోకంలో అసత్యం మొదట్లో గొప్పగా ఆకర్షిస్తూ, ప్రచారాన్ని పొందినా సత్యం ముందు నిలబడలేదు. దీనిని నమ్మిన వారు ఓడిపోవడం అన్నమాట ఉండదు. సత్యాన్ని అనుష్ఠించినవారు శాశ్వతులవుతారు.

రామాయణంలో రామచంద్రమూర్తి అంటారు..''సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా/సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరంపదమ్''..అని. లోకాలన్నీ సత్యాన్ని ఆశ్రయించి ఉన్నాయి. మన దేశ రాజముద్రలో కనిపించే సింహాల కింద 'సత్యమేవజయతే' అని రాసి ఉంటుంది. మన మౌలిక సిద్ధాంతం సత్యాన్ని అనుష్ఠించడం. సత్యం కన్నా మరింత గొప్పది అంటూ ఏదీ లేదు. మన దేశంలో మహాత్ములుగా వెలిగిన ఎందరో సత్యాన్ని అనుష్ఠించాలని జీవితాంతం తాపత్రయపడ్డారు.



సత్యం అంటే మాట్లాడడం ఒక్కటే కాదు, తాను ఏది నమ్మాడో, ఏది మాట్లాడుతున్నాడో, ఏది చేస్తున్నాడో మూడూ ఒక్కటై ఉండడం. పైకి ఒకటి, దానికి భిన్నంగా మరొకటి చేస్తూ, మనసులో వేరొకటి పెట్టుకుని ఉంటే దానిని దంభం అంటారు. త్రికరణములు ఏకత్వాన్ని పొంది ఉంటే, ఒకే సరళరేఖలో ఉంటే దాన్ని సత్యం అంటారు. ఆ సత్యమే ఈశ్వరుడు. ధర్మాన్ని నిరంతరం పట్టుకుని సత్యంలోకి ప్రవేశిస్తే ఈశ్వరుడి అనుగ్రహం కలుగుతుంది.

భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీ కూడా అహింస, సత్యం అనే రెండింటిని ఆయుధాలుగా చేసుకొని పోరాడారు. ఆయన కేవలం సత్యాన్ని ప్రబోధించి ఊరుకోలేదు. స్వయంగా అనుష్ఠించి చూపారు. ఆయన కారాగారంలో ఉన్న సమయంలో ఆయన ఖర్చులకు గాను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ప్రతి నెలా రు.200 లు ఇచ్చేది. కానీ ఆయన తనకు నెల ఖర్చు రు.35లు మాత్రమేనని చెబుతూ మిగిలినది ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసారు. అలా తిరిగిచ్చే బదులు దానిని ఉద్యమానికి వాడుకోవచ్చు కదా.. అని తదనంతరకాలంలో ఎవరో అడిగారు. దానికి ఆయన ''ప్రభుత్వం నాకు ఆ సొమ్ము ఇచ్చిన ప్రయోజనం వేరు. పరాయి ప్రభుత్వం ఇచ్చిన ఆ సొమ్మును మన ఉద్యమానికి ఎలా వాడుకుంటాం? అందుకే తిరిగిచ్చేసాను'' అన్నారు.

ఒకటి కాదు, రెండూ కాదు...అడుగడుగునా ఆయన సత్యాన్ని నిష్ఠగా పాటించడానికి తన జీవితంమీదే ఆయన ఎన్నో ప్రయోగాలు చేసుకున్నారు. అంతటి పారదర్శకత, అంతటి నిబద్ధత, అంతటి స్వచ్ఛత ఉండబట్టే వారి మాటలు కోట్లాదిమందికి శాసనాలయ్యాయి. అహింస, సత్యం .. అనే ఈ రెండు సిద్ధాంతాలనే ఆయుధాలుగా చేసి పోరాడి విజయం సాధించారు. ఈ సిద్ధాంత వైభవం చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది.




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సత్యం ఎక్కడ ఉందో అక్కడ గెలుపుంటుంది. ఎవరు చెప్పినా సత్యాన్నే ఆశ్రయించి బతకాలంటారు. మాట చిన్నదే కానీ అది శక్తిమంతమైన మంత్రం. వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేస్తుంది, జన సమూహాలను, చివరకు ప్రభుత్వాలను కూడా ప్రభావితం చేయగలిగే శక్తి దానికుంది.

బౌద్ధవాణి

చేవ గల సందేశం

చదవడం అంటే అక్షరాలను గుర్తించడం కాదు. వాటి సారాన్ని గ్రహించడం. ఆ 'సారాన్ని' గుర్తించడం, గ్రోలడమే చదువు. అలాంటి చదువు వల్ల మనస్సు వికసిస్తుంది. బుద్ధి ప్రకాశిస్తుంది. బతుకు సారవంతమవుతుంది. ఆ సారాన్ని వెదుక్కుంటూ వచ్చాడు. పింగళుడు అనే పండితుడు బుద్ధుని దగ్గరకు.



భగవాన్ బుద్ధుడు అప్పుడు శ్రావస్తి సమీపంలోని అనాథ పిండకుని జేతవనంలో ఉన్నాడు. ఆ సమయంలో ఆరుగురు మహా తాత్వికులు ఉండేవారు. ఒక్కొక్కరు ఒక్కో సిద్ధాంతాన్ని చెప్పారు. పరిపూర్ణ జ్ఞానానికి తమదే సరైన మార్గమని ఎవరికి వారు ప్రబోధించే వారు. విడివిడిగా వింటున్నప్పుడు దేనికదే బాగుంది, సమగ్రంగా ఉందీ అనిపించేది పింగళునికి. తనకు తాను ఎటూ తేల్చుకోలేకపోయాడు. ఎంతటి జఠిలమైన సమస్యనైనా తేలికగా, అర్థం అయ్యేలా తీర్చగల నేర్పరి బుద్ధుడే అని నిర్ణయించుకున్నాడు. జేతవనానికి వచ్చాడు. తన అనుమానాలు వెళ్లబుచ్చాడు.

అప్పుడు బుద్ధుడు...

''పింగళా! ఒకడు చేవగల చెట్టుకోసం వనానికి వచ్చాడు. అక్కడ ఓ పెద్ద చెట్టు కన్పించింది. దాని కొమ్మలు చాలాదూరం విస్తరించి ఉన్నాయి. ఈ కొమ్మలు చాలా బలమైనవి, చేవగలిగినవి. కాబట్టి ఇవి గట్టిగా విస్తరించాయి'' అనుకున్నాడు. వెంటనే ఆ కొమ్మల్ని నరుక్కుని వెళ్ళాడు.

''చేవగల చెట్టును తెచ్చాను''. అంటూ సంబరపడ్డాడు. అప్పుడు అతణ్ణి చూసినవారు– ''ఇతడు ఒట్టి అమాయకుడు. అజ్ఞాని. చేవగల చెట్టు కాండాన్ని వదిలిపెట్టి, కేవలం కొమ్మలు కొట్టుకు తెచ్చి ''ఇదే చేవ.. ఇదే చేవ'' అనుకుంటున్నాడు. నిజానికి అతనికి చేవ అంటే ఏమిటో తెలియదు'' అనుకున్నారు.

''అలాగే పింగళా! సర్వం త్యజించి, ప్రవ్రజించిన కొందరు కీర్తినీ లాభ సత్కారాలనీ పొందుతారు. వాటికి సంతోష పడతారు. తమ సంకల్పం నెరవేరింది అనుకుంటారు. తమను తామే పొగుడుకుంటారు. ఇతరుల్ని నిందిస్తారు. తమకు తప్ప ఇతరులకు ఏమీ తెలియదని విర్రవీగుతారు. అసలైన జ్ఞానం అంటే ఏమిటో, ధ్యానం అనేది ఎందుకో, సన్యసించడం దేనికోసమో అంతిమంగా దేన్ని సాధించాలో ఎప్పటికీ తెలుసుకోలేరు. ఇలాంటి సన్యాసులు, యోగులు, భిక్షువులు చేవ కోసం ప్రయత్నించి ఆకులు కొమ్మలు తెచ్చుకునే అజ్ఞానులు'' అని చెప్పాడు.

పింగళుని వదనం విప్పారింది. అతని ముఖంలో సంశయ రేఖలు తొలగిపోతున్నాయి. మిగిలిన అనుమానాలూ అడిగాడు...

''పింగళా! మరొకడు చేవ కోసం వెళ్ళి చెట్టుపై బెరడునే చేవగా భావిస్తాడు. ఇంకొకరు లోపలి బెరడునే చేవగా భావిస్తారు. వేరొకరు దాని వెనుక ఉన్న తెల్లటి గుజ్జునే చేవగా భావిస్తారు. వీరంతా అదే చేవ అనుకుంటారు. అదే బలమైందిగా భావిస్తారు. వాదిస్తారు. కానీ నిజమైన చేవ పై బెరడుకీ, లోపల బెరడుకీ, గుజ్జుకీ వీటన్నింటి కంటే లోపల ఉంటుంది. జ్ఞాన దర్శనం కూడా అలాంటిదే! నిజమైన పరిత్యాగి ఈ పై పై విషయాలతో సరిపుచ్చుకోడు. అంతవరకే చాలు అనుకోడు.'' అన్నాడు.

''అంటే... భగవాన్'' అని వినయంగా నమస్కరిస్తూ అడిగాడు పింగళుడు.

''పింగళా! నిజమైన బ్రహ్మచర్యం ప్రవ్రజ్య (కీర్తి) కోసం కాదు. లాభసత్కారాల కోసం కాదు. శీల సంపద కోసమూ కాదు. సమాధి (ఏకాగ్రత) కోసమూ కాదు. జ్ఞానం కోసం కూడా కాదు. చిత్త విముక్తి కోసమే! చిత్తం నుండి సర్వ మలినాల్ని వదిలించుకోవడం కోసమే. చిత్త విముక్తిని సాధించేదే నిజమైన బ్రహ్మచర్యం'' అన్నాడు.

అంతిమ గమ్యానికి బయలుదేరిన వారు కొందరు కొంత దూరం మాత్రమే పోగలరు. ఇంకొందరు మరికొంత దూరం పోగలరు. వేరొకరు దారి తప్పగలరు. ఏ కొందరో సరైన దారిలో ప్రయాణం చేసి గమ్యం చేరుకోగలరు. కాబట్టి అదే పరిపూర్ణ ప్రయత్నం. సరైన ప్రయత్నం. ఆ సరైన మార్గాన్ని ఇన్నాళ్ళకు దర్శించాను'' అనుకుని– సగౌరవంతో శిరస్సు వంచి బుద్ధునికి ప్రణమిల్లాడు పింగళుడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

ఇంతకన్నా మెరుగైన చేతులు ఏముంటాయి?



● హ్యారీ కోనిగ్, మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు సినిమా షూటింగ్‌లతో ఎంతో బిజీగా ఉంటారు. అయితే ఏ మాత్రం కొంచెం సమయం దొరికినా కుటుంబంతో వెకేషన్‌కు వెళుతుంటారు. అక్కడి ఫొటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటారు మహేశ్ బాబు. వెకేషన్‌లో భాగంగా భార్య నమ్రతా శిరోద్కర్, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి వారం రోజులుగా జర్మనీలో ఎంజాయ్ చేస్తున్నారాయన. అయితే తాజాగా మహేశ్ బాబు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఓ పోస్ట్ ఆయన అభిమానులను కలవరపెడుతోంది. డాక్టర్ హ్యారీ కోనిగ్‌తో దిగిన ఓ ఫోటోను షేర్ చేసి, 'థ్యాంక్యూ డాక్టర్ హ్యారీ కోనిగ్.. ఆరోగ్యం బాగుండటానికి ఇంతకన్నా మెరుగైన చేతులు ఏముంటాయి(డాక్టర్‌ని ఉద్దేశించి)' అంటూ పోస్ట్ చేశారు. దీంతో ఆయనకు ఏమైంది? అంటూ నెట్టింట చర్చ మొదలైంది. అయితే హ్యారీ కోనిగ్ ప్రముఖ నేచురోపతి డాక్టర్. ఆయన ఆధ్వర్యంలో మహేశ్ గత కొన్నాళ్లుగా చికిత్స తీసుకుంటున్నారట. పైగా జర్మనీలో మహేశ్ బాబు ఉంటున్న బ్రెన్నర్స్ పార్క్ హోటల్‌లో నేచురోపతి వైద్య విభాగానికి హ్యారీ కోనిగ్ అధిపతిగా ఉన్నారట. అందుకే మహేశ్ బాబు– హ్యారీ కోనిగ్ క్యాజువల్‌గా కలిసి, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై చర్చించుకున్నారని, దీనిపై కంగారు పడాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. కాగా జర్మనీ నుంచి ఇండియాకి వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు మహేశ్‌బాబు.

బాలీవుడ్ అశ్వత్థామ ఎవరు?



● అల్లు అర్జున్ ● ఎన్టీఆర్

మహాభారతం ఆధారంగా బాలీవుడ్‌లో 'ది ఇమ్మోర్టల్ అశ్వత్థామ' అనే మైథలాజికల్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' ఫేమ్ దర్శకుడు ఆదిత్యా ధార్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ మూవీలో హీరోగా తొలుత విక్కీకౌశల్, రీసెంట్‌గా రణ్‌వీర్ సింగ్ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా టాలీవుడ్ హీరోలు ఎన్టీఆర్, అల్లు అర్జున్ పేర్లను మేకర్స్ పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్. వారిద్దరిలో ఎవరో ఒకర్ని హీరోగా తీసుకునేందుకు పరిశీలిస్తున్నారా? లేక ఇద్దర్నీ ఈ సినిమాలో నటింపచేసేలా సంప్రదింపులు జరుపుతున్నారా? అనే విషయంపై ఓ స్పష్టత రావాల్సి ఉంది. రోనీ స్క్రూవాలా నిర్మించనున్న ఈ సినిమాను ఇటీవల జీ స్టూడియో టేకోవర్ చేసిందని బీటౌన్‌లో ప్రచారం సాగుతోంది. అదేవిధంగా ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు సమంత పేరు పరిశీలనలో ఉన్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. మరి.. 'ది ఇమ్మోర్టల్ అశ్వత్థామ' చిత్రంలో ఫైనల్‌గా ఎవరు హీరోగా నటిస్తారు? అనే విషయంపై ఓ క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

పరాక్రమవంతుడు



● సూర్య

సూర్య, దిశా పటానీ జంటగా, యోగిబాబు కీలక పాత్రలో శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై వంశీ, ప్రమోద్‌లతో కలిసి జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ సినిమాకు 'కంగువ' అనే టైటిల్‌ను ఖరారు చేసి, వచ్చే ఏడాది ప్రారంభంలో సినిమాని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ శివ మాట్లాడుతూ–''ఈ సినిమాలో సూర్య గంభీరంగా కనిపిస్తారు. 'కంగువ' మాకు ఎంతో ప్రత్యేకమైన చిత్రం. షూటింగ్‌ను పూర్తి చేసి, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు. ''త్రీడీలో పది భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాకు అన్ని భాషల ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేలా కామన్ టైటిల్ పెట్టాల్సి వచ్చింది. అందుకే అన్ని భాషల్లో 'కంగువ' టైటిల్‌ను ఫిక్స్ చేశాం. కంగువ అంటే అగ్నిశక్తి ఉన్న వ్యక్తి, పరాక్రమవంతుడు అనే అర్థాలు వస్తాయి. ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయ్యింది. మరో నెలలో బ్యాలన్స్ షూటింగ్ పూర్తి చేస్తాం. గ్రాఫిక్స్ వర్క్ ఎక్కువగా చేయాల్సి ఉంది.. దీంతో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు ఎక్కువ సమయం పడుతుంది. అందుకే 2024 ప్రారంభంలో ఈ సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం''అని చిత్రయూనిట్ పేర్కొంది.

దేశభక్తి చిత్రాలను ఆదరించాలి

– వెంకయ్యనాయుడు

''దేశ సమైక్యత, భారతీయ సైనికుల వీరగాథ గురించి 'భారతీయన్స్' వంటి సినిమా తీయడం అభినందనీయం. ఇలాంటి మంచి దేశభక్తి చిత్రాలను యువత, ప్రేక్షకులు ఆదరించాలి'' అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. నీరోజ్ పుచ్చా, సోనమ్ టెండప్, సుభా రంజన్, మహేందర్ బర్గాస్ హీరోలుగా, సమైరా సందు, రాజేశ్వరి చక్రవర్తి, పెడెన్ నాంగ్యాల్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భారతీయన్స్'. రచయిత దీన్ రాజ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారత్– అమెరికన్ క్రియేషన్స్‌పై డా.శంకర్ నాయుడు అడుసుమిల్లి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీమియర్‌ని వెంకయ్య నాయుడు వీక్షించి, యూనిట్‌ని అభినందించారు. డా.శంకర్ నాయుడు అడుసుమిల్లి మాట్లాడుతూ– ''భారతీయుల గుండెల్లో ఉన్న ఫిలాసఫీని 'భారతీయన్స్' ద్వారా గుర్తు చేస్తున్నాం. మే నెలలో అన్ని భాషల్లో సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. ''ప్రతి ఒక్కరిలో దేశ భక్తిని పెంపొందించే చిత్రమిది'' అన్నారు దీనరాజ్. తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, నీరోజ్, సమైరా సందు తదితరులు మాట్లాడారు. ఈ సినిమాకు కెమెరా:జయపాల్ రెడ్డి నిమ్మల, సంగీతం: సత్య కశ్యప్– కపిల్ కుమార్.



● శంకర్, వెంకయ్య నాయుడు, దీన్ రాజ్

కాంబినేషన్ సెట్?



● దుల్కర్ సల్మాన్

'మహానటి', 'సీతారామం' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. అయితే ఆయన మరో సారి తెలుగులో ఓ స్ట్రయిట్ ఫిల్మ్ చేసేందుకు చర్చలు జరుగుతున్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇటీవల 'సార్'(తమిళంలో 'వాతి')తో హిట్ అందుకున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ఆయన తర్వాతి సినిమాలో దుల్కర్ హీరోగా నటిస్తారని టాక్. సితార ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. 'కింగ్ ఆఫ్ కోతా' చిత్రం షూటింగ్ పూర్తయిన తర్వాతే దుల్కర్–వెంకీ అట్లూరి కాంబినేషన్ సినిమా ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కాంబినేషన్‌పై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



● వెంకీ అట్లూరి

సీక్రెట్ మిషన్



● విద్యుత్ జమాల్

తెలుగులో 'ఘాజీ', 'అంతరిక్షం 9000కేఎమ్‌పీహెచ్' వంటి చిత్రాలను తీసిన సంకల్ప్ రెడ్డి హిందీలో దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'ఐబీ 71'. విద్యుత్ జమాల్ హీరోగా నటించి, నిర్మించిన ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ ఓ లీడ్ రోల్ చేశారు. స్పై జానర్‌లో రూపొందిన ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి, చిత్రాన్ని మే 12న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''1971లో ఇండియా–పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. ఈ వార్‌లో భారతదేశం గెలవడానికి దేశ ఇంటెలిజెన్స్ బ్యూరో చేసిన ఓ సీక్రెట్ మిషన్ ఏ విధంగా దోహదపడింది? అనే అంశాల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించాం'' అని యూనిట్ పేర్కొంది.

షూటింగ్‌లో పాల్గొనడం సంతోషం

– సుష్మితాసేన్

''ప్రస్తుతం నా ఆరోగ్యం బాగానే ఉంది. 'ఆర్య 3' షూటింగ్ కోసం జైపూర్‌కు వచ్చాను. తిరిగి షూటింగ్స్‌లో పాల్గొనడం సంతోషంగా ఉంది'' అంటూ ఓ వీడియోను షేర్ చేశారు నటి సుష్మితాసేన్. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుండె నొప్పితో ఆసుపత్రిలో చేరిన సుష్మితాసేన్‌కు ఓ మేజర్ సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి షూటింగ్స్‌కు కాస్త దూరంగా ఉంటున్న ఆమె ఇప్పుడు కోలుకుని షూటింగ్‌లో పాల్గొంటున్నారు. 'ఆర్య' వెబ్ సిరీస్‌లోని మూడో సీజన్ కోసం సుష్మితాసేన్ ప్రస్తుతం జైపూర్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. సుష్మితా సేన్ టైటిల్ రోల్ చేస్తున్న 'ఆర్య 3' వెబ్ సిరీస్‌కు రామ్‌మద్వానీ, సందీప్ మోది దర్శకత్వం వహిస్తున్నారు. డిస్నీప్లస్ హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ రిలీజ్ డేట్‌పై త్వరలో ఓ స్పష్టత రానుంది. ఇక సుష్మితాసేన్ 'తాలి' అనే మరో వెబ్‌సిరీస్‌లో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఇందులో తన పాత్ర డబ్బింగ్‌ని గత నెలలో పూర్తి చేశారామె.



నేను భగవంతుడు రా!



● విమలా రామన్, జగపతిబాబు, మమతా మోహన్‌దాస్

'మై నేమ్ ఈజ్ భీం రావ్ దేశ్‌ముఖ్..' అనే జగపతిబాబు డైలాగ్‌తో 'రుద్రంగి' సినిమా టీజర్ విడుదలైంది. జగపతి బాబు, ఆశిష్ గాంధీ, మమతా మోహన్ దాస్, విమలా రామన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రుద్రంగి'. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాలకు రైటర్‌గా పనిచేసిన అజయ్ సామ్రాట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రసమయి ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మిస్తున్న ఈ మూవీ మే 26న విడుదలకానుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. 'స్వాతంత్ర్యం అన్నది బానిసలకు కాదు.. అది మా కోసం', 'గాడు బలవంతుడే రా.. కానీ నేను భగవంతుడు రా..'(జగపతి బాబు), 'నీకు ఎదురు తిరిగిన మల్లేశ్‌గాడు ఖతం కావాలె(మమతా మోహన్ దాస్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. స్వాతంత్ర్యం తర్వాత ఆనాటి తెలంగాణ సాంఘిక పరిస్థితుల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు టీజర్‌లో కనిపిస్తోంది. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ శనమోని, సంగీతం: నాఫల్ రాజా.



రుబ్లెవ్ ఖాతాలో తొలి 'మాస్టర్స్' టైటిల్

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో రష్యా ప్లేయర్ ఆండ్రీ రుబ్లెవ్ విజేతగా నిలిచాడు. మొనాకోలో ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ రుబ్లెవ్ 5-7, 6-2, 7-5తో తొమ్మిదో ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై నెగ్గాడు. రుబ్లెవ్ కెరీర్‌లో ఇదే తొలి 'మాస్టర్స్' సిరీస్ టైటిల్ కావడం విశేషం. మూడో సెట్‌లో రుబ్లెవ్ 1-4తో వెనుకబడి పుంజుకున్నాడు. విజేత రుబ్లెవ్‌కు 8,92,590 యూరోల (రూ. 8 కోట్లు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

రంజీ ట్రోఫీ విజేతకు రూ. 5 కోట్లు

దేశవాళీ క్రికెట్ టోర్నీల ప్రైజ్‌మనీ మొత్తాన్ని బీసీసీఐ భారీగా పెంచింది. ఈ ఏడాది నుంచి రంజీ ట్రోఫీ చాంపియన్‌కు రూ. 2 కోట్లు బదులు రూ. 5 కోట్లు చెల్లిస్తారు. రన్నరప్ జట్టుకు రూ. 3 కోట్లు... సెమీఫైనల్లో ఓడిన రెండు జట్లకు రూ. 1 కోటి చొప్పున లభిస్తాయి. దులీప్ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ విజేతలకు రూ. 1 కోటి చొప్పున... ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ విజేతకు రూ. 80 లక్షలు లభిస్తాయి. సీనియర్ మహిళల వన్డే టోర్నీ చాంపియన్‌కు రూ. 50 లక్షలు... టి20 టోర్నీ విజేతకు రూ. 40 లక్షలు చెల్లిస్తారు.



ముంబై ఘటాఫట్...

- 17.4 ఓవర్లలోనే 186 పరుగుల లక్ష్య ఛేదన
- మెరిసిన ఇషాన్, సూర్యకుమార్
- కోల్‌కతాకు మూడో ఓటమి
- వెంకటేశ్ అయ్యర్ సెంచరీ వృథా

ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ తాజా ఐపీఎల్ సీజన్‌లో ఫామ్‌లోకి వచ్చేసింది. ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ముంబై... వరుసగా రెండో విజయంతో ప్రత్యర్థి జట్లకు ప్రమాద సంకేతాలు పంపించింది. సొంత మైదానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఇషాన్, సూర్య, తిలక్ వర్మ ధనాధన్ ఆటతో చెలరేగడంతో 186 పరుగుల భారీ లక్ష్యాన్ని ముంబై 14 బంతులు మిగిలి ఉండగానే అందుకుంది. అంతకుముందు కోల్‌కతా బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసినా చివరకు అతని వీరోచిత ప్రదర్శన వృథా అయింది.


ఇషాన్





ముంబై: లక్ష్యం పెద్దదైనా... ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ముంబై ఇండియన్స్ అనుకున్న ఫలితం సాధించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆదివారం వాంఖెడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. అస్వస్థతతో ముంబై జట్టు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ బరిలోకి దిగకపోవడంతో సూర్యకుమార్ ఈ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. టాస్ గెలిచిన సూర్య ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 185 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వెంకటేశ్ అయ్యర్ (51 బంతుల్లో 104; 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) ముంబై బౌలర్లను చితగ్కొట్టి సెంచరీ చేశాడు. అనంతరం ముంబై 17.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 186 పరుగులు సాధించి గెలిచింది. ఇషాన్ కిషన్ (25 బంతుల్లో 58; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), సూర్యకుమార్ (25 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో ముంబై విజయంలో కీలకపాత్ర పోషించారు. రోహిత్ శర్మ (13 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (25 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 24 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ ఈ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. గతంలో సచిన్ కూడా ముంబై ఇండియన్స్ తరఫునే ఆడటంతో ఐపీఎల్ టోర్నీ ఆడిన తండ్రీ, కొడుకులుగా సచిన్, అర్జున్ గుర్తింపు పొందారు. ఇదే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ప్లేయర్ దువాన్ జాన్సెన్ కూడా అరంగేట్రం చేశాడు. దువాన్ కవల సోదరుడు మార్కో జాన్సెన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్నాడు. ఐపీఎల్‌లో ఆడిన తొలి కవల సోదర ద్వయంగా మార్కో, దువాన్ గుర్తింపు పొందింది.

ఆరంభం నుంచే...

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై జట్టుకు బౌలర్ మెరిడిత్ స్థానంలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన రోహిత్ శర్మ, మరో ఓపెనర్ ఇషాన్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. శార్దుల్ వేసిన రెండో ఓవర్లో ఇషాన్ 4,4,6 బాదగా... మొత్తం 16 పరుగులు వచ్చాయి. ఉమేశ్ యాదవ్ వేసిన మూడో ఓవర్లో రోహిత్ 4, ఇషాన్ 4,6తో చెలరేగగా... 17 పరుగులు వచ్చాయి. నరైన్ నాలుగో ఓవర్లో రోహిత్, ఇషాన్ ఏకంగా 22 పరుగులు రాబట్టారు. దాంతో ముంబై 4 ఓవర్లు పూర్తయ్యే సరికి 57/0తో నిలిచింది. స్పిన్నర్ సుయశ్ వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టిన రోహిత్ అదే ఓవర్ ఐదో బంతికి అవుటయ్యాడు. అనంతరం ఇషాన్‌తో సూర్య జతకలిశాడు. వీరిద్దరు అదే జోరును కొనసాగించారు. పవర్‌ప్లే ముగిసేసరికి ముంబై 72/1తో నిలిచింది. వరుణ్ చక్రవర్తి వేసిన ఏడో ఓవర్లో రెండో బంతిని సిక్స్‌గా మలిచిన ఇషాన్ తర్వాతి బంతికి బౌల్డయ్యాడు. ఎనిమిది ఓవర్లు పూర్తయ్యేసరికి ముంబై 90/2తో గెలుపుదిశగా సాగింది. ఇషాన్ అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన తిలక్, సూర్యతో కలిసి ముంబైను ముందుకు నడిపించారు. ఫెర్గూసన్ వేసిన 11వ ఓవర్లో సూర్య రెండు సిక్స్‌లు కొట్టాడు. రసెల్ వేసిన 13వ ఓవర్లో సూర్య, తిలక్ 17 పరుగులు సాధించారు. ముంబై 13 ఓవర్లకే 147/2తో విజయానికి 39 పరుగుల దూరంలో నిలిచింది. సుయశ్ వేసిన 14వ ఓవర్లో తిలక్ వర్మ పెవిలియన్ చేరాడు. క్రీజులో వచ్చిన టిమ్ డేవిడ్ రెండు సిక్స్‌లతో తన ఉద్దేశాన్ని చాటి చెప్పాడు. ముంబై గెలుపునకు 10 పరుగులు ఉన్నాయనగా సూర్య.. ఆ తర్వాత వధేరా అవుటైనా టిమ్ డేవిడ్ మిగతా పనిని పూర్తి చేశాడు.

2008 తర్వాత...

అంతకుముందు వెంకటేశ్ అయ్యర్ అద్భుత ఇన్నింగ్స్‌తో 2008 ఐపీఎల్ తొలి సీజన్ తర్వాత మళ్లీ ఈ టోర్నీలో కోల్‌కతా బ్యాటర్ సెంచరీని నమోదు చేయడం విశేషం. 2008లో బెంగళూరుతో జరిగిన ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో బ్రెండన్ మెకల్లమ్ (158 నాటౌట్; 10 ఫోర్లు, 13 సిక్స్‌లు) భారీ సెంచరీ చేశాడు. కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఒకవైపు వికెట్లు పడుతున్నా...మరోవైపు వెంకటేశ్ ఒక్కడే పోరాటం చేశాడు. ఫోర్లు, సిక్స్‌లతో అదరగొట్టాడు. 49 బంతుల్లో అతను సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో మెరిడిత్ బౌలింగ్‌లో స్కూప్ షాట్ కొట్టిన వెంకటేశ్ షార్ట్ థర్డ్‌మ్యాన్ వద్ద జాన్సెన్ చేతికి చిక్కి పెవిలియన్ చేరాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) జాన్సెన్ (బి) చావ్లా 8; జగదీశన్ (సి) షోకీన్ (బి) గ్రీన్ 0; వెంకటేశ్ అయ్యర్ (సి) జాన్సెన్ (బి) మెరిడిత్ 104; నితీశ్ రాణా (సి) రమణ్‌దీప్ సింగ్ (సబ్) (బి) షోకీన్ 5; శార్దుల్ ఠాకూర్ (సి) తిలక్ వర్మ (బి) షోకీన్ 13; రింకూ సింగ్ (సి) నేహల్ వధేరా (బి) జాన్సెన్ 18; రసెల్ (నాటౌట్) 21; నరైన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 185. **వికెట్ల పతనం:** 1-11, 2-57, 3-73, 4-123, 5-159, 6-172. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 2-0-17-0, కామెరాన్ గ్రీన్ 2-0-20-1, దువాన్ జాన్సెన్ 4-0-53-1, పీయూష్ చావ్లా 4-0-19-1, హృతిక్ షోకీన్ 4-0-34-2, మెరిడిత్ 4-0-40-1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఉమేశ్ యాదవ్ (బి) సుయశ్ 20; ఇషాన్ కిషన్ (బి) వరుణ్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) గుర్బాజ్ (బి) శార్దుల్ 43; తిలక్ వర్మ (బి) సుయశ్ 30; టిమ్ డేవిడ్ (నాటౌట్) 24; నేహల్ వధేరా (సి) గుర్బాజ్ (బి) ఫెర్గూసన్ 6; గ్రీన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (17.4 ఓవర్లలో 5 వికెట్లకు)** 186. **వికెట్ల పతనం:** 1-65, 2-87, 3-147, 4-176, 5-184. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 2-0-19-0, శార్దుల్ ఠాకూర్ 2-0-25-1, సునీల్ నరైన్ 3-0-41-0, సుయశ్ శర్మ 4-0-27-2, వరుణ్ చక్రవర్తి 4-0-38-1, ఫెర్గూసన్ 1.4-0-19-1, రసెల్ 1-0-17-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	1.354
లక్నో	5	3	2	6	0.761
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
కోల్‌కతా	5	2	3	4	0.320
చెన్నై	4	2	2	4	0.225
బెంగళూరు	4	2	2	4	-0.316
ముంబై	4	2	2	4	-0.389
హైదరాబాద్	4	2	2	4	-0.822
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

హెట్‌మైర్ తడాఖా...

- 26 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 56 నాటౌట్
- గుజరాత్‌కు రాయల్స్ షాక్
- సామ్సన్ కెప్టెన్ ఇన్నింగ్స్


హెట్‌మైర్


సామ్సన్

అహ్మదాబాద్: ప్రత్యర్థి ఏదైనా... పరిస్థితి ఎలా ఉన్నా... ఆశ కోల్పోకుండా పట్టుదలతో పోరాడితే విజయం సాధ్యమేనని రాజస్తాన్ రాయల్స్ జట్టు నిరూపించింది. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. గుజరాత్ నిర్దేశించిన 178 పరుగుల లక్ష్యాన్ని రాజస్తాన్ 19.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తద్వారా గత ఏడాది ఐపీఎల్ ఫైనల్లో గుజరాత్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. కెప్టెన్ సంజూ సామ్సన్ (32 బంతుల్లో 60; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెట్‌మైర్ (26 బంతుల్లో 56 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో రాజస్తాన్ విజయంలో ముఖ్యపాత్ర పోషించారు. చివరి ఓవర్లో రాజస్తాన్ నెగ్గేందుకు 7 పరుగులు అవసరం కాగా... తొలి బంతికి 2 పరుగులు తీసిన హెట్‌మైర్, రెండో బంతిని సిక్స్‌గా మలిచి రాజస్తాన్‌ను విజయతీరానికి చేర్చాడు. ఒకదశలో రాజస్తాన్ 55 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అయితే సామ్సన్, హెట్‌మైర్ రాజస్తాన్‌ను ఆదుకున్నారు. ముఖ్యంగా సామ్సన్ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి సిక్సర్లతో చెలరేగిపోయాడు. రషీద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్లో సామ్సన్ వరుసగా మూడు సిక్స్‌లు కొట్టాడు. 15వ ఓవర్ చివరి బంతికి నూర్ అహ్మద్ బౌలింగ్‌లో సామ్సన్ అవుటయ్యాడు. దాంతో ఐదో వికెట్‌కు 27 బంతుల్లో 59 పరుగుల సామ్సన్, హెట్‌మైర్ భాగస్వామ్యానికి తెర పడింది. అప్పటికి రాజస్తాన్ గెలిచేందుకు 5 ఓవర్లలో 64 పరుగులు చేయాలి. సామ్సన్ అవుటయ్యాక వచ్చిన ధ్రువ్ జురేల్ (10 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడాడు. రాజస్తాన్ గెలిచేందుకు 2 ఓవర్లలో 23 పరుగులు అవసరంకాగా... షమీ వేసిన 19వ ఓవర్ తొలి బంతిని ధ్రువ్ సిక్స్‌గా మలిచి తర్వాతి బంతికి అవుటయ్యాడు. వచ్చీరాగానే అశ్విన్ (3 బంతుల్లో 10) 4, 6 కొట్టి పెవిలియన్ చేరాడు. చివరి ఓవర్లో హెట్‌మైర్ మిగతా పనిని పూర్తి చేశాడు. అంతకుముందు గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 177 పరుగులు సాధించింది. గిల్ (34 బంతుల్లో 45; 4 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (30 బంతుల్లో 46; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి అండ్ బి) బౌల్ట్ 4; గిల్ (సి) బట్లర్ (బి) సందీప్ శర్మ 45; సాయి సుదర్శన్ (రనౌట్) 20; హార్దిక్ పాండ్యా (సి) యశస్వి (బి) చహల్ 28; డేవిడ్ మిల్లర్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ శర్మ 46; అభినవ్ మనోహర్ (సి) పడిక్కల్ (బి) జంపా 27; తెవాటియా (నాటౌట్) 1; రషీద్ ఖాన్ (రనౌట్) 1; అల్జారి జోసెఫ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు)** 177. **వికెట్ల పతనం:** 1-5, 2-32, 3-91, 4-121, 5-166, 6-175, 7-176. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-46-1, సందీప్ శర్మ 4-0-25-2, జంపా 4-0-32-1, అశ్విన్ 4-0-37-0, చహల్ 4-0-36-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) గిల్ (బి) హార్దిక్ 1; బట్లర్ (బి) షమీ 0; పడిక్కల్ (సి) మోహిత్ శర్మ (బి) రషీద్ ఖాన్ 26; సంజూ సామ్సన్ (సి) మిల్లర్ (బి) నూర్ అహ్మద్ 60; రియాన్ పరాగ్ (సి) మిల్లర్ (బి) రషీద్ ఖాన్ 5; హెట్‌మైర్ (నాటౌట్) 56; ధ్రువ్ జురేల్ (సి) మోహిత్ శర్మ (బి) షమీ 18; అశ్విన్ (సి) తెవాటియా (బి) షమీ 10; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (19.2 ఓవర్లలో 7 వికెట్లకు)** 179. **వికెట్ల పతనం:** 1-2, 2-4, 3-47, 4-55, 5-114, 6-161, 7-171. **బౌలింగ్:** షమీ 4-1-25-3, హార్దిక్ పాండ్యా 4-0-24-1, అల్జారి జోసెఫ్ 3-0-47-0, రషీద్ ఖాన్ 4-0-46-2, మోహిత్ శర్మ 2-0-7-0, నూర్ అహ్మద్ 2.2-0-29-1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, న్యూఢిల్లీలో 3055 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)-4 నోటిఫికేషన్ విడుదలైంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 3055

» **సంస్థల వారీగా ఖాళీల వివరాలు:** ఎయిమ్స్ భటిండా-142, ఎయిమ్స్ భోపాల్-51, ఎయిమ్స్ భువనేశ్వర్-169, ఎయిమ్స్ బీబీనగర్-150, ఎయిమ్స్ బిలాస్‌పూర్-178, ఎయిమ్స్ దేవ్‌ఘర్-100, ఎయిమ్స్ గోరఖ్‌పూర్-121, ఎయిమ్స్ జోధ్‌పూర్-300, ఎయిమ్స్ కల్యాణి-24, ఎయిమ్స్ మంగళగిరి-117, ఎయిమ్స్ నాగ్‌పూర్-87, ఎయిమ్స్ రాయ్‌బరేలీ-77, ఎయిమ్స్ న్యూఢిల్లీ-620, ఎయిమ్స్ పాట్నా-200, ఎయిమ్స్ రాయ్‌పూర్-150, ఎయిమ్స్ రాజ్‌కోట్-100, ఎయిమ్స్ రిషికేశ్-289, ఎయిమ్స్ విజయ్‌పూర్-180.

» **అర్హత:** డిప్లొమా(జీఎన్ఎం)తోపాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికెట్)/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.

» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు,ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

» **వేతనం:** నెలకు రూ.9300 నుంచి రూ.34,800తోపాటు రూ.4600 గ్రేడ్ పే అందుతుంది.

» **ఎంపిక విధానం:** నార్‌సెట్-4 స్కోరు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **పరీక్ష విధానం:** పరీక్ష వ్యవధి 3 గంటలు. ఆబ్జెక్టివ్ విధానంలో 200 ప్రశ్నలు- 200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. సబ్జెక్టుకు సంబంధించి 180 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి 20 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కులు కోత విధిస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.05.2023

» **సీబీటీ పరీక్ష తేది:** 03.06.2023.

» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

పది తర్వాత దూసుకుపోయేలా..!

» పదో తరగతి తర్వాత అనేక మార్గాలు
» ఎక్కువ మంది చేరేది ఇంటర్మీడియెట్
» టెక్నికల్ విభాగాల్లో ఉపాధికి పాలిటెక్నిక్, ఐటీఐ
» ఆసక్తి, సామర్థ్యం ఆధారంగా కోర్సు ఎంపిక ముఖ్యం



భవిష్యత్తుకు టర్నింగ్ పాయింట్.. టెన్త్‌క్లాస్! పదో తరగతి తర్వాత ఎంచుకునే కోర్సు భవితకు దారి చూపుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని లక్షల మంది విద్యార్థులు ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసారు. ఇప్పుడు వీరంతా.. పది తర్వాత ఏం చేయాలి అనే అన్వేషణలో పడ్డారు. ఏ కోర్సులో చేరాలి.. తమకు సరైన కోర్సు ఏది.. ఏ కోర్సులో చేరితే మెరుగైన ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.. ఇలా వారికి ఎన్నో సందేహాలు! ఈ నేపథ్యంలో..పదో తరగతి తర్వాత అందుబాటులో ఉన్న మార్గాలు, భవిష్యత్ అవకాశాలు, కోర్సు ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వివరాలు..

ఇంటర్మీడియెట్.. పదో తరగతి ఉత్తీర్ణుల్లో అధిక శాతమంది చేరే కోర్సు ఇది. ఇంటర్మీడియెట్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, అగ్రికల్చర్ డిప్లొమాలు, ఒకేషనల్ కోర్సులు.. ఇలా ఎన్నో కోర్సుల్లో చేరే అవకాశముంది. కాబట్టి విద్యార్థులు వీటిపైనా దృష్టి సారించాలి. కోర్సు ఎంపికలో విద్యార్థులు తమ వ్యక్తిగత ఆసక్తి, అకడమిక్ సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంటర్.. ప్రతి గ్రూప్ ప్రత్యేకమే

పదో తరగతి తర్వాత ఎక్కువ మంది చేరే ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూప్‌లు ఉన్నాయి. వీటిల్లో ప్రతి గ్రూప్ దేనికదే ఎంతో ప్రత్యేకమైనది. అధిక శాతం మంది విద్యార్థులు ఎంపీసీలో చేరుతుంటారు. ఆ తర్వాతి స్థానంలో బైపీసీ ఉంటుంది. సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీలతోనూ భవిష్యత్తులో మంచి అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. అదే విధంగా సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు అందించే ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇంజనీరింగ్‌కు మార్గం.. ఎంపీసీ

ఎంపీసీ గ్రూప్‌లో ప్రధాన సబ్జెక్టులు మ్యాథమెటిక్స్,ఫిజిక్స్, కెమిస్ట్రీ. ఈ గ్రూప్ అర్హత ఆధారంగా ఎంసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ తదితర ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఇంజనీరింగ్ కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. భవిష్యత్తులో సైన్స్ రంగంలో స్థిరపడాలనుకుంటే.. ఇంటర్ ఎంపీసీ తర్వాత బీఎస్సీ వంటి కోర్సుల్లో చేరే వీలుంది. ఎంపీసీ విద్యార్థులు ఇంటర్ తర్వాత ఎన్‌డీఏ, 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీం వంటి పరీక్షల ద్వారా డిఫెన్స్ రంగంలో కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. ఎంపీసీ విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్ కోర్సులే కాకుండా..ఆర్ట్స్, హ్యూమానిటీస్, లా సంబంధిత కోర్సుల్లోనూ చేరే అవకాశముంది. ఎంపీసీలో చేరే విద్యార్థులకు సహజంగా కొన్ని లక్షణాలు ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు. అవి.. కంప్యుటేషనల్ స్కిల్స్, న్యూమరికల్ స్కిల్స్. దీంతోపాటు మన కళ్ల ముందు కనిపించే మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్ వంటి పరికరాల పనితీరును తెలుసుకోవాలనే కుతూహలం ఉన్న వారు ఎంపీసీ గ్రూప్‌నకు సరితూగుతారని చెబుతున్నారు.

మెడిసిన్‌కు దారి.. బైపీసీ

బైపీసీలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులు. ఇంటర్ బైపీసీ విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ యూజీ పరీక్షలో ర్యాంకు ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర మెడిసిన్, అనుబంధ కోర్సుల్లో చేరే అవకాశముంది.

- రాష్ట్ర స్థాయిలో టీఎస్ ఎంసెట్, ఏపీ ఏఈఏపీసెట్‌లలో ఉత్తీర్ణత సాధించి వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్ వంటి విభాగాల్లోనూ బ్యాచిలర్ డిగ్రీ, ఆ తర్వాత పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశముంది.
- ఇంటర్మీడియెట్ బైపీసీ అర్హతతో బీజెడ్‌సీలో అడుగుపెట్టొచ్చు.ఇప్పుడు బీజెడ్‌సీలోనూ బయో ఇన్ఫర్మాటిక్స్, బయోటెక్, హ్యూమన్ జెనెటిక్స్, జెనెటిక్స్ వంటి వినూత్న సబ్జెక్టులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. ఫార్మా, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి.
- బైపీసీని ఎంపిక చేసుకునే ముందు వ్యక్తిగతంగా కొన్ని అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. అవి..లైఫ్ సైన్సెస్‌పై సహజ ఆసక్తి, పర్యావరణ స్పృహ వంటివి. దీంతోపాటు సహనం, ఓర్పు అనేవి బైపీసీ విద్యార్థులకు ఉండాల్సిన ఇతర ముఖ్య లక్షణాలు.

సీఈసీతో కార్పొరేట్ కెరీర్

- భవిష్యత్తులో కార్పొరేట్ రంగంలో కెరీర్ కోరుకుంటే.. అందుకు చక్కటి మార్గంగా నిలుస్తున్న గ్రూప్.. సీఈసీ. ఈ గ్రూప్ కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌ల కలయికగా ఉంటుంది.
- సీఈసీ విద్యార్థులకు ఉన్నత విద్య పరంగా బీకాం ముఖ్య మార్గంగా నిలుస్తోంది. బీకాం చదువుతూనే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చు. తద్వారా కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్నల్ ఆడిటర్స్, స్టాక్ ఆడిటర్స్, ఫైనాన్షియల్ మేనేజర్స్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి వైట్ కాలర్ ఉద్యోగాలు సొంత చేసుకోవచ్చు.
- బ్యాచిలర్ డిగ్రీ బీకామ్ తర్వాత.. పీజీ స్థాయిలో ఎంకామ్, ఎంబీఏల్లో చేరొచ్చు. -ఐఐఎంలు, ఇతర ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఎంబీఏ కోసం క్యాట్, మ్యాట్, సీమ్యాట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- కాలిక్యులేషన్ స్కిల్స్, గణాంకాల విశ్లేషణ నైపుణ్యాలు, సూక్ష్మ స్థాయి పరిశీలన నైపుణ్యాలుంటే.. సీఈసీ గ్రూప్‌లో సులభంగా రాణించొచ్చు.

ఎంఈసీతో.. విస్తృత అవకాశాలు

- ఎంఈసీలో మ్యాథమెటిక్స్,ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులు ఉంటాయి. ఈ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేస్తే..ఇటు మ్యాథమెటిక్స్ అర్హతగా బీఎస్సీ.. అటు కామర్స్ అర్హతగా బీకాం..ఇలా రెండు మార్గాలు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులో చేరే వీలుంటుంది.
- ఎంఈసీతో ముఖ్యంగా చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ కోర్సుల్లో రాణించే అవకాశం లభిస్తుంది. కంప్యుటేషనల్, కాలిక్యులేషనల్ స్కిల్స్ ఉన్న విద్యార్థులు ఈ గ్రూప్‌నకు సరితూగుతారు.

పోటీ పరీక్షలకు హెచ్ఈసీ

- సివిల్స్,గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల్లో ముందంజలో నిలిపే గ్రూప్‌గా హెచ్ఈసీకి పేరుంది. హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌లు. వీటిపై పట్టు సాధించడం ద్వారా పలు ఉద్యోగ పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించొచ్చు.
- హెచ్ఈసీ అర్హతగా ప్రవేశం లభించే బీఏలోనూ జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు సొంతం చేసుకోవచ్చు.

అకడమిక్ నైపుణ్యాలకు ఆర్‌జేసీ

- ఇంటర్మీడియెట్ స్థాయిలో అకడమిక్ నైపుణ్యాలను మెరుగుపరచుకొని పోటీ ప్రపంచంలో ముందంజలో నిలిచేందుకు చక్కటి వేదికలు.. రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్‌లు. వీటిలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఆర్‌జేసీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఈ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారికి రెసిడెన్షియల్ విధానంలో బోధన ఉంటుంది. విద్యార్థులను ఎంసెట్, సీఏ సీపీటీ తదితర ప్రవేశ పరీక్షలకు సన్నద్ధులను చేసే విధంగా ప్రత్యేక శిక్షణసైతం లభిస్తుంది.
- తెలంగాణ రాష్ట్రంలో..తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా టీఎస్ఆర్‌జేసీ సెట్ నిర్వహిస్తారు. ప్రస్తుతం 2023-24 ప్రవేశాలకు సంబంధించి టీఎస్ ఆర్‌జేసీ-సెట్-2023 ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 35 కళాశాలల్లో ప్రవేశానికి టీఎస్ఆర్‌జేసీ-సెట్-2023ను మే 6న నిర్వహించనున్నారు.
వివరాలకు వెబ్‌సైట్:
https://tsrjdc.cgg.gov.in
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో.. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం పది కళాశాలల్లో(గత ఏడాది గణాంకాల ప్రకారం) ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ సెట్‌ను నిర్వహిస్తారు. ఈ సెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. ప్రవేశం ఖరారవుతుంది.
- 2023 ప్రవేశాలకు సంబంధించి ఏపీఆర్‌జేసీ సెట్ తేదీలు వెలువడ్డాయి. విద్యార్థులు ఏప్రిల్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రన్స్‌ను మే 20న నిర్వహిస్తారు.
వివరాలకు వెబ్‌సైట్:
https://aprs.apcfss.in/indexinter.jsp

ఒకేషనల్ కోర్సులు.. ఉపాధి వేదికలు

- ఇంటర్మీడియెట్ తర్వాత సత్వరం ఉపాధి కోరుకునే వారికి మార్గం.. ఒకేషనల్ కోర్సులు. ఆఫీస్ అడ్మిన్‌స్ట్రేషన్‌షిప్ నుంచి ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వరకూ.. టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో నైపుణ్యాలు అందించే కోర్సులు ఇవి. -ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్మీడియెట్ బోర్డులు.. అగ్రికల్చర్; బిజినెస్ అండ్ కామర్స్; ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ; హోం సైన్స్; హ్యూమానిటీస్; పారా మెడికల్ విభాగాల్లో మొత్తం 27 ఒకేషనల్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా సంబంధిత రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చు.
- ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలోని ఆటోమొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వైరింగ్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ ఎలక్ట్రికల్ అప్లయన్సెస్; రూరల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేస్తే..ఎలాంటి ప్రవేశ పరీక్షలు అవసరం లేకుండానే సంబంధిత బ్రాంచ్‌లో నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరొచ్చు.

సాంకేతిక విద్యకు కేరాఫ్.. పాలిటెక్నిక్

- భవిష్యత్తులో ఇంజనీరింగ్ విభాగంలో రాణించాలనుకునే విద్యార్థులకు చక్కటి మార్గం.. పాలిటెక్నిక్స్. మూడు, మూడున్నరేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, కెమికల్, మెటలర్జీ.. ఇలా అనేక బ్రాంచ్‌లు ఉంటాయి.
- ఈ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.
- పాలిటెక్నిక్ డిప్లొమా అర్హతతో ఈసెట్‌లో ర్యాంకు ఆధారంగా లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెట్టే అవకాశం లభిస్తుంది.
- ఆంధ్రప్రదేశ్‌లో 2023-24 ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలిసెట్ నోటిఫికేషన్ వెలువడింది. మే 10న ఏపీ పాలిసెట్‌ను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
వివరాలకు వెబ్‌సైట్: https://polycetap.nic.in
- తెలంగాణ పాలిసెట్-2023 ప్రక్రియ కూడా కొనసాగుతోంది. మే 17న టీఎస్ పాలిసెట్‌ను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 24 వరకు, రూ.100 అలస్య రుసుముతో ఏప్రిల్ 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. **వివరాలకు వెబ్‌సైట్:** https://polycet. sbtet.telangana.gov.in

ఐటీఐతో.. సత్వర ఉపాధి

పదో తరగతి అర్హతగా వృత్తి విద్య శిక్షణ, స్వయం ఉపాధికి మార్గం.. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్(ఐటీఐ). నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ పరిధిలోని ఐటీఐల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండిషనింగ్ తదితర పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకు సాధారణంగా ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్ వెలువడుతుంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ పరిధిలో ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న ప్రాంతీయ ఒకేషనల్ ట్రైనింగ్ కౌన్సిల్స్ ఈ ప్రవేశ ప్రక్రియలను నిర్వహిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత పారిశ్రామిక సంస్థల్లో ఎంట్రీ లెవల్లో టెక్నీషియన్స్‌గా అడుగు పెట్టొచ్చు. అదే విధంగా అప్రెంటీస్ షిప్ పూర్తి చేసుకుని ఎన్‌సీవీటీ సర్టిఫికెట్ పొందితే ఉద్యోగ సాధనలో ముందంజలో ఉండొచ్చు.

అగ్రి పాలిటెక్నిక్స్

గ్రామీణ యువత స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేకంగా నెలకొల్పిన ఇన్‌స్టిట్యూట్‌లు..అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్. వీటిలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా ముఖ్యమైనవి. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ కోర్సుల కాల వ్యవధి రెండేళ్లు. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. వ్యవసాయ డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన వారికి ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సంస్థలు వంటివాటిలో ఉద్యోగాలు లభిస్తాయి.

ఆరోగ్య బీమా.. పోర్టింగ్‌తో ధీమా!

బీమా సంస్థ సేవల్లో రాజీ పడక్కర్లేదు • మెరుగైన సేవలు అందించే చోటకు వెళ్లొచ్చు
సమగ్ర కవరేజీతో ఉంటే ఆకర్షణీయం • రూమ్ రెంట్, ఇతర ఉప పరిమితులు ఉండొద్దు
రెన్యువల్‌కు 60 రోజుల ముందు సంప్రదించాలి

క్లెయిమ్ పరిష్కారాల్లో జాప్యం, ఏదో రకమైన కొర్రీ పెట్టి తక్కువ పరిహారాన్ని చెల్లించడం, అధిక ప్రీమియం వసూలు లేదా నాసిరకమైన సేవలతో సరిపెట్టడం.. ఇలా ఎన్నో కారణాలతో పాలసీదారులు ఇబ్బంది పడుతున్నారన్నది వాస్తవం. వైద్య రంగంలో ద్రవ్యోల్బణం అధికంగా ఉంటోంది. దీంతో చికిత్సల వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. అత్యాధునిక టెక్నాలజీ ఫలితంగా ఎన్నో సర్జరీలకు హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం ఏర్పడడం లేదు. అదే రోజు డిశ్చార్జ్ అయి వెళ్లొచ్చు. ఒకవైపు ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్నప్పటికీ.. మరోవైపు జీవనశైలి వ్యాధులతో ఔట్ పేషెంట్ సేవల అవసరం పెరుగుతోంది. మారుతున్న ఈ అవసరాలు అన్నీ మన ఆరోగ్య బీమా కవరేజీలో భాగంగా ఉన్నప్పుడు అనుకున్న ప్రయోజనం నెరవేరుతుంది. అందుకే సమగ్రమైన హెల్త్ కవరేజీతో ఇన్సూరెన్స్ పాలసీ ఉండాలి. ఇప్పటికే తీసుకున్న పాలసీ సమగ్ర కవరేజీకి భరోసా ఇవ్వనట్టయితే.. చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తుంటే, బీమా సంస్థ సేవలు సంతృప్తికరంగా లేకపోతే, ప్రీమియం భారంగా మారితే అప్పుడు మన ముందు రెండు రకాల ఆప్షన్లు ఉన్నాయి. ఒకటి బీమా సంస్థను మార్చడం. లేదంటే ప్రస్తుత సంస్థలోనే మెరుగైన ప్లాన్‌కు మారిపోవడం (మైగ్రేషన్). వీటి గురించి తెలుసుకుందాం.

ప్రస్తుతం మీ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ సేవల పట్ల సంతృప్తిగానే ఉండి, పాలసీలోని కవరేజీ ఫీచర్లు, ప్రీమియం విషయంలో సంతృప్తిగా లేకపోతే అప్పుడు మీ ప్లాన్‌ను పోర్టింగ్ పెట్టుకోవడానికి బదులు, అదే బీమా సంస్థలో మెరుగైన ఫీచర్లతో కూడిన మరో ప్లాన్‌ను మైగ్రేట్ అవ్వడం మంచి నిర్ణయం అవుతుంది. పోర్టింగ్ అంటే ప్రస్తుత బీమా సంస్థను వీడి, మరో బీమా సంస్థకు మారిపోవడం. మైగ్రేషన్ అంటే ప్రస్తుత బీమా సంస్థలోనే మరో ప్లాన్‌కు మారిపోవడం. ''హెల్త్ ఇన్సూరెన్స్ నిబంధనల కింద ఒక వ్యక్తి తన పాలసీని ఎలాంటి బ్రేక్ లేకుండా వరుసగా నాలుగేళ్ల పాటు రెన్యువల్ చేసుకుంటే, అప్పుడు ప్రస్తుత బీమా ప్లాన్ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా మైగ్రేషన్‌కు అర్హత లభిస్తుంది''అని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ రిటైల్ బిజినెస్ ప్రెసిడెంట్ పార్థనిల్ ఘోష్ తెలిపారు.

ఎప్పుడు మార్చుకోవాలి..?

''కస్టమర్లు ప్రస్తుత హెల్త్ ప్లాన్ కవరేజీ పట్ల అసంతృప్తితో ఉంటే లేదా ప్రస్తుత బీమా సంస్థ సేవలు నచ్చకపోతే లేదా సమగ్రమైన, వినూత్నమైన బీమా పాలసీ అందుబాటు ప్రీమియానికి లభిస్తుంటే పోర్ట్ పెట్టుకోవచ్చు. కాకపోతే నూతన పాలసీ ప్రయోజనాలు, నూతన సంస్థ సేవల సదుపాయాలను ప్రధానంగా చూడాలి''అని షా సూచించారు. ''మార్కెట్లో ఉన్న ప్రతీ నూతన ఉత్పత్తి అందరికీ సరిపోకపోవచ్చు. వేరొక సంస్థలోని ప్లాన్‌లో ఉన్న ఆకర్షణీయమైన ఫీచర్లను చూసి మారిపోవడం సరికాదు. మీ అవసరాలు, కుటుంబ సభ్యులు, వయసు తదితర అంశాల ఆధారంగా కొత్త ఉత్పత్తిని మదింపు వేయాలి''అని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ అండర్ రైటింగ్ డైరెక్టర్ బబతోష్ మిశ్రా పేర్కొన్నారు. ప్రస్తుత బీమా సంస్థ సేవలు సంతృప్తికరంగా లేకపోయినా, కస్టమర్ సేవలు నచ్చకపోయినా, ప్రస్తుత బీమా సంస్థ అందిస్తున్న సేవలు నాసిరకంగా ఉన్నా, సరైన కారణాలు చూపకుండా క్లెయిమ్‌ను తిరస్కరించినా అప్పుడు మారిపోవడాన్ని పరిశీలించొచ్చని యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో శరద్ మాథుర్ సూచించారు. సరైన సమాచారం పొందలేకపోవడం, పారదర్శకత లేమి, కంపెనీ నుంచి సత్వర స్పందన లేకపోవడం, విలువ ఆధారిత సేవలు లేకపోయినా పోర్టింగ్‌ను పరిశీలించొచ్చని తెలిపారు. ఇప్పటికే బీమా పాలసీ ఉండి, అందులోని నిబంధనల వల్ల సొంతంగా చెల్లింపులు చేసుకోవాల్సి వస్తుంటే, రూమ్ రెంట్ పరంగా ఉప పరిమితులు ఉంటే, మీకు దీర్ఘకాలిక వ్యాధి ఉండి ఓపీడీ లేదా డేకేర్ కవరేజీ లేకపోతే, మీ ప్లాన్‌లో రీస్టోరేషన్ (బీమా ఖర్చయితే తిరిగి పునరుద్ధరించడం) ఫీచర్ లేకపోయినా, ముందు నుంచి ఉన్న వ్యాధులకు దీర్ఘకాలం వెయిటింగ్ పీరియడ్ ఉన్నా, అప్పుడు మీ వంతు ఎక్కువ చెల్లించాల్సి రావచ్చు. దీనికి బదులు వేరొక ప్లాన్‌కు మారిపోవడమే నయం. ఉదాహరణకు నివాబూపా సంస్థ రెండు గంటలకు మించి హాస్పిటలైజేషన్ అయితే చాలు చెల్లింపులు చేస్తోంది. అదే ఆదిత్య బిర్లా సంస్థ అయితే ఆరోగ్యకర జీవనశైలిని (కంపెనీ చెప్పినట్టు) అనుసరిస్తే అప్పుడు ప్రీమియంలో నూరు శాతం వరకు రాయితీని ఆఫర్ చేస్తోంది. సాధారణంగా పోర్టింగ్ లేదా మైగ్రేషన్‌కు ప్రీమియం ఒక్కటినే ప్రామాణికంగా తీసుకోవద్దు. ఎందుకంటే అన్ని బీమా సంస్థలు కొన్నేళ్లకోసారి ప్రీమియంను సవరిస్తుంటాయి. అలాగే వయసు వారీగా కూడా ప్రీమియం పెంపు ఉంటుంది. అలాగే, బీమా కవరేజీని పెంచుకునేందుకు సైతం పోర్టింగ్ సరికాదు. దీనికి బదులు టాపప్ లేదా సూపర్ టాపప్ రూపంలో అదనపు కవరేజీని యాక్టివేట్ చేసుకోవచ్చు. బేసిక్ ప్లాన్ కవరేజీకి మించి క్లెయిమ్ వచ్చిన సందర్భాల్లోనే టాపప్, సూపర్ టాపప్ చెల్లింపులు చేస్తాయి.

హైదరాబాద్‌కు చెందిన క్రాంతి కుమార్ గతేడాది అత్యవసరంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. సింగిల్ ఏసీ రూమ్‌ను ఆయన ఆసుపత్రిలో తీసుకున్నారు. మూడు రోజులకు కలిపి రూ.88,000 బిల్లు వచ్చింది. అతడికి రూ.4 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ ఉండడంతో నిశ్చింతగా ఉన్నాడు. కానీ, బీమా సంస్థ నుంచి పూర్తి పరిహారం అందలేదు. క్రాంతి తన వంతుగా రూ.33,000ను చెల్లించాల్సి వచ్చింది. అదేమని ప్రశ్నించగా.. బీమా కవరేజీలో రూమ్ రెంట్ పరిమితి 1 శాతంగా ఉంది. కానీ, అతడు ఎంపిక చేసుకున్న రూమ్ రోజువారీ అద్దె 1 శాతం కంటే మించి ఉంది. ఈ షరతు చూసిన తర్వాత అతడు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. దీంతో కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్ కోసం అన్వేషణ మొదలు పెట్టాడు. ఇది క్రాంతి కుమార్ ఒక్కడికే ఎదురైన పరిస్థితి అనుకోవద్దు. దశాబ్దం క్రితం హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకుని, కొనసాగుతున్న వారంతా ఎదుర్కొంటున్నారు.



ఏమి చూడాలి..?

మీ అవసరాలకు సరిపడే ప్లాన్‌ను ఎంపిక చేసుకోవాలి. పాలసీ వర్డింగ్స్, పాలసీ బ్రోచర్‌ను అన్ని పేజీలు చదివితే పూర్తి వివరాలు తెలుస్తాయి. తద్వారా ప్లాన్ ఆకర్షణీయమా? కాదా? అన్నది చూడొచ్చు. క్లెయిమ్ పరిష్కారాల విషయంలో నూతన సంస్థ పనితీరును విశ్లేషించాలి. క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి, క్లెయిమ్ చెల్లింపుల సామర్థ్యాలను చూడాలి. క్లెయిమ్ అభ్యర్థనను ప్రాసెస్ చేయడంతో బీమా సంస్థల స్పందనను చూడాలి. ప్రీమియం ఎక్కువ ఉన్నా సరే, క్లెయిమ్ సమయంలో పాలసీదారులపై చెల్లింపుల భారం పడని పాలసీని ఎంపిక చేసుకోవాలి. ఓపీడీ కవరేజీ, డేకేర్, రీస్టోరేషన్ కూడా ఉండాలి. ఒక పాలసీ సంవత్సరంలో ఒక క్లెయిమ్ వల్ల బీమా కవరేజీ మొత్తం ఖర్చయినప్పుడు.. రీస్టోరేషన్ కింద బీమా సంస్థ అంతే మొత్తాన్ని పునరుద్ధరిస్తుంది. దీనివల్ల అదే ఏడాది మళ్లీ ఆసుపత్రిలో చికిత్స అవసరం పడితే క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందులోనూ కొన్ని సంస్థలు ఒక ఏడాదిలో ఒకరు ఎన్ని సార్లు ఆసుపత్రిలో చేరినా, గతంలో క్లెయిమ్ చేసిన వ్యాధులకు సైతం రీస్టోరేషన్ (అన్ లిమిటెడ్) ఇస్తున్నాయి. వీటిని పరిశీలించొచ్చు. ముందు నుంచి ఉన్న వ్యాధులకు సాధారణంగా 3–4 ఏళ్ల వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. దీనివల్ల వాటికి కవరేజీ కోసం అన్నేళ్లు ఆగక తప్పదు. దీనికి బదులు ఏడాది, అసలు వెయిటింగ్ పీరియడ్ లేని (రైడర్) పాలసీలు మెరుగైనవి. నో క్లెయిమ్ బోనస్ అనేది ప్రీమియం తగ్గింపు రూపంలో కాకుండా, బీమా కవరేజీ పెంపు రూపంలో ఉంటే ఎక్కువ ప్రయోజనం. రూమ్ రెంట్ పరిమితులు లేకుండా చూసుకోవాలి. ఇంటి నుంచే చికిత్స తీసుకోవాల్సి వస్తే (కరోనా వంటి సమయాల్లో) కవరేజీనిచ్చే డోమిసిలరీ ట్రీట్‌మెంట్ కవరేజీ ఫీచర్ ఉంటే మంచిదే.

దరఖాస్తు తిరస్కరణ..?

మంచి ఆరోగ్య చరిత్ర ఉండి, సరైన వివరాలు, డాక్యుమెంట్లు అందిస్తే నూతన సంస్థ పోర్టింగ్ అభ్యర్థనను ఆమోదించి పాలసీ మంజూరు చేస్తుంది. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉండి, ఇచ్చిన సమాచారంలో అస్పష్టత, గోప్యత ఉంటే, లేదా ఇతర కారణాలతో పాలసీ ప్రపోజల్‌ను తిరస్కరించొచ్చు. ఎందుకంటే అప్పటికే ఉన్న ఆరోగ్య చరిత్రను పాత సంస్థ నుంచి నూతన బీమా సంస్థ తీసుకుంటుందన్న విషయాన్ని మర్చిపోవద్దు. పాత బీమా సంస్థకు దరఖాస్తు సమయంలో ఇచ్చిన దానికి భిన్నమైన సమాచారం కొత్త సంస్థకు అందించినట్టయితే తిరస్కరణకు అవకాశాలుంటాయి. అటువంటి సందర్భంలో కొత్త సంస్థను బతిమిలాడే బదులు, ఉన్న సంస్థతోనే కొనసాగడం మంచి నిర్ణయం అవుతుంది. దీనికి బదులు ప్రస్తుత బీమా సంస్థలోనే మెరుగైన ఫీచర్లతో కూడిన ప్లాన్‌కు మైగ్రేట్ అవ్వడం మరో మంచి ఆప్షన్. అప్పటికే దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే, పోర్టింగ్ దరఖాస్తును ఆమోదించాలనేమీ లేదు. ముఖ్యంగా తనకున్న వ్యాధులకు పాత ప్లాన్‌లో క్లెయిమ్ చేసుకుని ఉంటే పోర్టింగ్ దరఖాస్తు తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పాత పాలసీ రెన్యువల్‌కు సంబంధించి ల్యాప్సెస్ ఉంటే అది కూడా తిరస్కరణకు కారణం అవుతుంది. నిబంధనల మేరకు రెన్యువల్ సమయంలో సంప్రదించకుంటే అప్పుడు పోర్టింగ్ విజయవంతం కాదు. అందుకే రెన్యువల్‌కు 60రోజుల ముందు సంప్రదించాలి. 70 ఏళ్లు దాటిన వారికి పోర్టింగ్‌కు అవకాశం ఉండదు.

పోర్టింగ్ ఎలా..?

నూతన సంస్థకు మారిపోవాలని నిర్ణయించుకుంటే రెన్యువల్ సమయంలోనే అనుమతిస్తారు. పాలసీ రెన్యువల్ తేదీకి 60 రోజుల నుంచి 45 రోజుల్లోపు నూతన బీమా సంస్థకు పోర్టింగ్ గురించి తెలియజేయాలి. ఈ సమయంలో వీలు కాకపోతే, తిరిగి రెన్యువల్ వరకు వేచి చూడాల్సిందే. ప్రపోజల్ పత్రం, పోర్టబులిటీ దరఖాస్తు పత్రాలను నింపాలి. ఆరోగ్య చరిత్ర, బీమా సంస్థ కోరిన అన్ని వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. కేవైసీ, ఇతర పత్రాలను కూడా అందించాలి. గత పాలసీ పరిధిలో క్లెయిమ్ చేసి ఉంటే, డిశ్చార్జ్ సమ్మరీ జోడించాలి. అనంతరం ప్రస్తుతం బీమా సంస్థకు పోర్టింగ్ సమాచారం వెళుతుంది. అప్పుడు ప్రస్తుత సంస్థ సదరు పాలసీదారుకు సంబంధించి క్లెయిమ్, ఇతర సమాచారాన్ని కొత్త సంస్థతో పంచుకోవాలి. అప్పుడు నూతన బీమా సంస్థ 15 రోజుల్లోపు తన నిర్ణయాన్ని తెలియజేస్తుంది. పాలసీ దరఖాస్తును ఆమోదిస్తే ప్రీమియం చెల్లించాలి.

వీటిని గమనించాలి..

- పోర్టింగ్ సమయంలో పాత ప్లాన్‌లో నో క్లెయిమ్ బోనస్ ప్రయోజనాలు ఉంటే, కొత్త ప్లాన్‌లోనూ జతవుతాయి. కానీ, దీనికి కంపెనీలు షరతు పెడుతున్నాయి. ప్రస్తుత కవరేజీ రూ. 5 లక్షలు ఉండి, కొత్త సంస్థలోనూ రూ.5 లక్షలే తీసుకుంటే, పాత ప్లాన్ పరిధిలోని నో క్లెయిమ్ బోనస్ పోర్టింగ్ అవ్వదు. అదే రూ.6 లక్షలు తీసుకుంటే నో క్లెయిమ్ బోనస్ కలుస్తుంది.
- పోర్టింగ్ లేదా మైగ్రేషన్‌ను కొత్త ప్రపోజల్‌గానే బీమా సంస్థలు పరిగణిస్తాయి. అండర్‌రైటింగ్ నిబంధనల మేరకు ప్రీమియం నిర్ణయిస్తాయి.
- బేసిక్ ఇండెమ్నిటీ ప్లాన్‌ను మాత్రమే మరో బీమా సంస్థ పరిధిలోని బీమా ఇండెమ్నిటీ ప్లాన్‌కు మార్చుకోగలరు. అంతేకానీ, టాపప్ లేదా క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌ను మార్చుకోలేరు.
- ఒక బీమా సంస్థ నుంచి మరో బీమా సంస్థకు హెల్త్ ప్లాన్‌ను పోర్టింగ్ పెట్టుకుంటే ఎలాంటి చార్జీల్లేవు.
- కార్పొరేట్ లేదా గ్రూప్ ప్లాన్లల ఉన్న వారికి ఇండివిడ్యువల్ ప్లాన్‌కు పోర్టింగ్ అవకాశం లేదు. వారు అదే సంస్థతో కొసాగాల్సిందే.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం అప్

- క్యూ4లో రూ. 12,595 కోట్లు
- షేరుకి రూ. 19 డివిడెండ్



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 21 శాతం ఎగసి రూ. 12,595 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం నికర లాభం ఇదే స్థాయిలో బలపడి రూ. 45,997 కోట్లను అధిగమించింది. వాటాదారులకు షేరుకి రూ. 19 చొప్పున డివిడెండు ప్రకటించింది. మొత్తం బ్రాంచీల సంఖ్య 7,821కు చేరింది. క్యూ4లో 6,000 మందికి ఉపాధి కల్పించింది. మొత్తం సిబ్బంది సంఖ్య 1,73,222ను తాకింది.

స్టాండెలోన్ సైతం

క్యూ4లో స్టాండెలోన్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం 20 శాతం పుంజుకుని రూ. 12,048 కోట్లకు చేరగా.. నికర వడ్డీ ఆదాయం 24 శాతం జంప్‌చేసి రూ. 23,352 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.1 శాతంగా నమోదుకాగా.. 17 శాతం రుణ వృద్ధిని సాధించింది. ఇతర ఆదాయం రూ. 7,637 కోట్ల నుంచి రూ. 8,731 కోట్లకు పెరిగింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,312 కోట్ల నుంచి రూ. 2,685 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 0.4 శాతం బలపడి 19.3 శాతాన్ని తాకింది. అనుబంధ సంస్థలలో బ్రోకింగ్ విభాగం లాభం రూ. 236 కోట్ల నుంచి రూ. 194 కోట్లకు నీరసించగా.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం 28 శాతం ఎగసి రూ. 545 కోట్లను దాటింది.

లారస్ ల్యాబ్స్	కీనోట్ క్యాపిటల్స్	కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 314 టార్గెట్: రూ. 396



ఎందుకంటే: దేశీ ఫార్మాస్యూటికల్ కంపెనీ లారస్ ల్యాబ్స్‌ను డాక్టర్ చావా సత్యనారాయణ 2005లో ఏర్పాటు చేశారు. ప్రధానంగా యాంటీరిట్రోవైరల్(ఏఆర్‌వీ) యాక్టివ్‌ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రెడియంట్(ఏపీఐ) తయారీతో ప్రారంభమైంది. తదుపరి ఫార్ములేషన్స్‌లోకి ప్రవేశించడంతోపాటు, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్(సీడీఎంవో) సర్వీసుల్లోనూ కార్యకలాపాలు విస్తరించింది. తద్వారా సమీకృత ఫార్మాస్యూటికల్ కంపెనీగా ఆవిర్భవించింది. ప్రస్తుతం కంపెనీ జెనరిక్స్ ఏపీఐ, ఫార్ములేషన్స్, సీడీఎంవో సర్వీసులు, బయోటెక్నాలజీలలో కార్యకలాపాలు కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా 60 దేశాలలో ప్రాడక్టులను విక్రయిస్తోంది. మొత్తం ఆదాయంలో 72 శాతంవరకూ ఎగుమతుల నుంచే ఆర్జిస్తోంది. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో తొలి 9 నెలలు(ఏప్రిల్–డిసెంబర్) ఏఆర్‌వీ విభాగంలో ధరల ఒత్తిడిని ఎదుర్కొంది. ఈ విభాగంలో అధిక ప్రొడక్టుల కారణంగా మొత్తం మార్జిన్లపై ప్రభావం పడింది. అయితే ఏఆర్‌వీయేతర, సీడీఎంవో విభాగాలలో సామర్థ్య విస్తరణకు దిగడం ద్వారా ప్రొడక్టు ధరల రిస్కులను తగ్గించుకోనుంది. అంతేకాకుండా పేటెంట్ గడువు ముగియడం(ఎక్స్‌పైరీ)తో లభించే అవకాశాలను సైతం అందిపుచ్చుకునే వీలుంది. ప్రత్యేక ప్రొడక్టులను అభివృద్ధి చేయడం ద్వారా అభివృద్ధి చెందిన మార్కెట్లలో విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తోంది.

టీసీఎస్	రెలిగేర్ బ్రోకింగ్	కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 3,190 టార్గెట్: రూ. 3,882



ఎందుకంటే: టాటా గ్రూప్ దిగ్గజం టీసీఎస్ సాఫ్ట్‌వేర్ సేవలకు దేశంలోనే నంబర్ వన్ కంపెనీగా నిలుస్తోంది. అటు ప్రాంతాలవారీగా ఇటు విభాగాలవారీగా డైవర్సిఫైడ్ కార్యకలాపాలను కలిగి ఉంది. ఐటీ సేవలకు అతిపెద్ద మార్కెట్ ఉత్తర అమెరికా నుంచి 55 శాతంపైగా ఆదాయాన్ని సాధిస్తోంది. ఐటీ సేవలకు అతిపెద్ద విభాగమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్‌ఎస్‌ఐ) నుంచి 31 శాతం అమ్మకాలు అందుకుంటోంది. భవిష్యత్‌లోనూ కంపెనీ అమెరికా, యూరోపియన్ ప్రాంతాలలో పట్టును కొనసాగించే వీలుంది. తద్వారా భారీ ట్రాన్స్‌ఫార్మేషన్ డీల్స్‌ను కుదుర్చుకోవడంలో మరింత పురోగతిని చూపనుంది. విభిన్న విభాగాల(వర్టికల్స్)లో ప్రత్యేకతరహా(యూనిక్) సొల్యూషన్స్ అందించడం ద్వారా పటిష్ట వృద్ధిని సాధిస్తోంది. చౌక వ్యయాల ప్రొడక్టులు, వివిధ ప్లాట్‌ఫామ్స్‌తో క్లయింట్లను ఆకట్టుకుంటోంది. ఇందుకు ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), బ్లాక్‌చైన్ తదితర ఆధునిక టెక్నాలజీలను ఆఫర్ చేస్తోంది. 2021–22కల్లా కంపెనీ ఆర్డర్‌బుక్ 34.6 బిలియన్ డాలర్లను తాకింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. 2022–23 తొలి 9 నెలల్లో 24.1 బిలియన్ డాలర్ల ఆర్డర్‌బుక్‌ను పొందింది. 2023 జనవరి–మార్చిలో భారీ డీల్స్ ద్వారా 10 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది. క్లౌడ్ మైగ్రేషన్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ తదితర సర్వీసులకు పెరుగుతున్న డిమాండ్ కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మిడ్, స్మాల్ క్యాప్‌లో ఎక్కువ పెట్టుబడులు?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పదేళ్లకు మించి నేను సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేయగలను. నా ఈక్విటీ పెట్టుబడుల్లో 50 శాతం నుంచి 60 శాతం మేర స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..? – ఉమేష్ యాదవ్


దీర్ఘకాల పెట్టుబడులకు సంబంధించి ఈక్విటీలకు పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం సరైనది. ఒకే రకం ఫండ్ లేదా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోనే ఎక్కువ పెట్టుబడులు పెట్టడానికి దూరంగా ఉండాలి. 50–60% మేర మిడ్, స్మాల్ క్యాప్స్ పెట్టుబడులతో ప్రధాన పోర్ట్‌ఫోలియో నిర్మించుకోవడం అన్నది సూచనీయం కాదు. దీనికి బదులు ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే మిడ్, స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 25–30 శాతానికి పరిమితం అవుతాయి. లార్జ్‌క్యాప్ పెట్టుబడులు 70% మేర ఉంటాయి. వృద్ధికితోడు, స్థిరత్వాన్ని ప్రదర్శించే స్టాక్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. రిస్క్ ఎక్కువగా ఉండే సాధనాలకు తక్కువ కేటాయింపులు చేసుకోవాలి. మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అనేవి దీర్ఘకాలంలో ఫ్లెక్సీక్యాప్ కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. కానీ, స్వల్పకాలంలో తీవ్ర అస్థిరతల మధ్య చలిస్తాయి. కనుక వీటిల్లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అందుకే వీటికి 50–60% కేటాయింపులు చేయడం వల్ల పెట్టుబడుల్లో అధిక భాగం అస్థిరతలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అధిక అస్థిరతలు ఉన్నా సరే, దీర్ఘకాలంలో అధిక రాబడులు కోరుకుంటే అప్పుడు ఫ్లెక్సీక్యాప్‌తోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

నేను ఒకే విడతలో రూ.3 లక్షలు ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. ఇండెక్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా? లేదా నెలవారీ, త్రైమాసికం వారీ ఆదాయం వచ్చేలా ఎస్‌డబ్ల్యూపీ ఎంపిక చేసుకోవాలా? – శంకర్ నారాయణన్



ఇండెక్స్ ఫండ్ అనేది నిఫ్టీ 50 లేదా సెన్సెక్స్ తదితర సూచీల్లో (ఇండెక్స్‌ల్లో) ఇన్వెస్ట్ చేసేది. మరోవైపు సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) అనేది పెట్టుబడులను క్రమంగా ఉపసంహరించుకునే సాధనం. ఇండెక్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే సంబంధిత సూచీ రాబడులకు అనుగుణంగానే ఉంటాయి. ఎస్‌డబ్ల్యూపీ ద్వారా మీరు కోరుకున్నంత ప్రతి నెలా ఉపసంహరించుకోవచ్చు. రూ.లక్షను 10 నెలల్లో ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకుంటే ప్రతి నెలా రూ.10వేలను ఎస్‌డబ్ల్యూపీగా ఎంపిక చేసుకోవాలి. మీ దగ్గర కొంత మొత్తం ఫండ్ ఉండి, ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటుంటే దాన్ని ఒకే విడత కాకుండా ఆరు నుంచి 12 నెలల పరిధిలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టుకోవాలి. క్రమం తప్పకుండా ఆదాయ మార్గం ఏర్పాటు చేసుకోవాలంటే.. మూడింట ఒక వంతును ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రిస్క్ వద్దనుకునే వారు లార్జ్‌క్యాప్ ఫండ్ లేదా ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఒక ఏడాది అవసరాలకు సరిపడా (మొత్తం పెట్టుబడిలో 6 శాతం మించకుండా) లిక్విడ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌లో, అది కూడా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టుకోవాలి. ఏడాదికోసారి మీ ఈక్విటీ పెట్టుబడులు 33–35 శాతం మించకుండా, తగ్గకుండా రీబ్యాలన్స్ చేసుకుంటూ ఉండాలి. ప్రతి ఏటా ఏడాది అవసరాలకు సరిపడా మొత్తాన్ని లిక్విడ్ ఫండ్స్‌లోకి మళ్లించుకోవాలి. ఈ మొత్తాన్ని ఏటా 5 శాతం పెంచుకుంటూ వెళ్లాలి. అలాగే, ఉపసంహరించుకునే మొత్తం ఏటా పెట్టుబడిలో 6 శాతం మించకుండా చూసుకోవాలి.

బరోడా బీఎన్‌పీ పారిబా ఫ్లోటర్ ఫండ్



బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ కొత్తగా ఫ్లోటర్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది ఓపెన్ ఎండెడ్ డెట్ స్కీము. ప్రధానంగా ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఏప్రిల్ 24 వరకు ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. గడిచిన కొన్నాళ్లుగా వడ్డీ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్లోటింగ్ రేట్ సెక్యూరిటీలపై వచ్చే ఆదాయాలు కూడా పెరుగుతున్నాయని, దీంతో ఇవి ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మారాయని సంస్థ సీఈవో సురేశ్ సోనీ తెలిపా రు. ఈ ఫండ్‌కు ప్రశాంత్ పింప్లే, మయాంక్ ప్రకాష్ ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. క్రిసిల్ లో డ్యూరేషన్ డెట్ సూచీ దీనికి ప్రాతిపదికగా ఉంటుంది.

ఐసీఐసీఐ ప్రు ఇన్నోవేషన్ ఫండ్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యుచువల్ ఫండ్ తాజాగా ఇన్నోవేషన్ ఫండ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ థీమాటిక్ ఫండ్ ఏప్రిల్ 24 వరకు అందుబాటులో ఉంటుంది. కొత్త ఆవిష్కరణ వ్యూహాలు, థీమ్‌లతో ప్రయోజనం పొందే కంపెనీల షేర్లు, అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్‌లు, ఈటీఎఫ్‌ల యూనిట్లలో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ క్యాప్‌పరమైన పరిమితులు లేవు. స్కీమ్ ద్వారా సేకరించిన నిధుల్లో కనీసం 80 శాతం భాగాన్ని ఇన్నోవేషన్ వ్యూహాలు అమలు చేసే కంపెనీల్లో పెట్టుబడి పెడతారు. 20 శాతం వరకు మొత్తాన్ని ఏడీఆర్, జీడీఆర్, విదేశీ సెక్యూరిటీలు, మ్యుచువల్ ఫండ్లు, ఈటీఎఫ్‌లు మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేయొచ్చు. మహమ్మారి అనంతర పరిస్థితులు, ద్రవ్యోల్బణం, భౌగోళిక–రాజకీయ పరిస్థితులు, వడ్డీ రేట్లు ఒక స్థాయిలో కుదురుకుంటూ ఉండటం మొదలైన అంశాలు ఇన్నోవేషన్ థీమ్‌కు సానుకూలంగా ఉండగలవని సంస్థ హెడ్ (ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ) చింతన్ హరియా తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీ లాసెట్ దరఖాస్తుకు ఈ నెల 22 వరకు గడువు



ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లోని లా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్ -2023కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉందని ఏపీ లాసెట్-2023 కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.500 ఆలస్య రుసుంతో ఈ నెల 29వ తేదీ వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో మే నెల 5వ తేదీ వరకు, రూ. 2వేలు ఆలస్య రుసుంతో మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తుల్లోని తప్పులను మే నెల 10, 11 తేదీల్లో సరిచేసుకోవచ్చని తెలిపారు. లాసెట్ ప్రవేశ పరీక్ష మే నెల 20వ తేదీన జరుగుతుందని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సు చదివేందుకు డిగ్రీ లేదా పీజీ కోర్సులను ఓసీ కేటగిరీ అభ్యర్థులు 45 శాతం మార్కులతోను, బీసీ కేటగిరీ అభ్యర్థులు 42 శాతం మార్కులతోను, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు 40 శాతం మార్కులతోను ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సు చదివేందుకు ఇంటర్మీడియట్ కోర్సును ఓసీ కేటగిరీ అభ్యర్థులు 45 శాతం మార్కులతోను, బీసీ కేటగిరీ అభ్యర్థులు 42 శాతం మార్కులతోను, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు 40 శాతం మార్కులతోను ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఎల్ఎల్ఎం కోర్సు చదవాలనుకునే విద్యార్థులు ఎల్ఎల్‌బీ మూడు లేదా ఐదు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

గుండెపోటుతో ఎనిమిదో తరగతి విద్యార్థి మృతి



మృతిచెందిన కోటిస్వాములు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌కు చెందిన ఓ విద్యార్థి గుండెపోటుతో శనివారం రాత్రి మృతిచెందాడు. పిడుగురాళ్ల మండలంలోని గుత్తికొండ గ్రామానికి చెందిన మందా కోటేశ్వరరావు కుమారుడు కోటిస్వాములు పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ ఇక్కడే జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి భోజనం అనంతరం స్టడీ అవర్ సమయంలో కోటిస్వాములు తనకు ఊపిరి ఆడటం లేదని స్నేహితులకు చెప్పటంతో గాలి వీచే ప్రదేశంలో కూర్చోవాలని సూచించారు. వెంటనే గదిలోని ఫ్యాన్ కింద కూర్చునేందుకు వెళ్లి కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న నలుగురు స్నేహితులు కోటిస్వాములను లేపేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో వాచ్‌మన్‌కు సమాచారం అందించారు. వాచ్‌మన్ వచ్చి హాస్టల్ వార్డెన్‌కు తెలియజేయడంతో హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రాథమిక పరీక్షలు చేసి కోటిస్వాములు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుత్తికొండలో ఉంటున్న బాలుడు తల్లిదండ్రులకు వార్డెన్ గోపీనాయక్ సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి హాస్పిటల్ వద్ద బాలుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలే అనుసరించాలి

- రాష్ట్రాలకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ లేఖ



సాక్షి, అమరావతి: జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ), దాని మార్గదర్శకాలతో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ) నిర్దేశించిన పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలను మాత్రమే పాఠశాలలు అనుసరించేలా చూడాలని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) అన్ని రాష్ట్రాల విద్యాశాఖలకు శనివారం లేఖలు రాసింది. రాష్ట్రాల్లోని విద్యాసంస్థలు ఎన్‌సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీ నిర్దేశించిన పాఠ్యాంశాలను కాకుండా వేరే పాఠ్యపుస్తకాలతో బోధనను అనుమతించవద్దని పేర్కొంది. ఇటీవల ఎన్సీఈఆర్టీ జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో సవరణ చేసి నూతన జాతీయ పాఠ్యప్రణాళిక ప్రకారం పలు సబ్జెక్టులకు కొత్త పాఠ్యాంశాలతో నూతన పుస్తకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. హేతుబద్ధీకరించిన ఈ కొత్త పాఠ్యాంశాలతో కూడిన ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలు అందరికీ అందుబాటులోకి కూడా వచ్చాయి. హేతుబద్ధీకరణ చర్యల్లో భాగంగా పాఠశాల పాఠ్యపుస్తకాల నుంచి ఎన్‌సీఈఆర్టీ మొఘలులు, మహాత్మా గాంధీ, నాథూరామ్ గాడ్సే, గుజరాత్ అల్లర్లు తదితర అంశాలను తొలగించడంతో విమర్శలు వెల్లువెత్తడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త పాఠ్యపుస్తకాలను మాత్రమే విద్యార్థులకు బోధించాలని ఎన్‌సీపీసీఆర్ లేఖ రాయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆశాకిరణం ఆఫ్రికా..!

సంతానోత్పత్తి రేటులో టాప్ 29 దేశాలు చీకటి ఖండంలోనే

- 6.9 రేటుతో అగ్రస్థానంలో నైజర్
- 'థ్రెష్ హోల్డ్ లిమిట్'తో భారత్‌కు 103వ స్థానం
- 50 ఏళ్లలో రెట్టింపైన ప్రపంచ జనాభా..
- ప్రపంచ బ్యాంక్ నివేదికలో వెల్లడి


(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

19వ శతాబ్దం ప్రారంభంలో 100 కోట్ల మైలురాయిని చేరుకున్న ప్రపంచ జనాభా ఆ తరువాత ఎనిమిది రెట్లు పెరిగింది. ప్రస్తుతం భూమి మీద 800 కోట్ల మంది నివసిస్తుండగా సగం జనాభా 1975 తర్వాతే పెరిగింది. 50 ఏళ్లలో ప్రపంచ జనాభా రెట్టింపు అయింది. దాదాపు 140 కోట్ల జనాభా కలిగిన భారత్ సంతానోత్పత్తి రేటులో 'థ్రెష్ హోల్డ్ లిమిట్' దశకు చేరుకోగా 2.6 కోట్ల జనాభా ఉన్న ఆఫ్రికా దేశం నైజర్ సంతానోత్పత్తి రేటులో అగ్రస్థానంలో ఉంది. జనాభా నిరంతర పెరుగుదలకు ప్రధాన కారణం నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో పాటు పోషకాహార లభ్యత పెరగడం. అయితే క్రమంగా సంతానోత్పత్తి రేటు క్షీణిస్తుండటంతో జనాభా వృద్ధికి అడ్డుకట్ట పడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. 2100 నాటికి జనాభా పెరుగుదల ఆగిపోతుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. వివిధ దేశాల్లో సంతానోత్పత్తి రేటును విశ్లేషించి ఓ నివేదిక రూపొందించింది.



సంతానోత్పత్తిలో టాప్ 10 దేశాలు (సంతానోత్పత్తి రేటు)

1	నైజర్	6.9
2	సోమాలియా	6.4
3	చాద్	6.4
4	కాంగో	6.2
5	మాలి	6.0
6	సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్	6.0
7	అంగోలా	5.4
8	నైజీరియా	5.3
9	బురండి	5.2
10	బెనిన్	5.1
103	భారత్	2.05



అత్యల్ప సంతానోత్పత్తి దేశాలు (సంతానోత్పత్తి రేటు)

దక్షిణ కొరియా	0.8
హాంకాంగ్	0.9
ప్యూర్టోరికో	0.9
మకావ్	1.0
సింగపూర్	1.1
మాల్టా	1.1
ఉక్రెయిన్	1.2
స్పెయిన్	1.2
ఇటలీ	1.2
చైనా	1.3
అమెరికా	1.64

'థ్రెష్ హోల్డ్ లిమిట్'లో భారత్..

1960లో ప్రపంచ సరాసరి సంతానోత్పత్తి రేటు 4.7 కాగా 2020 చివరి నాటికి 2.3కి పడిపోయింది. సంతానోత్పత్తి రేటు 2.1గా ఉంటే జనాభాలో పెరుగుదల, తగ్గుదల నమోదు ఉండదు. ముందు తరం స్థానంలో తర్వాత తరం వచ్చి చేరుతూ ఉంటుంది. దీన్ని 'థ్రెష్ హోల్డ్ లిమిట్' లేదా 'రీప్లేస్‌మెంట్ రేట్'గా వ్యవహరిస్తారు. ప్రపంచ జనాభాలో దాదాపు మూడింట రెండు వంతుల మంది 'రీప్లేస్‌మెంట్ రేట్' కంటే తక్కువగా ఉన్న ప్రాంతంలో నివసిస్తున్నారు. మన దేశం కూడా ఈ కేటగిరీలోనే ఉంది. ప్రస్తుతం మన దేశంలో సంతానోత్పత్తి రేటు 2.05గా ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు పేర్కొంది.

సంతానోత్పత్తి క్షీణించడానికి కారణాలు

- గర్భ నిరోధ అవకాశాలు పెరగడం
- శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం
- అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం

తగ్గినా తిప్పలే..

సంతానోత్పత్తి రేటు క్షీణించడం వల్ల అనేక దేశాల్లో మెరుగైన సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమైంది. అయితే ఈ విజయగాథలు గత చరిత్రే. ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. భారీ జనాభాతో ఇబ్బందులున్నప్పటికీ సంతానోత్పత్తి రేటు 'రీప్లేస్‌మెంట్ రేట్' కంటే తక్కువగా ఉన్నప్పుడు భిన్న సమస్యలు తలెత్తుతాయి. పని చేసేవారు, పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకుంటున్న వారి నిష్పత్తిలో భారీ వ్యత్యాసం చోటు చేసుకుంటుంది. వృద్ధుల వైద్య ఖర్చులు పెరగడంతో పాటు సంపాదించి పన్నులు చెల్లించేవారి సంఖ్య తగ్గిపోవడం లాంటి పరిణామాలు ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతాయి.

దీర్ఘ కాలంలో..

ఇతర దేశాల నుంచి వలసలను ప్రోత్సహించి తాత్కాలికంగా జనాభా తగ్గుదల, మానవ వనరుల కొరతను ఎదుర్కొన్నా దీర్ఘకాలిక వ్యూహాలు అవసరమని ఐక్యరాజ్య సమితి సూచించింది. పిల్లలు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

దక్షిణ కొరియాలో అత్యల్పం

ఆఫ్రికా ఖండంలోని దేశాల్లో అత్యధిక సంతానోత్పత్తి రేటు నమోదవుతోంది. నైజర్ 6.9 సంతానోత్పత్తి రేటుతో నంబర్ 1 స్థానంలో ఉంది. అంటే నైజీరియాలో ఒక మహిళ తన జీవితకాలంలో ఏడుగురు పిల్లలకు జన్మనిస్తుంది. అఫ్గనిస్తాన్ (14వ స్థానం) మినహా సంతానోత్పత్తిలో టాప్ 30 దేశాలన్నీ ఆఫ్రికాలోనే ఉన్నాయి. 2100 నాటికి ఆఫ్రికా 250 కోట్ల మందిని ప్రపంచ జనాభాకు జోడిస్తుందని అంచనా. మిగతా ఖండాల్లో జనాభా పెరుగుదల దాదాపుగా ఉండదు. ఇక అత్యల్ప సంతానోత్పత్తి రేటు ఉన్న దేశం దక్షిణ కొరియా. అక్కడ సంతానోత్పత్తి రేటు 0.84 మాత్రమే ఉంది. ఆసక్తికరంగా అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్, అమెరికాలో సంతానోత్పత్తి రేటు 'రీప్లేస్‌మెంట్ రేట్' కంటే దిగువన ఉండటం గమనార్హం. ఐరోపా, ఉత్తర అమెరికాలోని కొన్ని ప్రాంతాలు 1970 నుంచి తక్కువ సంతానోత్పత్తి రేటుతో కొనసాగుతున్నాయి.

ఇంటికో ఇంకుడు గుంత

- వైఎస్సార్-జగనన్న ఇళ్ల వద్ద నిర్మాణం
- ఒక్కో గుంత నిర్మాణానికి రూ.6 వేల వరకు ఖర్చు
- వీటినే తాత్కాలికంగా డ్రెయినేజీ అవసరాలకు వినియోగం
- రానున్న కాలంలో వాన నీటిని భూమిలోకి ఇంకించడానికి వినియోగం

సాక్షి, అమరావతి: వైఎస్సార్-జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వేలకు పైగా లేఅవుట్‌లలో 30.25 లక్షల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా.. రెండు దశల్లో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. వీటిలో 17.66 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఆయా కాలనీల్లో రూ.32 వేల కోట్లకు పైగా నిధులతో శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు ఇప్పటికే కరెంట్, నీటి సరఫరా కనెక్షన్లు చకచకా ఇస్తున్నారు. ఇదిలావుండగా శాశ్వత మౌలిక సదుపాయాలైన డ్రెయిన్లు, రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించాలంటే కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయి ఉండాలి. అలాకాకుండా సదుపాయాలు కల్పిస్తే ఇళ్ల నిర్మాణ సమయంలో భారీ వాహనాల రాకపోకలు, ఇతర సందర్భాల్లో డ్రెయిన్లు, కాలువలు ధ్వంసమవుతాయి. ఈ క్రమంలో ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్ల వద్ద తాత్కాలిక డ్రెయినేజీ అవసరాల కోసం ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



తిరుపతి జిల్లా గుంటక్రిందపల్లి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

ఒక్కో గుంతకు రూ.6 వేలు

ఒక్కో ఇంకుడు గుంత నిర్మించడానికి దాదాపు రూ.6 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఈ మొత్తాన్ని సంబంధిత ఇంటి లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 3.40 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. కాగా, తొలి దశలో 7,278 కాలనీల్లో 1,11,770 ఇళ్లకు ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎంపీడీవోలు/మునిసిపల్ కమిషనర్ల నేతృత్వంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు/వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇంకుడు గుంతల నిర్మాణం పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. వీరికి గ్రామీణ మంచినీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంతో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పలు ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభించారు.

భూగర్భ జలం పెరుగుతుంది



ప్రస్తుతం నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను తాత్కాలిక డ్రెయినేజీ అవసరాల కోసం వినియోగిస్తాం. పూర్తి స్థాయిలో డ్రెయిన్లు, కాలువలు నిర్మించిన అనంతరం ఇంట్లో వృథాగా పోయే నీటితోపాటు వర్షపు నీటిని కూడా ఈ గుంతల్లోకి చేర్చవచ్చు. తద్వారా భూగర్భ జలం పెరుగుతుంది. కాలనీల్లో పెద్దఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో భూగర్భ జలాల అభివృద్ధికి దోహదపడుతుంది.

– అజయ్‌జైన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గృహ నిర్మాణ శాఖ

ఎండీయూ ఆపరేటర్లకు వాహన బీమా చెల్లింపు

- 2022లో బ్యాంకు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తున్న ప్రభుత్వం
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఇంటింటికీ రేషన్ పంపిణీ (ఎండీయూ) వాహన ఆపరేటర్ల నుంచి 2022లో బ్యాంకు వసూలు చేసిన వాహన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9,260 వాహనాలకుగాను ఇప్పటికే 2,725 ఎండీయూలకు రూ.2.77 కోట్లకు పైగా చెల్లించినట్టు తెలిపారు. మిగిలిన 6,535 వాహనాలకు కూడా రూ.10,190 చొప్పున రెండు రోజుల్లో వారి ఖాతాల్లో జమచేస్తామని పేర్కొన్నారు. 2021లో ఎండీయూ వ్యవస్థను ప్రారంభించగా ఆ ఏడాది వాహన తయారీ సంస్థే బీమా ప్రీమియాన్ని భరించిందని, రెండో ఏడాది బ్యాంకు వారు ఎండీయూ ఆపరేటర్ల ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా ప్రీమియాన్ని జమ చేసుకున్నారని వివరించారు. బీమా ప్రీమియం తమకు ఆర్థిక భారంగా మారిందని ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన చెందిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా ఆదేశించారని తెలిపారు.



వైఎస్సార్ వాహనమిత్రతో ఆర్థిక భరోసా

ఇకపై ఎండీయూ ఆపరేటర్లు వాహన బీమా ప్రీమియం చెల్లించేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందించాలని సీఎం జగన్ నిర్ణయించినట్టు తెలిపారు. దీంతోపాటు ప్రభుత్వాన్ని, వాహనదారులను సంప్రదించకుండా 2023కు బీమా ప్రీమియాన్ని జమ చేసుకున్న బ్యాంకుకు.. ఆ మొత్తాన్ని తిరిగి ఆపరేటర్ల ఖాతాల్లో వేసేలా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. మొబైల్ డిస్పెన్సరీ యూనిట్లను ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం మాత్రమే వినియోగిస్తున్నందున బీమా ప్రీమియాన్ని తగ్గించేందుకు వీలుగా వాహనాలను కమర్షియల్ కేటగిరి నుంచి నాన్-కమర్షియల్ కేటగిరిగా మార్చినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు 7,963 వాహనాలకు నాన్-కమర్షియల్ కేటగిరి కింద రిజిస్ట్రేషన్ సర్టిఫికేషన్ మార్చినట్టు తెలిపారు. మిగిలిన వాహనాలకు సైతం మంగళవారం నాటికి క్లాసిఫికేషన్ మారుస్తామని, అనంతరం కొత్తగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. ఇందుకు ఒక్కో వాహనానికి రూ.600 అయ్యే ఖర్చు నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. మరోవైపు పీడీఎస్‌తో పాటు అదనంగా ఐసీడీఎస్, స్కూళ్లకు సరుకులు తరలిస్తున్న నేపథ్యంలో ఆపరేటర్లకు సర్వీస్ చార్జీలను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు.

చలాకీగా ఉండే ఓ 35 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. ఉన్నట్టుండి ముభావంగా మారిపోయాడు. బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు.. ఎవరితోనూ పెద్దగా మాట్లాడటం లేదు. ఎవరితోనూ కలవడం లేదు. అసలు ఇల్లు వదిలి బయటికి రావడం లేదు.

డిగ్రీ చదువుతున్న ఓ అమ్మాయి.. కాలేజీకి వెళ్లడం మానేసింది.. అలాగని స్నేహితులతో షికార్లు, కబుర్లు వంటివి కూడా లేవు.. ఎప్పుడు చూసినా ఇంట్లోనే ఓ గదిలో కూర్చుండి పోతోంది.. ఏమిటని అడిగితే బాగానే ఉన్నానంటోంది..

.. ఏమైంది ఈ ఇద్దరికి? వారు దారుణమైన ఘటనలేమీ ఎదుర్కోలేదు.. తీర్చలేని ఇబ్బందేమీ ఎదురుకాలేదు.. కానీ 'హికికోమోరి'బారినపడ్డారు. అందరికీ దూరంగా ఏకాంతంగా గడిపేస్తున్నారు. అసలు ఏమిటీ 'హికికోమోరి'? అదేమైనా మానసిక సమస్యా? దానికి కారణాలేమిటి? నిపుణులు ఏం చెప్తున్నారో తెలుసుకుందామా..

ఒంటరి.. హికికోమోరి



జపాన్‌లో 15లక్షల మందికి..

ఆరోగ్య శాఖ ఇటీవల ఓ సర్వే చేసింది. దాదాపు 15 లక్షల మంది 'హికికోమోరి'పరిస్థితిలో ఉంటున్నారని గుర్తించింది. నెలలు, సంవత్సరాలుగా వారు ఎవరితోనూ కలవడం లేదని తేల్చింది. వారి మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీన్ని చక్కదిద్దడానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. దానిపై స్పందించిన పలు స్థానిక సంస్థలు.. 'హికికోమోరి'లతో మెటావర్స్ వేదిగా సమావేశాలు నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. దీనికి సంబంధించి భారత్ సహా పలు దేశాల ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి.



ఏమిటీ హికికోమోరి?



సామాజిక జీవనానికి దూరంగా దాదాపు ఒంటరితనంతో కూడిన జీవితాన్ని గడపడమే 'హికికోమోరి'. 1980వ దశకంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం, ఉద్యోగాలు, ఉపాధి దెబ్బతినడంతో.. తొలిసారిగా ఇలాంటి పరిస్థితిని గుర్తించారు. దానికి 'హికికోమోరి (అంతర్ముఖులుగా మారిపోవడం)'అని పేరుపెట్టారు. దీనిబారిన పడినవారు తమచుట్టూ తామే గిరి గీసుకుని బతికేస్తుంటారు. అలవాట్లను మార్చుకుంటారు. మానసిక ఆందోళన (యాంగ్జైటీ), కుంగుబాటు (డిప్రెషన్), అందరి మధ్య ఉన్నా ముభావంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొందరిలో అయితే ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు కూడా వస్తుంటాయని నిపుణులు చెప్తున్నారు. అయితే ఇప్పటివరకు అధికారికంగా దీనిని మానసిక సమస్యగా ప్రకటించలేదు.

దీనికి కారణాలేమిటి?



సామాజిక, విద్య, ఉద్యోగ పరమైన ఒత్తిళ్లు, కుంగుబాటు, ఆర్థికపరమైన సమస్యలతో ఆందోళన, వివిధ రకాల వేధింపులు వంటివి 'హికికోమోరి'పరిస్థితికి దారితీస్తాయని నిపుణులు చెప్తున్నారు. ''ఉమ్మడి కుటుంబాలు, సామాజిక సంబంధాలు తగ్గిపోవడం, విద్య, ఉద్యోగాల్లో తీవ్రమైన పోటీ వంటివి కూడా హికికోమోరి సిండ్రోమ్‌కు దారితీస్తాయి. ఇది వారిపై వ్యక్తిగతంగా, పరోక్షంగా సమాజంపైనా వ్యతిరేక ప్రభావం చూపుతుంది''అని కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ విష్ణుప్రియ భగీరథ్ తెలిపారు.

బయటపడేందుకు డబ్బులిస్తూ..

దక్షిణకొరియాలో 19 ఏళ్ల నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్న మూడున్నర లక్షల మంది 'హికికోమోరి' సమస్యతో బాధపడుతున్నట్టు ఆ దేశ ఆరోగ్యశాఖ ఇటీవల గుర్తించింది. ముఖ్యంగా తొమ్మిదేళ్ల నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు, ఉద్యోగులపై ప్రభావం ఎక్కువగా ఉందని తేల్చింది. వారిని ఈ సమస్యను బయటపడేలా ప్రోత్సహించేందుకు నెలకు సుమారు రూ.40 వేలు (490 డాలర్లు) లివింగ్ అలవెన్స్‌గా ఇవ్వనున్నట్టు ఆ దేశ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.


కుటుంబం, దగ్గరివారితో పరిష్కారం!



'హికికోమోరి'బారినపడినవారు అందరికీ దూరంగా, ఏకాంతంగా గడపడం వల్ల మరింతగా మానసిక, శారీరక సమస్యలు చుట్టుముడతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక్కోసారి ఇవి తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరిస్తున్నారు. దీని బాధితులు మందుల కంటే.. కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల సాంత్వన వంటి మార్గాల ద్వారానే త్వరగా కోలుకుంటారని స్పష్టం చేస్తున్నారు. ఇదే సమయంలో అవసరమైతే డిప్రెషన్ వంటి కొన్ని సమస్యలకు మందులు వాడితే సరిపోతుందని అంటున్నారు. సంస్థలు, కార్యాలయాలు తమ ఉద్యోగుల్లో, విద్యా సంస్థలు తమ విద్యార్థులలో ఒత్తిడి తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

భారత్ సహా అన్ని దేశాల్లోనూ..

అన్ని రంగాల్లో పోటీ విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితులకు తోడు కరోనా మహమ్మారి దెబ్బతో 'హికికోమోరి'పరిస్థితి పెరిగిపోయిందని నిపుణులు చెప్తున్నారు. ''ఆర్థిక మాంద్యం, ఉద్యోగాలు పోవడం, ఉపాధి దెబ్బతినడం, నెలలకు నెలలు లాక్‌డౌన్, కోవిడ్ బారినపడి ఆరోగ్యం దెబ్బతినడం వంటివాటి నుంచి కోలుకోవడానికి చాలా మంది ఇంకా ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారు హికికోమోరి బారినపడుతున్నారు..''అని ఢిల్లీకి చెందిన లైఫ్ కోచ్, సైకాలజిస్ట్ నిఖిలా దేశ్‌పాండే వివరించారు. వర్క్ ఫ్రం హోం, అన్నిరకాల సరుకుల హోం డెలివరీ వంటివి దీనికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఒక్క జపాన్ అనే కాకుండా ప్రపంచదేశాలన్నిటా ఇలాంటి పరిస్థితి కనిపిస్తోందని వెల్లడించారు. భారతదేశంలో మానసిక ఆరోగ్యంపై దృష్టిపెట్టడం చాలా తక్కువకావడంతో.. 'హికికోమోరి'సమస్య తలెత్తినా గుర్తించడం కష్టమని పేర్కొన్నారు.



8% 2017 నాటి ఆస్పెన్ అధ్యయనం ప్రకారం.. భారతదేశంలో ఒంటరితనంతో బాధపడుతున్న యువత

- సాక్షి సెంట్రల్ డెస్క్

విద్యా కానుకపై 'ఈనాడు' తప్పుడు ప్రచారం

- షూ సైజు సరిపోవడం లేదంటూ తప్పుడు రాతలు..
- ముఖ్య కార్యదర్శి పర్యటనపై అవాస్తవాలతో వార్త..

సాక్షి, అమరావతి: జగనన్న విద్యా కానుకపై 'ఈనాడు' దినపత్రిక అసత్యాలతో దుష్ప్రచారం సాగిస్తోందని పాఠశాల విద్యా శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'విద్యా కానుక బూట్లు కాళ్లకు పట్టవు' శీర్షికన ఆదివారం ప్రచురితమైన వార్త పూర్తిగా అవాస్తవమని ఖండించింది. 'ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం వేముల కోట జడ్పీ ఉన్నత పాఠశాలను ఈనెల 15న పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సందర్శించారు. 7వ తరగతికి వెళ్లి విద్యార్థులు ధరించిన షూలను పరిశీలించారు. కొంత మంది విద్యార్థులు షూ ధరించలేదు. ఇందుకు వారు చెప్పిన కారణాలు సహేతుకంగా లేకపోవడంతో వారికి ఇచ్చిన షూలు సరిగా ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు వారి ఇళ్లకు వెళ్లారు. జి.సందీప్ కుమార్, కె.శివపార్వతి ఇళ్ల వద్ద ఉన్న వారి షూలను పరిశీలించారు. అవి ఆ విద్యార్థులకు సరిగ్గా సరిపోయాయి. ఎలాంటి డ్యామేజీ కూడా లేదు. దీంతో ఆ షూలను విద్యార్థులకు తొడిగించారు. ప్రతి రోజూ పిల్లలతో షూ ధరింపచేసి స్కూళ్లకు పంపాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఆ తర్వాత ఆ పిల్లలను తన వెంట స్కూలుకు తీసుకెళ్లారు. అక్కడి టీచర్లతో సమావేశమై 100 రోజుల పాటు అలవాటు చేస్తే విద్యార్థులు తప్పకుండా షూ వేసుకొని వస్తారని సూచించారు. ప్రకాశం జిల్లాలో 21 వేల మంది విద్యార్థులకు సంబంధించిన షూ లను ఎక్స్ఛేంజ్ చేసి అందించారు. ఈ మేరకు విద్యా శాఖ అన్ని స్కూళ్ల హెచ్ఎంల నుంచి విద్యార్థులందరికీ షూలు సరిపోయాయని డిక్లరేషన్ కూడా తీసుకుంది. ఈ వాస్తవాలను విస్మరించి, విద్యా కానుక బూట్లు విద్యార్థులకు పట్టవు అంటూ 'ఈనాడు' అసత్యాలతో వార్త ప్రచురించడం దారుణం. ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది' అని ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

శబరిమల విమానాశ్రయం భక్తులకు వరం

- ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: శబరిమలలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం తెలుగు రాష్ట్రాల భక్తులకు వరమని కేంద్ర పర్యాటక మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అంగీకరించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర పౌర విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఏటా కోట్ల సంఖ్యలో శబరిమలను సందర్శించే భక్తులకు విమాన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను ప్రధానికి వివరించగా, సూత్రప్రాయంగా అంగీకరించారని చెప్పారు. విమానాశ్రయ ఏర్పాటుకు ప్రధాని మోదీ సైట్ క్లియరెన్స్‌కు ఆమోదం తెలిపారని, ఇంకా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943